
Regd. No. H. 373

ఆంధ్ర ప్రదేశ్



సంపుటి 3
సంచిక 12

కార్తీక, 1881 శకము
అక్టోబరు 1959

సమాచార పౌర సంబంధములశాఖ, ఆంధ్రప్రదేశ్

దేశంతో పాటు మీరు కూడా అభ్యుదయం పొందండి!

మీరు మిగుల్చుకున్న డబ్బును

భారత ప్రభుత్వ చిన్నమొత్తాల పొదుపు పథకమునకు పెట్టుబడి పెట్టండి!

భారత దేశంయొక్క

సమాజాభివృద్ధి కార్యక్రమమునకు, గొప్ప నదీలోయ ప్రాజెక్టులకు,
రైలుమార్గములు, రోడ్ల అభివృద్ధికి తోడ్పడండి!

మీ డబ్బును ఈ క్రింది గ్యారంటీడ్ సెక్యూరిటీలలో దేనిలోనైనా పెట్టుబడి పెట్టండి:

12 సంవత్సరముల నేషనల్ ప్లాన్ సేవింగ్సు సర్టిఫికెట్లు—

పరిణతి పొందిన పిమ్మట నూటికి సంవత్సరానికి 5.41 వంతుల చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది. ఇవి రూ. 5 లవి మొదలు రూ. 5,000లవి వరకూ లభిస్తాయి. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ. 25.000 ల వరకూ కొనవచ్చు.

10 సంవత్సరముల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు—

ఏటా నూటికి 4 వంతులు వడ్డీ చెల్లించబడుతుంది. ఒక్కొక్కరు రూ. 50 లవి మొదలు రూ. 25,000 ల వరకూ కొనవచ్చు.

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు అక్కౌంట్లు—

రూపాయలు 25 నుంచి 10,000 ల వరకూగల నిల్వలపై నూటికి 2½ వంతుల చొప్పున రూ. 10,000 లను మించిన నిల్వలపై నూటికి 2 వంతున చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది.

15 సంవత్సరముల ఆన్యూయిటీ సర్టిఫికెట్లు (రెండవ సీరీస్)

జారీ చేయబడు ధరలు: రూ. 3,325, 6,650, 13,300 మరియు 26,600.

(ఈ సొమ్ము నూటికి సంవత్సరానికి కొంచెమెక్కువగా 4 వంతుల చొప్పున యిచ్చే చక్రవడ్డీతో సహా నెలసరి వాయిదాలలో 15 సంవత్సరాలలో తిరిగి చెల్లించబడుతుంది.)

≡ వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ. 26,600 ల వరకు కొనవచ్చు ≡

ఆదాయంపన్ను లేకుండా మీకు మంచి ఆదాయం లభిస్తుంది!

భావి భారత సౌభాగ్యానికై పెట్టుబడి పెట్టండి!

: ఇతర వివరములకు ఈ పెట్టుబళ్ళకు సంబంధించిన నిబంధనావళికొరకు :

నేషనల్ సేవింగ్సు కమిషనర్,
నాగపూర్.
చిరునామాకు గాని

లేక

రీజియనల్ నేషనల్ సేవింగ్సు, ఆఫీసర్,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు (దక్కన్)
చిరునామాకుగాని వ్రాయాలి.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి 3 | అక్టోబర్, 1959 | సంచిక 12
కార్తీకము, శకము—1881

విషయ సూచిక

ముఖ చిత్రం

2-10-59 న భారతదేశం జాతిపిత 90వ. జన్మదినోత్సవాన్ని జరుపుకున్నది.

చందా వివరాలు :

సంవత్సరానికి ... 2 రూపాయల 16 నయాపైసలు.

విడి ప్రతి నెల ... 18 నయాపైసలు,

Edited and Published by the Director of Information and Public Relations, Hyderabad
Printed at: Vir Milap Press, Mukaramjahi Road, Hyderabad.

విశిష్టుడయిన విజ్ఞాన శాస్త్రవేత్త

"ప్రపంచంలో అందరికీకూడా ఒక్క నిష్కళంకత్వము (అహింస). సత్యమే శరణ్యం. ఇందుకు స్త్రీ పుః వివక్షత, నలుపు, తెలుపు, ప్రాచ్య పాశ్చాత్య భేదాలు లేవు." అని 90 సంవత్సరాల క్రితం జన్మించి అహింసద్వారా భారత స్వాతంత్ర్య నిర్మాత అయిన పురుష పుంగవుడు వ్రాశాడు.

కళంక రాహిత్యంలో సజీవమైన యీ విశ్వాసాన్ని జీవితం అన్ని రంగాలకు వైజ్ఞానికంగా వర్తింపచేసి కన్ను చెదిరే విజయాన్ని సాధించటం వల్లనే సర్వ ప్రపంచం ప్రశంసలు, ఆరాధనలు కైవసం అయినవి.

మద్రాసు లార్డ్ బిషప్పు అయిన ఒక ప్రముఖ ఆంగ్లుడు ఇలా అన్నాడు: ''గాంధీగారు దయా ధర్మాలకై కష్టాలను ఓరిమితో సహిస్తున్నారు. ఆయనను ఖైదులోకి తోసి ఇంకా క్రైస్తవులమని చెప్పుకునే మనుషులకంటె శిలువపడిన ఆ రక్షకునికి ఆయనయే మిన్నయయిన ప్రతినిధి. ఇది చెప్పడం నాకు మిక్కిలి బాధాకరమే అయినా దాపరికంలేకుండా చెబుతున్నాను.''

గాంధీజీ సందర్శనం గురించి వ్రాస్తూ ప్రముఖ అమెరికన్ డా. షెర్‌వుడ్ ఎడ్డీ ఇలా అన్నారు:— ''ఆయన అచ్చంగా బుద్ధునిలా ప్రశాంతంగా, నిర్వికారంగా ఉన్నారు. వయోవృద్ధమయిన ఆ ముఖంలో ప్రపంచంలో ఎక్కడా లేని అపురూపమైన ఒక తేజస్సు గోచరించింది. భగవంతునిలో జీవిస్తున్న పురుషుని చూశాను నేను.''

మహా ఫలితాలను సాధించిన యీ అహింసా శాస్త్రమేమిటి? గాంధీజీ మాటలలోనే—

"విధ్వంసంలో జీవితానికి పట్టుదల వుంటుంది. కాబట్టి విధ్వంసం కంటె వున్నత సూత్రం వుండాలి. ఆ సూత్రం క్రిందనే సువ్యవస్థితమైన సంఘం రూపురేఖలు దిద్దుకుంటుంది. అప్పుడే మనిషి జీవించటానికి యోగ్యత ఉంటుంది.

''జీవన సూత్రం అది అయితే, దానిని మనం దైనందిన జీవితంలో సాధించాలి. ఎక్కడ యుద్ధాలు ఉన్నా, ఎక్కడ మీకు ప్రతికక్షి ఎదురైనా, అతనిని ప్రేమతో జయించండి. నా జీవితంలో ప్రేమ సూత్రం విధ్వంసక సూత్రం ఎన్నడూ పని చేయనంత చక్కగా పని చేసింది.

''మనదేశంలో సాధ్యమైనంత విస్తృత రంగంలో యీ సూత్రం ఎలా పని చేసిందో మనం కళ్లారా చూశాం. దేశంలోని 36,00,000 మంది అహింసా వాదులయి పోయారని అనను, కాని, అతి స్వల్ప కాలంలో ఇది మరే సిద్ధాంతము చొరనంత లోతుగా చొరుచుకు పోయిందని మాత్రం చెబుతాను.

''అహింసను మానసికంగాసాధించటానికి కఠినశిక్షణను పొందాలి. అది సైనికుని జీవితంలా క్రమశిక్షణతో కూడుకున్న జీవితం. మనోవాక్కాయాలు సరిగా సమన్వయమైనపుడే పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది. సత్యాహింసల సూత్రాన్ని జీవన సూత్రంగా చేసుకోటానికి మనం కృతనిశ్చయులమైతే ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది".

మళ్లీ...............

''ప్రకృతి సూత్రాలను వివిధరీతుల వర్తింపచేసి శాస్త్రజ్ఞుడు అద్భుతాలను సాధించినట్లే. ప్రేమ సూత్రాలను శాస్త్రీయమైన నిర్దుష్టతతో వర్తింపచేసిన మనిషి అంతకుమించిన అద్భుతాలను సాధించగలడు.

''కారణం, అహింస, విద్యుచ్ఛక్తి వంటి ప్రకృతి శక్తుల కంటె ఎక్కువ అద్భుతమయినదీ, సూక్ష్మమయినదీను. మనకి ప్రేమ సూత్రాలను ప్రసాదించిన వ్యక్తి ఇతర ఆధునిక విజ్ఞాన శాస్త్రజ్ఞులకంటె చాల గొప్పవాడు.

బాపూజీ స్మృతిలో

"మురళీధర్"

—

అక్టోబరు రెండంటే
బాపూజీ స్మృతి చిహ్నం
అక్టోబరు రెండంటే
జనవరి ముప్పది మరణం!
ఆనాడే
ఒక దీపం
భువినంతా
కాంతులతో
నింపేస్తూ
ధృవతారై కూర్చున్నది.
ఆనాడే
ఒక కిరణం
మూల మూల
చీకట్లను
మండిస్తూ
దివిటీగా
మారడానికాయత్తం
ఔతూన్నది.
ఆనాడే
ఒక అరదం
భరత జాతి
బంధాలను
తెంపడానికని ముందుకు
దూకనుంది.

ఆనాడే
ఒక్క మనిషి
ఒక్క జాతి
నొక్క తాటిపై
నడిపించే
వ్యక్తిత్వం
పుంజుకుంది.
అక్టోబరు రెండంటే
చావులేని బ్రతుకుకోసోపానం
అక్టోబరు రెండంటే
మృత్యువుకొక మరపురాని వజ్రఘాతం.
రాబోయే తరాల్లో
రాబోయే అభ్యుదయం
తరచితరచి
తలచుకోక తప్పదు
ఆరోజును —
భరత దేశ
స్వాతంత్ర్యపు కలలయొక్క
పునాదది —
అక్టోబరు రెండంటే
బాపూజీ స్మృతిచిహ్నం
అక్టోబరు రెండంటే
జనవరి ముప్పది మరణం!

—*—

గీతాంజలి

చేకొనుము ఓ గాంధి తాతా !

నీకు జోహారు స్వాతంత్ర్య దాతా !

పోరుబందరునందు — పుట్టి మహిమలు జూపి
మాతృదేశము గాచి — మహాత్ముడైనావు చే.

ఖద్దరు బట్టకై — కదురు రాట్నము బూని
దాతవై ప్రజలకు — నేత నేర్పించావు చే.

సత్యాగ్రహంబను — శంఖంబు పూరించి
తెల్లవారి గుండె — జల్లుమనిపించావు చే.

జాతి మత గాయములు — కోత గోయుచునుండ
బోసినవ్వున నీవు — మాసిపోజేశావు చే.

స్వాతంత్ర్య సమరాన — శాంతి ఖడ్గము నెత్తి
భారతావనికెల్ల — "బాపూజి" వైనావు. చే.

"మధుర శ్రీ"
(జి. పాండురంగారావు)

లాభసాటియయిన

ఎగువ సీలేరు ప్రాజెక్టు

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఒప్పందం ఫలితంగా యిప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యెగువ సీలేరు మొదటి అంచె ప్రాజెక్టును అమలుపరచుకోవచ్చును. అయితే, అందువల్ల బలిమెల ఆనకట్ట నిర్మాణానికి అటంకం కలుగకూడదు.

ఎగువ సీలేరు ప్రాజెక్టు మొదటి అంచె మచ్‌ఖండ్-సీలేరు బేసిన్‌లో ఏకీకృత విద్యుదుత్పత్తి గొలుసులో ఒక ముఖ్యయూనిట్టు, ఉత్పత్తి కాగల మొత్తం విద్యుచ్ఛక్తి 800 మి.వా. మించుతుంది. దీనిని అంచెల ప్రకారం వుత్పత్తి చేయటానికి వీలుంది.

దేశంలో మిక్కిలి లాభకరమయిన జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టులలో యిది ఒకటి. కేవలం రూ. 6 కోట్ల పెట్టుబడితో 100 మి.వా. విద్యుచ్ఛక్తి వుత్పత్తి కాగలదు. అనగా ఒక కె.వా. ఫర్మ్ విద్యుచ్ఛక్తికి రూ. 600 చొప్పున ఖర్చు అవుతుంది. మన దేశంలో యుద్ధానంతర విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులకు కె.వా. ఒకటికి రూ. 1,000 నుంచి రూ. 2,000 పైగా అవుతున్నది.

ఇది చాలా సామాన్యమయిన ప్రాజెక్టు, మచ్‌ఖండ్ జల విద్యుచ్ఛక్తి పథకం చివరిభాగం నీటిని వుపయోగించుకుంటుంది. దీని నిమిత్తం ఆనకట్ట యేమీ నిర్మించనవసరం లేదు. సామాన్యమయిన మళ్లింపు అడ్డకట్ట చాలు, యీ అడ్డకట్ట తరువాతి అభివృద్ధి దశలో నిర్మించబడబోయే ఆనకట్టలో ఒకభాగం కాగలదు, దీనికి పవర్ కెనాల్ వుండదు. మళ్లింపు అడ్డకట్ట యొక్క నీటి వ్యాప్తికి ప్రక్కనగల ఫోర్‌బే ఒక పెద్ద సరస్సు అయివున్నది. కురుచ పెన్‌స్టాక్‌లు నేరుగా యిక్కడి నుంచి బయలుదేరుతాయి. లోయ మీదుగా మట్టి కట్టలను నిర్మించి తద్వారా యీ ఫోర్‌బే సరస్సు యేర్పరచబడుతుంది.

ఆంధ్రదేశానికి యీ ప్రాజెక్టు అత్యవసరమయినది. ఎందువల్లనంటే, యిక్కడ వాడకం అవసరాల అంచనా నివేదిక ప్రకారం (రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన యీ నివేదికకు కేంద్ర జల-విద్యుచ్ఛక్తి కమిషన్ తుది రూపమిచ్చింది.) ప్రస్తుతపు పంచవర్ష ప్రణాళిక ఆఖరు నాటికి-అనగా 1960-61 నాటికి-విద్యుచ్ఛక్తి కొరత 60 మి.వా. మించగలదు. కాబట్టి యీ ప్రాజెక్టు ప్రారంభం అత్యవసరమవుతున్నది.


ఆనకట్ట, పవర్ కెనాల్ లేక టన్నెల్‌ల నిర్మాణం లేదు కాబట్టి యీ ప్రాజెక్టును 3, 4 సంవత్సరాలలో పూర్తి చేయవచ్చు.

కేవలం 3 సంవత్సరాలలో యీ ప్రాజెక్టు విద్యుచ్ఛక్తి ప్రయోజనాలను పూర్తిగా పొందవచ్చు. దీనికి ప్రధాన కారణమేమిటంటే, మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రాంత మంతటిలోను విద్యుచ్ఛక్తి గ్రిడ్ వున్నది. పారిశ్రామిక ప్రయోజనాలకై విద్యుచ్ఛక్తి వాడకం నానాటికీ హెచ్చుతున్నది.

చక్కని ప్రతిఫలం

పై కారణాలవల్ల యీ ప్రాజెక్టు చక్కని ప్రతిఫలాన్నిస్తుంది. ఈ విషయంలో దానికదే సాటి. ఇంచుమించు మొత్తం రూ. 8 కోట్ల పెట్టుబడి, సమీకృతమయిన వడ్డీ ఛార్జీల పై పని ప్రారంభించిన 4వ సంవత్సరంలో 11.2 శాతం నికరం ప్రతిఫలం రాగలదు.

ఇదే నదిపై యించుమించు 50 మైళ్ల యెగువన కల మచ్‌ఖండ్ జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు-జాలాపుట్ ఆనకట్ట, మచ్‌ఖండ్ విద్యుదుత్పత్తి కేంద్రాలతో సహా పూర్తి అయినది. 3 అదనపు వుత్పత్తి యూనిట్లు గల రెండవ అంచె నిర్మాణం చాలా భాగం పూర్తయింది. 21,250 కె.వా. శక్తిగల నాలుగవ యూనిట్టు అప్పుడే పని ప్రారంభించింది. ఎగువ సీలేరులో విద్యుదుత్పత్తికై పై ప్రాజెక్టునుంచి క్రమం తప్పకుండా యించుమించు 1,400 క్యూసెక్కుల నీరు లభిస్తుంది. నదిపై కేవలం ఒక తక్కువ యెత్తు



LOCATION MAP

GOVT. PRESS, ANDHRA PRADESH, HYD'BAD.

రచయితలకు

ఈ పత్రికలో ప్రకటనార్థం సంస్కృతి, సాహిత్యం, కళలు, శిల్పం, దర్శనీయమైన స్థలాలు మొదలైన వాటిపై స్వతంత్ర రచనలు కావాలి. విషయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రాముఖ్యం కలదై వుండాలి. వీలైనప్పుడల్లా వ్యాసాలతో పాటు ఛాయాచిత్రాలు లేక రేఖాచిత్రాలను పంపవచ్చు. అంగీకరించబడిన రచనలన్నిటికి పారితోషికం యివ్వబడుతుంది.

సమాచార, పౌర సంబంధముల శాఖ డైరెక్టరు

అడ్డకట్ట నిర్మాణంతో, మధ్య ఆరగాణి కలుపుకుని దీనికి యించుమించు 1,800 క్యూసెక్కుల నీరు లభిస్తుంది.

తక్కువ వ్యయంతో జలవిద్యుచ్ఛక్తి అభివృద్ధికి మచ్‌ఖండ్-సీలేరు బేసిన్ మిక్కిలి తగివున్నది. మచ్‌ఖండ్ అభివృద్ధి యించుమించు 850 అ. పాతంతో 110 మి. వా. విద్యుత్తును వుత్పత్తి చేస్తుంది, ఎగువ సీలేరు మచ్‌ఖండ్ చివరిభాగం పథకం. దానికి 50 మైళ్ల దిగువన వుంది. కాబట్టి అది 440 అ. పాతాన్ని వినియోగించుకోవచ్చు. దిగువ సీలేరు మళ్లీ ఎగువ సీలేరు చివరి భాగం పథకం, అదే నదిపై యించుమించు మరి 25 మైళ్ల దిగువనవుంది. కాబట్టి అది మొత్తం 800 అ. పాతాన్ని వుపయోగించుకోవచ్చు. ఈ విధంగా యీ బేసిన్‌లో లాభసాటిగా మొత్తం 800 మి.వా కి పైగా విద్యుచ్ఛక్తిని వుత్పత్తి చేయవచ్చు.

ఎగువ సీలేరు ప్రాజెక్టు మొదటి అంచెలో దిగువ వాటి నిర్మాణానికి వసతివుంది.

1. గుంటవాడకి సమీపంలో యించుమించు 35 అడుగుల ఎత్తుగల మళ్లింపు అడ్డకట్ట, దీని కిరువైపులా అంత యెత్తులేని, మట్టి కట్టలుంటాయి.

2. అడ్డకట్టకి దిగువన ఒక ఫోర్ బేసరస్సు. దీనికి పొడిల్ పైన తక్కువ యెత్తు మట్టి కట్టలుంటాయి. అడ్డకట్ట నీటి వ్యాప్తినుంచి సరుస్సులోనికి వచ్చే పవర్ డ్రాఫ్టుకి రెగ్యులేటింగు గేటులుంటాయి.

3. ఫోర్‌బేనుంచి బయలుదేరి విద్యుదుత్పత్తికేంద్రాన్ని చేరే కురుచ పెన్ స్టాక్సు.

4. విద్యుదుత్పత్తి కేంద్రం భవనం, నదికి చేరే టెయిల్ రేసీ.

5. ప్రారంభంలో రెండు 60 మి.వా. విద్యుదుత్పత్తి యూనిట్ల స్థాపన. ఇక్కడ ఆఖరికి 5 యూనిట్ల స్థాపనకి వసతి వుంటుంది. గుంటవాడవద్ద ఆనకట్ట (ఇది మళ్లింపు అడ్డకట్టను లీనం చేసుకుంటుంది) నిర్మాణం, అదనంగా మూడు 60 మి.వా. విద్యుదుత్పత్తి యూనిట్ల స్థాపనల కార్యక్రమం తరువాత అభివృద్ధి దశలలో చేపట్టబడుతుంది.

6. ఎగువ సీలేరు నుంచి రాజమండ్రికి యించుమించు 85 మైళ్ల పొడుగు 132 కెవి ప్రసార మార్గం. రాజమంద్రి ప్రస్తుతపు ఆంధ్రప్రదేశ్ గ్రిడ్‌లో ఒక సబ్-స్టేషన్ అయి వున్నది ఎగువ సీలేరు నుంచి ప్రస్తుతపు మచ్‌ఖండ్ విద్యుదుత్పత్తి కేంద్రానికి యించుమించు 50 మైళ్ల పొడుగు మాత్రం వుండే 132 కెవి ప్రసార మార్గం.

ఈ పథకం పూర్తిగా పరిశోధించబడింది. కేంద్ర జల, విద్యుచ్ఛక్తి కమిషన్‌తో సంప్రదించిన మీదట దానికి తుది రూప మివ్వబడింది.

ఎగువ సీలేరు ప్రాజెక్టు ప్రస్తుతపు మచ్‌ఖండ్ జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు నుంచి కేవలం కొన్ని మైళ్ల అవతల అదే నదిపై వుంది. మచ్‌ఖండ్ ప్రాజెక్టు దాదాపు పూర్తి అయింది. కాబట్టి మంచ్‌ఖండ్ ప్రాజెక్టుకి వుపయోగ పడిన నిర్మాణ యంత్రాలను, అనుభవజ్ఞులైన సిబ్బందిని, వ్యవస్థీకృతమైన యేర్పాట్లను యిది బాగా వుపయోగించుకోవచ్చు. నిర్మాణ యంత్రాలపై విదేశ మారకం దాదాపు రు 80 లక్షల వరకూ తగ్గుతుంది. ఈ విధంగా నిర్మాణం పనిని త్వరగా ప్రారంభించి వేగంగా పూర్తిచేయవచ్చు.

సీలేరు జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు తొలి అంచెకి రూ 200 లక్షల విదేశ మారకం అవసరం కాగలదు. ఇది పవర్ ప్లాంటు ఖరీదుకి పరిమితమై వున్నది. లాభాలతో పోల్చినప్పుడు యిది చాలా తక్కువ కూడ.

—— :*: ——

మరపు

—శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

మరపు అనేది బహు విచిత్రమైన మనోవికారము. మనకు కలిగిన అనుభవాలను ఎట్లాగ మరచి పోతామో తెలియకుండా ఉంది.

అయితే ఈ మరచి పోవడము అనే శక్తి మనకు భగవంతుడు దయతో ఇచ్చిన వర ప్రసాదాలలో ఒకటి. ఈ శక్తే లేకపోతే జీవితము దుర్భరమూ, దుస్సహమూ అయి పోతుంది.

మరపు వలన కొన్ని ఇబ్బందులు రావడమూ కొన్ని చికాకులు కలగడమూ మన అనుభవంలోని విషయమే కాని కొన్ని ఇబ్బందులు కలిగించే విషయాలే మన జీవితానికి సౌఖ్యాన్ని ఇచ్చేవిగా కూడా ఉంటవి. ఆ సంగతి తెలియక మనము చికాకు పడుతూ ఉంటాము.

ఒకాయన భార్య మూగది. ఆవిడతో ఒక మాటా పలుకూ ఏమి లేనందువల్ల భర్త తన దురదృష్టాన్ని నిందించుకొంటూ తనంతటి దౌర్భాగ్యుడు ఈ విశాల ప్రపంచంలో ఇంకొకడు లేడు అని దుఃఖిస్తూ ఉండేవాడు. ఆయన ఒక రోజు ఈ విషయాన్ని గురించి ఒక స్నేహితునితో ప్రస్తావించి తన దుఃఖాన్ని ప్రకటించాడు. ఆ స్నేహితుడు ఆమె మూగతనాన్ని గూర్చి విని, అతనితో అయ్యో పిచ్చివాడా, విచార పడుతావేమయ్యా. మూగ భార్య దొరకడం అదొక అదృష్టం. పూర్వ జన్మలో చేసికొనిన ఏ సుకృతానికో ఇది ఫలితము. మేమంతా భార్యల యొక్క అతివాగుళ్లకు తట్టుకోలేక చస్తున్నాము. నీ అదృష్టానికి నిన్ను నీవు అభినందించుకో; మేము కూడా అభినందిస్తాము. అంతేకాని దుఃఖ పడతావేమయ్యా ? అని మందలించాడు.

కాబట్టి ఏదో ఒక సందర్భంగా చికాకు కలిగించే విషయము, మరో విధంగా చూస్తే ఎంతో ఆనందాన్ని సమకూర్చేది అయి ఉంటుంది. మరపు అల్లాంటిది.

ఈ మరపు మనకు ఎన్నో విధాల సాయ పడుతున్నది. చిన్న తనంలో తల్లితండ్రులు పిల్లలను కొట్టిన దెబ్బలూ, తిట్టిన తిట్లూ వాళ్లు జ్ఞాపకం ఉంచుకొంటే, ఇంకేమైనా ఉందా. ఆ పిల్లలు తల్లితండ్రులను ప్రేమించగలరా ?

ఉపాధ్యాయుడు—విద్యార్థులను కొడతాడు, తిడతాడు. ఒక్కొక్కప్పుడు అన్యాయంగానే కొట్టడము జరుగుతుంది. అవన్నీ వాళ్లకు పెద్ద అయిన తరువాత కూడా జ్ఞాపకం ఉంటే మనము చచ్చువాళ్లము అన్నమాటే ! వాళ్లు అవన్నీ మరచిపోయి, తమకు చిన్న తనంలో చదువు చెప్పిన ఉపాధ్యాయులయందు కృతజ్ఞతా, గౌరవమూ చూపడము అనేది ఎంతో విచిత్రమైన విషయం.

కొన్ని విషయాలు ఎంతో ప్రాముఖ్యముగలవే; జ్ఞాపకము ఉంచుకోతగినవి అయినాకూడా ఇట్టే మరచిపోతాము. మరికొన్ని ఎందుకు పనికిరానివీ, బహు స్వల్పమైనవీ అయిన విషయాలు మనస్సును పట్టుకొని వ్రేలాడుతూ ఉంటవి.

ఎవరి దగ్గరైనా నాలుగో, అయిదో రూపాయలు అప్పు తీసికొని చటుక్కున మరచి పోతాం. ఇది మరచిపోదగిన విషయం కాదు నిజానికి!

ఈ విషయంలో ప్రసిద్ధ మానసిక తత్వవేత్త ఫ్రాయిడ్ అంటాడూ, అప్పు తీసికొన్నపుడే ఆ విషయం మరచి పోదామని, ఆ అప్పు తీసికొన్నవాడు మనస్సులో రహస్యంగా అనుకొంటాడుట. అందుకనే అల్లాగ మరచి పోవడము జరుగుతుందీ అని.

అబ్బే, నేను అల్లాగ ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకు అనుకొంటానూ: అంటే, నీకు తెలియదయ్యా, నీ మనస్సులో జరిగిన పని అది: నీవు ఆ మనోవ్యాపారాన్ని గుర్తింపక పోవచ్చు. నీవు అల్లాగ అనుకొని ఉండక పోతే మరిచిపోవడము అనేది అసలు జరుగనే జరుగదు. అంటాడు ఫ్రాయిడ్.

ఫ్రాయిడ్ ఇంకా విచిత్రమైన ప్రతిపాదనలు చేశాడు. మానవ జీవితంలో హఠాత్ సంభవము అంటూ ఏదీ లేదు. ప్రతి విషయమూ నీవు అనుకొని గాఢంగా వాంఛించిందే జరుగుతుంది. కాని నీవు అల్లాగ అనుకొన్నట్లు మాత్రం

నీకు జ్ఞాపకం ఉండదు. అంటాడు ఫ్రాయిడ్.

ఒకడు మోటారు కారు క్రింద పడి చనిపోతాడు. అది హఠాత్సంభవము కాదంటాడు ఫ్రాయిడ్. ఎప్పుడో ఏ నిమిషంలోనో, మోటారు క్రింద పడి చచ్చిపోతే బాగుండు నని నీవు కోరుకొని ఉంటావు. ఆ కోరిక మనస్సు మడతలలో దాగియుండి, నీకు తెలియకుండానే గాఢమైన వాంఛగా తయారై, బయటపడడానికి తగిన సమయమునకై వేచియుండి, సమయము వచ్చినప్పుడు నిన్ను లారీక్రిందకు తోస్తుంది అంటాడు ఫ్రాయిడ్. ఆయన వాదన అది.

అటువంటి కోరికలు మనము ఎందుకు కోరుకొంటాము అంటే ఫ్రాయిడ్ సమాధానం చెప్పడు. నీ పూర్వ జన్మ కృతమైన ఏ కర్మకో, ఇది బాహిరరూపము అని నేను అనుకొంటాను.

ఈ మరచిపోవడము తెరలు తెరలుగా వచ్చి మనిషిని చాలా చిక్కు పరిస్థితులలోకి లాక్కుని వెడుతూ ఉంటుంది.

* * * *

ఒకసారి ఏమైందో చెపుతాను. ప్రొద్దున ఎనిమిది గంటలు అవుతుంది. కాఫీ త్రాగాను. అంతకు క్రితం రోజున ఏదో కొందామని అనుకొన్నాను. అదేదో కొనుక్కుందామని నేను ఆరోజున పెందలాడే లేచి కాఫీ త్రాగి మంచి బట్టలు వేసుకొని బజారుకు వెళ్లడానికి తయారైనాను.

బట్టలు వేసుకొంటూన్నంత సేపూ నేను ఆలోచిస్తూనే ఉన్నాను. ఏమిటబ్బా నేను కొనుక్కుందామనుకొందీ అని. ఏమీ జ్ఞాపకం రాలేదు.

బట్టలు వేసుకోవడం అయిపోయింది. అదే జ్ఞాపకం వస్తుందిలే అనుకొని బయలుదేరాను. గుమ్మంలో ఒక నిమిషం నిలబడి, ఆకాశంవంక చూచి జ్ఞాపకం తెచ్చుకొంటానికి ప్రయత్నించాను. జ్ఞాపకం రాలేదు. ఒకప్పుడు తల గోక్కుంటే ఎప్పుడో మరచిపోయిన విషయం చటుక్కున జ్ఞాపకం వస్తుంది. అట్లా కూడా చేసి చూశాను. ఏమీ జ్ఞాపకం రాలేదు.

అయితే ఒక మంచి ఆలోచన వచ్చింది. బజారుకు వెడదాము. అక్కడ వస్తువులన్నీ చూస్తుంటే నిన్న నేను కొనదల్చుకొన్నది జ్ఞాపకం రాకపోతుందా అని! ఇదీ ఒక ఉపాయమే!

సరే, ఇక ఏమీ ఆలోచన లేకుండా ఉత్తరీయం దూపించి బుజాన వేసుకొన్నాను. ఉత్తరీయం విసురుగా దూపించడం వలన ఒకప్పుడు మరపు మడతలలో దాక్కున్న విషయము జారి కళ్లముందు తళుక్కున మెరుస్తుంది.

అట్లాగూ జరుగలేదు.

ముందుకు నడిచాను. ఒక ఇరవై గజాలు పోయినాను. అప్పుడు ఇంకో విషయం జ్ఞాపకానికి వచ్చింది. ఏమిటదీ!

ఏదో కొనాలని గదా నేను అనుకొన్నది. ఆ కొనేది ఏదైనా కానీ, కొంటానికి డబ్బు కావాలి గదా! ఆ డబ్బు తీసికొనే బయలుదేరానా అన్న ఆలోచన వచ్చింది. నయమే! నయం కాదుమరీ!

తీరా బజారుకు వెడతాను. ఆ వస్తువేదో జ్ఞాపకానికి వస్తుంది. కొంటాను, చూచుకుంటే డబ్బు ఉండేది కాదు. అప్పుడు ఎంత అభాసు అయిపోయేది! ఇంకా నయమే! సమయానికి రావలసిన ఆలోచన వచ్చింది; అని అనుకొని నాలో నేను సంతోషపడి డబ్బు తెచ్చుకుందామని ఇంటి వైపుకు తిరిగాను.

ఇంటివైపు నడుస్తూ ఉంటే నాకెంతో సంతోషం కలిగింది. ఆ సమయానికి జ్ఞాపకం రావడంలో నా ప్రయోజకత్వం నిజానికి ఏమీ లేకపోయినా ఏదో ఉన్నట్లే నాకు సంతోషం కలిగింది.

ఈ విషయం జ్ఞాపకం రాక పోయినట్లయితే-జరిగే రసాభాస జరగకుండా పోయిందిగదా అని నేను సంతోషించాను. ఉత్సాహంగా నేను ఇంటికి వెడుతున్నాను.

దారిలో ఎవరో మిత్రుడు కనిపించాడు. ఆయనతో పది నిమిషాలు మాట్లాడినాను. ఇంటికి వెళ్లాను. "ఏమండీ, మళ్లీ వచ్చారు. ఏమైనా మరిచి పోయినారా ?" అంటూ మా ఆవిడ నా కెదురుగా నిల్చుంది.

ఆ క్షణంలో నాముఖంఅంతా వివర్ణమైపోయి ఉంటుంది. దానికి రెండు కారణాలు ఉన్నవి. ఏదో మరచి పోయినాను అని చెపితే ఆవిడ, ఎప్పుడూ ఏదో మరచి పోతూనే ఉంటారు మీరు అని నవ్వి హేళన చేస్తుంది.

ఎంత పెళ్లము అయినా, హేళనగా మాట్లాడుతూ ఉంటే మొగుడైన వాడికి కష్టంగానే ఉంటుంది. మొగుడుతనం దెబ్బతింటుంది. అది అట్లా ఉంచి నేను వెళ్ల పోవడానికి నిజమైన కారణం ఏమిటా అంటే నేను ఇంటికి ఇప్పుడు ఎందుకొచ్చానో మరచి పోయినాను.

పర్సుకోసం వచ్చాను ఇంటికి. కాని ఆ విషయం జ్ఞాపకం రాదేం కర్మం! ఛీ విసుగు కలిగింది. ముఖం చిట్లించాను. నా దౌర్భాగ్యానికి నాకు నా మీదే కోపం వచ్చింది. ఎందుకొచ్చారండీ ?-అని ఆవిడ అడిగింది.

నాకు మండి పోయింది. ఆమె మీద విరుచుకు పడ్డాను. "నా బొంద, నా తలకాయ, నా ముఖం, నా చెవులూ, నా

నాలిక, ఎందుకు బయటికి వెళ్లానో, ఎందుకు మళ్లీ వచ్చానో జ్ఞాపకం రాకపోతే ఎట్లా చచ్చేది ?''

'అయ్యో కర్మమా'! అంది ఆవిడ మాటలు సాగదీస్తూ. నేను ఆమెను వెక్కిరిస్తూ ఆ మాటే మళ్లీ అన్నాను. ఎందుకండీ, అల్లాగ వెక్కిరిస్తారూ ? నేను ఏం జేశానూ? ఏమీ చేయలేదు.

ఇంకేం ?

నాబొంద నీవు ఏమీ చెయ్యక పోవడము వల్లనే నేను అవస్థ పడుతున్నాను.

ఏం జేయమంటారండీ ?

నా తలకాయ, నా బొంద, ఏం జేయాలో నీకు తెలియక పోయె ! అదే వచ్చిన కర్మం ! నేను ఎందుకు బయటికి వెడుతున్నానో, ఎక్కడికి వెడుతున్నానో ఇవన్నీ తెలుసు కొంటూ ఉండొద్దూ నీవు ! నీకు ఏమీ పట్టదు. అందుకనే నేను చస్తున్నాను.

ఈ మాటలు విని ఆవిడ అన్నది. 'బాగుందండోయ్. ఇదిమరీ బాగుంది ! పైన బట్టలేసుకొని పోతున్నప్పుడు, ఎక్కడికి వెడుతున్నారండీ, అని నేను అడిగితే, ప్రతిదీ నీకు కావాలె ! నీకు అక్కరలేని విషయం అంటూ ఉండదు. మగవాళ్లకు అనేక పనులు ఉంటవి. అనేకచోట్లకు వెడుతూ ఉంటారు. ప్రతీదీ నీకు చెప్పాలా?, అని విసుక్కొంటా రాయె.

'పోనీ ఆయన ఎక్కడికెడితే నా కెందుకు? ఇంట్లో పడుండే ఆడదాన్నాయె —' అని ఊరుకొంటే ఇల్లాగ కోప్పడుతూ ఉంటిరి. ఎట్లా చచ్చేదండీ?

అప్పుడు నేను కచ్చితంగా చెప్పేశాను. 'ఇదిగో చూడూ' నీవు చావడానికి ఏ మాత్రం వీలులేదు. నీవు శుభ్రంగా బ్రతికి ఉండాలె. బ్రతికి ఉండి నాకు ప్రతి విషయంలోనూ సలహాఇస్తూ, ఏ క్షణానికి ఆ క్షణం అన్ని విషయాలూ జ్ఞాపకం చేస్తూ ఉండాలె.'

ఏమి జ్ఞాపకం చెయ్యాలె?

ఏమి జ్ఞాపకం చెయ్యాల ంటే....జ్ఞాపకం చేయదగిన వన్నినూ! నేను మరచి పోయిన వన్నీను.

నాకు ఎట్లా తెలుస్తుందండీ, మీరు ఏమి మరచి పోయిందిన్నీ!

ఆమాత్రం.....నేను.....ఏమి మరచి పోయిందీ మరచి పోయేదీ తెలుసుకోలేక పోతే, నీవు ఎందుకూ అంటా.

నేను అందుకేనన్నమాట ఉన్నది.

ఆవును అందుకే.

నాకు ఎట్లా తెలుస్తుందండీ మీరు ఏమి మర్చి పోయిందీని!

అది ఏమంత కష్టం లేదే పిచ్చి ఎంకమ్మా — చూడూ ఒకటే రహస్యం: నాకు జ్ఞాపకం ఉండని విషయాలన్నీ మరచిపోయినట్లే లెక్క. అదొకటే సూత్రం: తెలిసిందా?

'తెలిసింది కాని....ఏం తెలిసిందో తెలియడం లేదు.'

'బాగుంది బాగుంది. అది సరేగాని—నన్ను చంపక నేను బజారు కెళుతూ ఉన్న వాణ్ణి అల్లా ఇంటికి తిరిగి ఎందుకు వచ్చానో చెప్పు?'

'అసలు బజారుకు అని ఎందుకు బయలుదేరారో చెప్పండి. నేను మీరు ఎందుకు తిరిగి వచ్చారో చెప్తాను.'

'అదీ నేనే చెప్పాలె?'

'నాకెట్లా తెలుస్తుందండీ మీరు చెప్పకపోతే'

'నా బొంద నీకు ఎట్లా తెలుస్తుందో అదీ నేనే చెప్పాలె: నా తలకాయ, ఏడ్చినట్లుగా ఉంది. సరే ఇక నీవు చెప్ప లేనట్టేగా: వెళ్లు, నేనే జ్ఞాపకం తెచ్చుకొంటాను. చూడూ మాట:

'ఏమిటండీ?'

'ఏమీ లేదు కాఫీ తీసుకొనిరా. జ్ఞాపకం ఉంచుకోనుమీ కాఫీ తెమ్మన్నానని. నాకు జ్ఞాపకం ఉండదు. మళ్లీ నిన్ను ఏమి తెమ్మన్నదీని!'

ఆవిడ వెళ్లిపోయింది.

ఆవిడ రాలేదు. అరగంట గడిచిన తరువాత కూడా ఆవిడను ఏమి తెమ్మన్నదీ నాకు జ్ఞాపకం ఉంది.

మళ్లీ కేక వేశాను కాఫీ తెమ్మని!

ఆమె కాఫీ కప్పుతో వచ్చింది. ''మరచి పోతారేమో అనుకొన్నాను. అందుకనే చూద్దామని ఆలస్యం చేశాను. జ్ఞాపకం ఉందే!'' అంటూ కప్పు నాకు అందించింది. నేను తాగాను.

ఇల్లాగ కొన్ని విషయాలు ఎందుకో వద్దన్నా జ్ఞాపకం ఉంటవి.

* * * *

ఈ సంగర్భంలో ఒక చిన్న విషయం జ్ఞాపకానికి వస్తు న్నది. ఒకాయనకు తండ్రి తద్దినము సంగతే జ్ఞాపకం లేదట. ఆయన ఒక గ్రామానికి కరణం. తెల్లవారుఝామున నాలుగింటికి లేచి పొలానికి వెళ్లబోతూ, మళ్లీ వచ్చేసరికి చాలా ప్రొద్దుపోతుందని కాస్త చద్ది అన్నం ఉంటే తిందా మని అనుకొన్నాడు. అదీగాక క్రిందటి రాత్రి ఇంటావిడ

చేసిన పులుసు ఎంతో కమ్మగా ఉన్న సంగతి కూడ జ్ఞాపకానికి వచ్చింది. ఆ ఉల్లిపాయల పులుసు సంగతి జ్ఞాపకం వచ్చేసరికి నోరూరింది. సరే అని ఆకులో వడ్డించుకొని పులుసు వేసుకొని తిని గడ్డ పెరుగుతో పూర్తిచేసి పొలానికి వెళ్ళిపోయినాడు. మళ్లీ బారెడు ప్రొద్దెక్కిన తరువాత ఇంటికి వచ్చాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చిందాయనకు తాను ముఖం కడుక్కోకుండా అన్నం తిన్న సంగతి. ఆ పళంగా కూర్చుని యథావిధిగా ముఖం కడుక్కున్నాడు.

ఇంతలో వాళ్ల యింటి పురోహితుడు ఉరుకుతూ పరుగుల మీద కరణం గారి దగ్గరకు వచ్చి "ఏమండీ ఈవాళ కూడ ఇంత ప్రొద్దెక్కి ముఖం కడుక్కుంటున్నారేం?" అని అడిగాడు ఎంతో ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

'ఏం ఇవ్వాళకూడా అంటున్నారు. ఇవ్వాళ విశేషమేమున్నది?' అని అడిగాడు కరణంగారు. ఆ పురోహితుడు తెల్లపోయి, 'అయ్యో కర్మమా, మీకు జ్ఞాపకం ఉన్నట్లు లేదే? ఇవ్వాళ మీ తండ్రిగారి ఆబ్దికం గదండీ?' అన్నాడు.

కరణంగారు ఆశ్చర్యంతో వెనక్కు విరుచుకు పడ్డాడు.

'ఏమిటండీ కరణంగారూ అంత ఇదైపోయినారేమిటి?' అని అడిగాడు పురోహితుడు. "నా బొంద! ఏమిటి అని అడుగుతున్నావా ఇంకా? ఇవ్వాళ మా నాన్నగారి తద్దినం అని ఓ రోజు ముందు చెప్పొద్దుటయ్యా. నీవు ఇంటి పురోహితుడివై ఉండి ఇల్లాగేనా తద్దినాలు తగలెయ్యడం" అని కోప్పడ్డాడు.

పురోహితుడు, 'అయ్యో, అయ్యో, ఈ తద్దినం మీ తండ్రిగారిదయ్యా, మీ నాన్నగారి తద్దినం నీవు జ్ఞాపకం ఉంచుకోవద్దయ్యా' అని గోలపెట్టాడు.

కరణంగారికి ఏమీ తోచలేదు. కాసేపు ఊరుకొని కోపంగా అన్నాడు. 'ఇటువంటి విషయాలు జ్ఞాపకం ఉండవనేగా మిమ్ములను పురోహితులనుగా పెట్టుకోవడము. సరే! ఇప్పుడేమి చేయాలో చెప్పు?'

'చేయడానికి ఏముందీ! బ్రాహ్మణులను పిలువలేదు కాబోలు, సరే దానికేం లెండి దారిని బోయే బ్రాహ్మణులను కొట్టుకు రండని ఎట్టి వాళ్లను పంపండి. వంటచేయమని ఆడవాళ్లతో చెప్పండి.'

'అది కాదయ్యా ప్రారబ్ధం! ప్రొద్దున నాలుగు గంటలకే ఉల్లిపాయ పులుసుతో చద్ది అన్నం తినేశాగదా ఇప్పుడు తద్దినం ఎట్లా పెట్టేదయ్యా?'

'అరెరె, పెద్ద పొరపాటే వచ్చిందే: అయితే అన్నం తిన్నామంటున్నారు. ముఖం కడుక్కోకుండా తిన్నారా, ఇప్పుడు మొఖం కడుగుతున్నారూ?'

'అవును బాబు. ఎప్పుడో తెల్లవారు ఝామున తినడం వల్ల, ముఖం కడుక్కోకుండా తిన్నాను. ఆ సంగతి ఇప్పుడు జ్ఞాపకానికి వచ్చింది!'

'సరే అయితే అన్నీ బాగానే ఉన్నవి నీవు తద్దినం పెట్టడానికి అభ్యంతరం ఏమీ లేదు. ఆబ్దికం పెట్టేశెయ్యండి.'

'ఏమిటయ్యా నీవనడము. చద్ది అన్నం తిని ఆబ్దికం పెట్టమంటావా'?

'పెట్టవచ్చునయ్యా. ఎంచేత అంటే నీవు ఇవ్వాళ తినలేదు.'

'ఇవ్వాళే తిన్నాను బాబు'

'కాదు బాబు కాదు. తెల్లవారు ఝామున తింటే ఇవ్వాళ తిన్నట్లు కాదు. సూర్యోదయం అయితేనే గాని తిథి మారదు.- మనశాస్త్ర ప్రకారం. అదీగాక ముఖం కడుక్కోకుండా తిన్నావు కాబట్టి నిన్న తిన్నట్టే లెఖ్ఖ! ముఖం కడుక్కుంటేనే కొత్త రోజులో ప్రవేశించినట్లు కాబట్టి మీరు నిరభ్యంతరంగా ధర్మ శాస్త్ర యుక్తంగా మీ తండ్రిగారి ఆబ్దికం యధావిధిగా పెట్టండి'

అల్లా అని ఆ పురోహితుడు ఆబ్దికం సక్రమంగా పెట్టించాడు. మనకు కావలసిందల్లా ఆ కరణంగారు తండ్రి ఆబ్దికం సంగతే మరిచి పోవడం! మరచిపోవడము అంతవరకు పోతుంది అన్నమాట ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క వ్యక్తి విషయంలో.

*   *   *   *

ఒకాయనకు తగని మరపు. ఇంటి నుండి బయలు దేరే ముందు పర్సు జేబులో వేసుకోవడం మర్చిపోవడము. ఆయనకు ఓజబ్బు! ఏదో కాఫీ హోటలుకు పోయి, ఫలహారం చేసి జేబు తడివి చూచుకొని తెల్ల ముఖం వేశేవాడు. ఉన్న వూరు అంతా ఎరిగి ఉన్నవారూకాబట్టి ఆ హోటలు యజమాని "పోనీ లెండి పంతులుగారూ రేపు తెచ్చి ఇయ్యండి. ఈ మాత్రానికి అంత గాభరా పడవలసిన అవసరం లేదు లెండి" అనేవాడు. లేకపోతే ఏ స్నేహితుడో "నేను ఇస్తాను లెండి" అని ఇచ్చేస్తుండేవాడు.

పర్సు మరచిపోయి రావడము చాలా లాభకరంగా తోచింది ఆయనకు. ఎందుకంటే, కొన్నాళ్లు గడిచిన తరువాత ఆ హోటల్ యజమాని యీ చిన్న బాకీ విషయమై మరచి పోయేవాడు.

ఈ పద్ధతిని కాఫీ హోటలులో తినడం చాలా అనుకూలంగా ఉంది మన పంతులుకు. కాబట్టి బుద్ధి పూర్వకంగానే పర్సు మరచి పోవడం సాగించాడు. ఈ మర్చిపోవడం అనేది అలవాటు అయిపోయింది.

ఒకసారి పొరుగున ఉన్న బస్తీకి వెళ్లి ఇదే నాటకం ఆడాడు. సుష్టుగా తిని కౌంటరు దగ్గరకు వెళ్లి జేబులు తడిమి చూచుకొని తెల్ల ముఖం వేశాడు. ఉన్న ఊరా పోనీ తెండి పంతులుగారూ ఆ తరువాత ఇయ్యవచ్చు లెండి అని పంపడానికి ; హోటలు యజమానికి ఆయనకు వాగ్వాదం జరిగింది. పోట్లాట పెరిగింది. ఆ యజమానికి కోపం వచ్చి మనవాడిని మెడపట్టుకు గెంటి సైడు కాల్వ లోకి పడతోశాడు.

అయినా పంతులు ఈ విధంగా నాటకం ఆడడం మానలేదు. ఈ విధంగా అవమానాలు చాలా చోట్ల జరిగినవి. చాలా చోట్ల జరగడం మూలాన ఎక్కడ అవమానం జరిగిందో, ఎక్కడ ఇంకా బాకీ ఉందో, అతనికి జ్ఞాపకం ఉండేది కాదు.

సంవత్సరం జరిగిన తరువాత తనను సైడు కాల్వలోకి నెట్టిన హోటలుకే మళ్లీ వెళ్లాడు. అక్కడ జరుగవలసిన మర్యాద జరిగిందనే సంగతి జ్ఞాపకం లేక, మామూలుగానే తిన్నాడు. పర్సు మర్చిపోయి వచ్చినట్లు నటించాడు. హోటలు యజమాని అతనిని పరీక్షగా చూచి సంగతి అంతా జ్ఞాపకం తెచ్చుకొని, అన్నాడు, "మీరు క్రిందటి సంవత్సరం కూడా ఒకసారి ఇల్లాగే చేశారు. ఆ రోజున మిమ్ములను మెడ పట్టుకొని గెంటి సైడు కాల్వలో పడేశాను."

మన పంతులు ఆ మాటలు విని తొణక్కుండా 'నిజమేనండి. మళ్లీ అల్లాంటి శ్రమే మీకు ఇవ్వవలసి వచ్చినందులకు విచారంగా ఉంది' అన్నాడు. జరుగవలసిన కార్యక్రమం వెంటనే జరిగింది అనుకోండి. మరచి పోవడం అలవాటు అయిపోతే కలిగే అనర్థాలు ఏమిటో చెప్పాలని ఈ కథ అంతా చెప్పాను.

* * * *

ఒకాయన చాలా తొందర పని మీద ఇంకో ఊరు ప్రయాణమై పోతున్నాడు. "తీసుకోవలసిన వస్తువులన్నీ తీసుకు పోయినానా ఏమైనా మరచి పోయినానా" అని ఆందోళన పడుతున్నాడు. కావలసిన కాయితాలలో ఏవి తీసుకు పోవడం మరచి పోయినా కొంపలంటుకు పోతవి. అందుకని కావలసిన వన్నీ తెచ్చుకొన్నానా లేదా అని చూచుకొంటున్నాడు. రైలు బయలు దేరే సమయము సమీపించింది. పరుగెత్తితే గాని రైలు అందేలాగున లేదు. సరేనని పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ నడుస్తున్నాడు.

నడుస్తూ ఉన్నంత సేపూ ఒకటే ఆలోచన ఏమన్నా మరచి పోయినానా అని ; చివరకు ఒకటి జ్ఞాపకం వచ్చింది. 'అరెరె. రిస్టువాచీ మరచి పోయినానే ఈ తొందరలో.' అను కొన్నాడు. అది అతని చేతికి లేకపోతే ఏమీ తోచదు ఎట్లా ! 'వెనక్కు వెడితే, వెళ్లి తెచ్చుకొంటే ? అసలు టైము ఉందా?' అమిత తొందర; అయినా చూద్దాం అని స్లీవు ఎత్తి చూచుకొన్నాడు. రైలు కదలడానికి ఇంకా అయిదు నిమిషాలు టైము ఉంది. ఇక తిరిగి ఇంటికి వెళ్లి గడియారం తెచ్చుకొనే టైము లేదు. ఇక లాభం లేదు అనుకొన్నాడు. గబగబా స్టేషనుకు పరుగెత్తాడు.

అతని మనస్సుకి రిస్టువాచీ మరచి పోయినాను అన్న ఆలోచన తప్ప ఇంకో ఆలోచన ఎక్కదు. రిస్టువాచి తన చేతిని చూచుకొన్నా ఇంటికి వెళ్లి రావడానికి టైము లేదు అని అనుకొన్నాడు గాని, వాచీ తన చేతినే ఉన్నదీ అన్న జ్ఞానం కలుగలేదు.

* * * *

ఇట్లాంటి సంఘటనలు అనేకంగా జరుగుతుంటవి. ఒకసారి నేను కళ్లజోడు కళ్లపై పెట్టుకొనే ఇల్లంతా గాలించాను "ఏమిటండీ వెదుకుతున్నారూ ?" అన్నది మా ఆవిడ. 'కళ్లజోడు కనపడిచావలేదు. దానికోసం గంట సేపటి నుంచి వెతుకుతున్నాను' అని విసుక్కున్నాను. ఆవిడ విరగబడి నవ్వి 'అయ్యో ఎంత పని జరిగిందండీ' అని సానుభూతిని ప్రకటించి వెంటనే అద్దం ఒకటి తెచ్చి నా ముందు పెట్టి 'అదేమిటండీ, ముఖం అంతా నల్లబడ్డదేం ?' అన్నది.

నేను అద్దంలో చూచుకొని 'అట్టే లేదే ; మామూలుగానే ఉందే' అన్నాను. ఆవిడ నడుం పట్టుకొని విపరీతంగా నవ్వటం సాగించింది ; ఎందుకు నవ్వుతున్నదో నాకు అర్థం కాలేదు. 'అదేమిటండీ, ముఖానికి మసిపూసుకొన్నారేమండీ' అనసూ నవ్వనూ ఆవిడ. నేను మరొక సారి కూడా అద్దం చూచుకొని, నా ముఖం నల్లబడలేదు మసి అంటలేదు అనుకొన్నానే గాని కళ్లజోడు నా ముఖం మీదే ఉన్నదన్న సంగతి నేను గుర్తించలేదు. చివరకు చెప్పింది ఆవిడ 'అదేమిటండీ, జోడు మీ కళ్ల మీదే ఉందండి !' అని !

* * * *

మాట్లాడుతూ మాట్లాడుతూ ఏ విషయాన్ని గురించి మాట్లాడుతున్నామో మరచి పోతుంటాము. సంభాషణ నడుపుతూ ఉన్న ఆయన కొంతదూరం పోయిన తరువాత ఏమిటి మీకు చెపుతున్నానూ, అని మధ్యమధ్య అడుగుతూ ఉంటాడు. తాను దేన్ని గురించి మాట్లాడుతున్నాడో ఆ విషయాన్నే మరచి పోతాడు.

ఆల్ ఇండియా రేడియో వారు మధ్యమధ్య మీరు ఈ వార్తలు ఆల్ ఇండియా రేడియోలో నుండి వింటున్నారు అని చెబుతూ ఉంటారు. శ్రోతలు తాము వార్తలు వింటూనే ఎక్కడ నుంచి వింటున్నామా ఈ వార్తలు అని సందేహ పడుతూ ఉంటారని తెలిసే అల్లా మధ్యమధ్య ఒక కెక వేస్తారను కొంటాను.

* * * *

ఒక సభలో ఒకే విషయాన్ని గురించి నలుగురు అయిదుగురు మాట్లాడవలసి వచ్చినప్పుడు, ప్రతివ్యక్తి వచ్చి, ఇవ్వాళ ఈ విషయాన్ని గురించి ప్రసంగం చేస్తున్నాను అంటాడు. ఎందుకు? ఒక వ్యక్తి మాట్లాడటం పూర్తిచేసే సరికి సదస్యులు ఏ విషయాన్ని గురించి ప్రసంగం జరుగుతున్నదో పూర్తిగా మర్చిపోయి ఉంటారని తెలిసే!

* * * *

భార్యా భర్తలలో, భర్తకు మరపు ఉంటే దాని వలన భార్య లాభాన్ని పొందుతుంది. భార్యకు ఈ మరపు ఉంటే భర్త లాభాన్ని పొందుతూ ఉంటాడు.

మా ఇంట్లో లాభం పొందుతూ ఉన్నది మా ఆవిడ. నాకున్న జబ్బు ఏమిటీ అంటే జేబులో చిల్లర ఎంత ఉన్నదీ జ్ఞాపకం ఉంచుకోలేకపోవడం! ఈ వ్యాధి నాకు చాలా కాలం నుంచి ఉంది. అదీగాక చిల్లర డబ్బులు జేబులో గలగల్లాడుతూ ఉంటే నాకెంతో సరదా. అందుకని జేబులో చిల్లర ఎక్కువగా చేరుస్తూ ఉండేవాడిని. ఉదాహరణకు ప్రొద్దున ఆఫీసుకు పోయేటప్పుడు రూపాయి మార్చి సిగరెట్లు పెట్టెకొని మిగిలిన డబ్బు జేబులో వేసుకొంటాను. మధ్యాహ్నం కాఫీ తాగేటప్పుడు ఇంకో రూపాయి మార్చి బిల్లు చెల్లించి, మిగిలిన చిల్లర జేబులో వేసుకొంటాను. ఆ తరువాత పోస్టు ఆఫీసులో కార్డులు కొన్నప్పుడు మళ్ళీ రూపాయి మార్చవచ్చునుగాని మార్చను. మరీ అదే పనిగా రూపాయిలు మార్చకూడదనీ, డబ్బు విషయంలో జాగ్రత్త ఉండాలనీ ఆలోచనతో ప్రవర్తిస్తాను. అయితే ఆ తరువాత సాయంత్రం ఇంటికి రిక్షామీద పోయేటప్పుడు మళ్ళీ రూపాయి మార్చాలని సరదా పుడుతుంది. మొత్తం మీద మూడు రూపాయిలు మారుస్తాను. సాయంత్రం అయ్యేటప్పటికి రెండు రూపాయిల చిల్లరైనా జేబులో ఉంటుంది ఒక రూపాయి ఖర్చు అయినా. ఈ చిల్లర అయినా సాధ్యమైనంత వరకు కొత్త నయాపైసల రూపంలో అట్టే పెట్టుకొంటాను. దానికి కారణం ఏమిటా అంటే ఆ రూపంలో నాణాలు కొత్తవిగా ఉండి ధగధగా మెరుస్తూ ఉంటవి. రెండోది జేబునిండా చిల్లర గలగల్లాడుతూనూ ఉంటుంది. ఎంతో డబ్బు ఉన్నవాడు పొందే తృప్తి ఆనందమూ నాకు కలుగుతుంది.

అయితే జేబులో ఎంత డబ్బు ఉన్నదో నాకు జ్ఞాపకం ఉండేది కాదు. పోనీ లెక్కపెట్టుకొని ఉంచుకోకూడదా అంటే, ఉంచుకోవచ్చును గాని నాకు చిల్లర లెక్కపెట్టడం అంటే చెడ్డ చికాకు. ఆ పని అసహ్యం అనిపించేది. అసలు దుకాణదారు చిల్లర ఇస్తే దాన్ని లెక్కపెట్టుకొని సరిగా ఇచ్చిందీ లేనిదీ చూచుకోవడమే దర్జాకు లోపం అని అనుకొనే వాళ్ళలో నేను ఒకణ్ణి. అందుకని దుకాణదారు చిల్లర ఇస్తే చూడకుండా దర్జాగా ఠీవిగా నిర్లక్ష్యంగా ఆ చిల్లర జేబులో వేసుకోవడమే గాని పీనాసిలాగ లెక్కపెట్టుకోవడం నాకు అసహ్యం.

డబ్బు అంటే లెక్కలేనట్లు ప్రవర్తించడంలో ఎంతో ఔదార్యం, గాంభీర్యము, ఠీవి ఉన్నవని నా అభిప్రాయము.

ఇంతకూ నేను చెప్పొచ్చిన విషయం ఏమిటా అంటే, చిల్లర లెక్క పెట్టుకోవడం గాని, జేబులో చిల్లర ఎంత ఉన్నదీ జ్ఞాపకం ఉంచుకోవడం గాని నాకు అలవాటు లేదు.

ఈ విషయం మా ఆవిడ కనిపెట్టింది, కనిపెట్టి చిల్లర ఆవిడ లెక్కపెట్టడం సాగించింది, మొదటి రోజులలో పావలా అర్ధా కైంకర్యం చేస్తూ ఉండేది. నాకు తెలిసేదే కాదు.

చిల్లర డబ్బులు తాను జాగ్రత్త పెడుతూన్నట్లు నేను గ్రహించలేదని ఆమె తెలుసుకొన్న తరువాత, ఇంకా ధైర్యంతో ఈ కార్యక్రమం కొనసాగించింది. రెండు రూపాయిలు ఉంటే, ఒక రూపాయి తీసేది. తరువాత రూపాయి, పావలా, రూపాయిన్నర, రూపాయి ముప్పావలా ఇల్లాగ పెంచుకొంటూ పోయి, చివరకు రెండు రూపాయిలు ఉంటే రెండు రూపాయిలు మాయం చేయడం నేర్చుకొంది. జేబులో డబ్బు ఉండాలె ఏమై పోయిందా అని అనుకొనేవాణ్ణి కాని అది ఎంతో ఏమిటో తెలిసేది కాదు. ఖర్చు అయిపోయింది కాబోలు అనుకొని ఊరుకుంటూ ఉండేవాణ్ణి. ఆమె మట్టుకు రోజుకు రెండుసార్లు జేబులు ఖాళీ చేస్తూ ఉండేది.

ఒక రోజున ఎందుకో ఆమె పెట్టి తీసి చూశాను. అందులో ఒక వెండిగిన్నె నిండా చిల్లర డబ్బులు ఉన్నవి. ముప్ఫైయి రూపాయిలు. అమ్మా! ఈవిడ పనాయిది, చిల్లర మాయమౌతుంటే ఏమిటా అనుకొనే వాణ్ణి! అనుకొని ఆ చిల్లర అంతా తీసుకొన్నాను.

సాయంత్రం నేను ఇంటికి వచ్చేసరికి ముఖం ఇంత జేసుకొని కూర్చున్నది. ఏమిటి సంగతి? అన్నాను.

'చాల్లే ఊరుకోండి. నా పెట్టి తీసి నా డబ్బు అంతా మీరెందుకు కాజేశారు?' అని అడిగింది.

'నే కాజేయట మేమిటి, అసలు ఆ డబ్బు ఎవరిది?'

'నాది.'

'నీకెట్లా వచ్చింది?'

'ఎట్లా వస్తుంది! అందరికీ ఎట్లా వస్తుంది డబ్బు'.

'అందరూ సంపాదించుకొంటూరు.'

'నేనూ సంపాదించుకొన్నాను.'

నాకు నవ్వొచ్చింది. 'సంపాదించుకొన్నావు. ఎట్లా సంపాదించావు?'

ఆమె మాట్లాడలేదు.

'నా జేబులో నుంచి డబ్బులు దొంగతనంగా తీసి పైగా సంపాదించు కొన్నానంటావు?' అని విసుక్కున్నాను.

ఆవిడ రుసరుస లాడుతూ అన్నది "చాల్లె, ఊరుకొండి. ఇది దొంగతనంటండీ? మొగడు జేబులోనుంచి డబ్బు తీసుకోవటం దొంగతనమా ఏమిటి? ఎవరి జేబుల్లోనుంచి అయినా తీశానా? నా మొగుడు కోటుజేబులో నుంచి తీసు కోవడం దొంగతనము ఎప్పటికీ కాదు. కావాలంటే ఎవరినైనా అడగండి."

మా ఇంట్లోనే పక్కవాటాలో అద్దెకున్న అవ్వగారిని పిలిచి యీ సంగతంతా, చెప్పి "ఏమండీ పిన్నిగారూ, ఇది దొంగతనం కాదుటండీ?" అని అడిగాను.

ఆమె కాసేపు ఆలోచించి, "నాయనా, అమ్మాయి ఏమైనా పరాయివాళ్ళ సొమ్ము తీసుకొందా, దాని మొగుడు సొమ్ము అది తీసుకొంది. అందులో తప్పేమీ లేదు నాయనా. కోప్పడబోకు?" అన్నది.

నేను కొంచెం సానుభూతితో యీ విషయం ఆలోచించాను. పాపం ఆమె ఏదైనా కొనుక్కొంటానికి చేతిలో డబ్బు ఉండాలె. నా సంపాదనలో ఏదో కొంత ఆమె స్వంత ఖర్చులకై ఇయ్యడం న్యాయం అని ఆలోచించి ఇల్లా అన్నాను:

'సరే. ఇక్కడ నుంచి ప్రతి నెలా నీకు పది రూపాయిలు ఇస్తాను. నీ యిష్టం వచ్చినట్లు వాడుకో. ఇకపైన ఇటువంటి దొంగతనాలు చేయకు' అన్నాను.

ఆమె సరేనని తల ఊపింది. నేను ప్రతినెలా ఆమెకు పది రూపాయిలు ఇస్తూ ఉండేవాణ్ణి. ఆ రోజున తీసిన 30 రూపాయిలు కూడా ఆమెకే ఇచ్చేశాను.

తరువాత రెండు నెలలు గడిచిపోయినై. నా జేబులు ఆమె ఖాళీ చేస్తున్నదో మానేసిందో తెలుసుకొందామని ఒక రోజున మూడు రూపాయిల చిల్లర జేబులో వదిలి, ఆ సంగతి జ్ఞాపకం ఉంచుకొన్నాను.

మర్నాడు చూద్దునుగదా, మూడు రూపాయిల చిల్లరా మాయం అయింది, సరే ఆవిడ చేసే పని మానలేదు అన్నమాట పిలిచి అడిగాను. "నీవు పూర్వం లాగ జేబుల్లో చిల్లర తీయడము మానివేశావా?"

'ఉహూ, ఎందుకు మానాలె.'

'అయితే ఆ పని చేస్తున్నావన్నమాట.'

'ఆఁ.'

'రోజుకు ఎన్నిసార్లు తీస్తావు?'

'రెండు సార్లు. పొద్దున, సాయంత్రం.'

'మరి నీకు నెలకు పది రూపాయిలు ఇస్తున్నానుగా?'

'ఇస్తున్నారు. ఇచ్చినందుకు సంతోషమే!'

'ఈ పని మానేస్తావనేగా అల్లాగ ఇవ్వటం?'

'బాగుందండోయ్. మీరు పది రూపాయిలు ఇస్తున్నారు కదా అని నా సంపాదన నేను మానుకొంటానుటండీ!— ఎవరి సంపాదన ఎవరు వదులు కొంటారండీ?" అన్నది.

'ఇది నీ సంపాదన అన్నమాట?'

"ఆ.—ఎందుకూ ఆశ్చర్య పోతున్నారు. చదువుకొని ఇంకో విధంగా ఆర్జించడము తెలియని ఆడదానికి, ఇదే సంపాదించే మార్గము. నేను అట్లాగ సంపాదించిన డబ్బు ఏ విధంగానూ దుర్వ్యయము చేయడం లేదు. దాచిపెట్టి ఉంచాను తీసుకోండి కావలిస్తే."

నాకు జాలివేసింది. పాపం ఆవిడ ఎంతో ఆశతో చీమ కూడబెట్టినట్లు కూడబెట్టిన సొమ్మును తీసుకోవడం అన్యాయం అనిపించింది. ఆవిడది దొంగతనమైతే నాది బందిపోటుతనం అవుతుందని తోచింది.

ఆ రోజు నుంచి జేబులో సాధ్యమైనంత ఎక్కు చిల్లర వదిలేసి, ఎంతవదిలేసింది జ్ఞాపకం ఉంచుకోవడానికి ఏ మాత్రము ప్రయత్నం చేసేవాణ్ణి కాదు.

నాకు ఉన్న యీ మరపు రోగాన్ని మా ఆవిడ స్వలాభానికై ఇంకో విధంగా కూడా ఉపయోగించుకొన్నది.

చేతిలో డబ్బులేనప్పుడు నేను ఆవిడ దగ్గరకెళ్ళి "చూడూ నాలుగు రూపాయిలు కావాలె ఉంటే ఇవ్వూ." అంటాను.

"నా దగ్గర డబ్బు ఎక్కడిదండీ. మీరు డబ్బు నాకు చూపిస్తారు గనకనా! జాగ్రత్తగా పెట్టెలో పెట్టుకొని

తాళం వేసి మరీ పోతారాయే. ఎక్కడినుంచి వస్తుందండీ డబ్బు నాకూ?" అంటుంది ఆవిడ.

కాని ఆమె డబ్బు ఎక్కడనైనా పుట్టించగలదని నాకు తెలుసు. అందుకని నేను అంటాను "అల్లాగ అంటే కుదరదు. ఎక్కడైనా అప్పు అయినా తెచ్చి సర్దాలె. ప్రాణం మీది కొచ్చింది."

"సరే. అయితే నాయుడుగారి భార్యనడిగి తెస్తానుండండి. కాని మీరు నెలాఖరుకు ఆ బాకీ తీర్చకపోతే మాటదక్కదు. తీసుకొనేటప్పుడు బాగానే తీసుకొంటారు. కాని ఇవ్వడం వచ్చే సరికి మీకు ఏదీ జ్ఞాపకం ఉండదు," అంటుంది.

"నాకు జ్ఞాపకం ఉండకపోతే నీకు ఉంటుందిగా! చెవులు మెలేసి తీసుకోగలవు."

'ప్రతినెలా ఎక్కడ చెవులు మెలేసేదండి. జ్ఞాపకం ఉంచుకొంటానూ అంటేనే తెస్తాను.' అంటుంది.

సరే ఏం జేస్తాను. ఆమె పెట్టిన షరతులకు అన్నింటికి అంగీకరించే వాణ్ణి. ఏమిటవి? ఒకటి జీతం రావడంతోనే, అన్నిటికంటే ముందు యీ బాకీ తీర్చాలి. రెండు, తీసుకొన్న డబ్బుకు ఒకటో రెండో చేర్చి ఇవ్వాలి. ఆ అదనంగా తీసుకొన్న మొత్తం తనకు! తాను శ్రమ పడ్డందుకు ప్రతిఫలం అది. మూడు, అప్పుచేసిన మొత్తానికి రూపాయికు అణా వడ్డీ. నాలుగు రూపాయిలు తీసుకొంటే నాలుగు అణాలు వడ్డీ. ఇల్లాగ కాబులివాలా పెట్టే షరతులన్నీ పెడుతుంది. సరేనని అన్నిటికీ ఒప్పుకొన్న తరువాత ఆవిడ నాలుగు రూపాయిలు తెచ్చి నాకిస్తుంది.

నెలాఖరుకు ఆ నాలుగూ వసూలు చేసేది చేసి మరో నెల గడిచిన తరువాత, "ఏవండీ ఆ నాయుడుగారి భార్యకు ఇవ్వవలిసిన నాలుగు రూపాయిలు ఇవ్వకనే పోతిరే!"—అంటుంది.

'క్రిందటి నెల వసూలు చేస్తివిగా?'

"అయ్యో, అయ్యో, ఇంత మరుపైతే ఎల్లాగ కాపురం చెయ్యడం; క్రిందటినెల జీతం వచ్చినప్పుడు అడిగితే, ఈ నెల మిగలలేదు—వచ్చే నెల తప్పకుండా ఇస్తానని. మళ్ళీ ఇప్పుడు ఇవేం మాటలండీ" క్రిందటి నెల ఇచ్చానని నేను గట్టిగా అనలేక పోతిని: నాకు జ్ఞాపకం ఉండిచావదాయె?

ఆ బాకీ తీరడానికి పది నెలలైనా పట్టేది. ప్రతి నెల ఇవ్వలేదని దబాయించి వసూలు చేసేది.

అప్పుడప్పుడు ఆమె నాకు తన స్వార్జితంలో నుంచి పాతికా పరకా అప్పు ఇస్తుండేది. ఇక ఆ బాకీ తీరడము అనేది ఎప్పుడూ లేదు. ఎన్నిసార్లు ఇచ్చినా అది ఆమెకు ఏదో చీర కొనుక్కుంటానికి బహుమానంగా ఇచ్చినట్లూ. ఆ బాకి బాకీగానే ఉన్నట్లూ లెక్కలు తేల్చేది. ఆ బాకీ తీరడం అటూ లేక పోవడం అట్లా ఉండగా, పైగా దానిపైన బోలెడు వడ్డీ పెరిగి పోతూండేది.

* * * *

నేను ఏదో డబ్బు విషయంలో మరచిపోవడము గొప్ప నేరంగా గాని, పెద్ద ప్రమాదకరమైన విషయంగా గాని ఎవరూ చూడరు అనుకొంటాను, ఎందుకంటే అసలు పెళ్ళాము ఉందనే సంగతి మరచిపోయే పెద్దమనుష్యుల ముందు నేనెంత, నా మరుపెంత?

* * * *

దుష్యంతుడు కణ్వాశ్రిమంలో శకుంతలను గాంధర్వ విధిని వివాహమాడి ఆ విషయమే మరచి పోవడము ఎంత విపరీత విషయము!

* * *

కొన్ని విషయాలు మనస్సుకు ఎక్కువైన దుఃఖాన్ని గాని బాధను గాని కలిగించేవి మరచి పోవడమే సుఖం. ఆప్తులైన వారి మరణం వల్ల కలిగే బాధను మరచి పోవడానికి అనేక విధాల ప్రయత్నిస్తాము మనము.

* * * *

మరచిపోవడానికి అనేక మార్గాలున్నవి. ఒకటి ఆ ఆలోచన మాని మరో విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచించడం. రెండు, నిద్రపోవడము.

లక్ష్మణుడు రామునితో కలిసి అరణ్యవాసానికి వెళ్ళి పోతే తత్సంబంధంగా ఏర్పడ్డ విరహాన్ని, దుఃఖాన్ని మరిచిపోవడానికి ఊర్మిళ ఆ పదునాలుగు సంవత్సరాలు నిద్రపోయింది.

* * * *

అహల్య ఇంద్రునితో సంభోగ క్రియజరిపి, ఆ విషయము భర్తకు తెలియగానే పశ్చాత్తాప పడింది. ఆ పశ్చాత్తాపము. తప్పు చేశానే అనే చింత, ఆమెను కాల్చుకు తిన్నది. ఆ బాధనుండి విముక్తి పొందడానికి ఆమె రాయిగా మారిపోయి, చివరకు శ్రీ రామచంద్రుని పాద స్పర్శచే పవిత్రురాలై మళ్ళీ చైతన్యాన్ని పొందినది.

* * * *

కాలేజీ అధ్యాపకులకు యీ జబ్బు ఎక్కువగా ఉన్నట్లు అనేక కథలు చెపుతున్నవి.

ఒకాయన ఇంటికెళ్ళి పెందలాడే పండుకొని నిద్రపోవాలనుకొన్నాడు. గబగబా ఇంటికి వెళ్ళాడు. భోజనానంత

రం ఇవ్వాళేదో చేద్దామనుకొన్నాను. ఏమిటప్పా అది? అని ఆలోచిస్తూ, రాత్రంతా మేలుకొని కూర్చున్నాడట!

* * * *

ఉపాధ్యాయులకు ఈ మరపు ఎక్కువగా ఉంటుంది. అతని వద్ద అనేక మంది విద్యార్థులు చదువుకొంటారు. ప్రతి సంవత్సరం వందలకొద్దీ విద్యార్థులు పాఠశాలను వదలి పోతూంటారు. ఉపాధ్యాయులు ఎంతమందినని గుర్తుంచుకోగలరు. అసాధ్యమైనపని అది.

అదీగాక, చదువుకొన్న రోజులలో వాళ్ళు పిల్లలు. అప్పటి రూపం మారిపోయి, తరువాత ఇంకొక రూపంలో ప్రత్యక్షమౌతారు వాళ్ళు. ఎల్లా వాళ్ళను గుర్తుపట్టడం? అసాధ్యము.

ఒకసారి ఒక పొడుగాటి పడ్రవాడు నాకు కనపడి. "ఏమండోయి మాస్టారు?'' అంటూ నమస్కరించాడు.

ఎక్కడో చూచినట్లే ఉన్నది ముఖం! కాని ఎవరైందీ జ్ఞాపకం రాలేదు. అయినా జ్ఞాపకం వచ్చినట్లు నటిస్తూ "ఓహో ఏమిటి సంగతి, ఇప్పుడు ఏంజేస్తున్నావు?'' అన్నాను.

"ఇప్పుడు నేను డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్నానండి. మీ చలవ.'' చచ్చాం? ఇంత పెద్ద ఉద్యోగంలోకి వచ్చిన విద్యార్థిని మరచిపోవటం ఎంత అసభ్యం.

అందుకని "అవునవును. నీవు బందరులో నా దగ్గర చదువుకొన్నావు కదూ?''

మాస్టారూ మీరు మరచిపోయినట్లున్నారే బందరులో కాదండీ. భీమవరంలో మీ దగ్గర చదువుకొన్నాను.

"అవునయ్యా. నాకు జ్ఞాపకమే. అదే బందరు అంటే మవరం. రామారావుకాదూ నీపేరు.?

కాదండీ మాస్టారూ. నాపేరు పైడితల్లి.

ఎవరో ఈ పైడితల్లి ఎవరికి జ్ఞాపకం.

'మీరు గుర్తుపట్టినట్లు లేదు, నేను మీ క్లాసులో చివర బెంచీ పైన కూర్చునేవాణ్ణి.'

ఏ బెంచీ పైన కూర్చున్నదీ కూడా జ్ఞాపకం ఉండేడ్సింది. అసలు మనిషినే గుర్తుపట్టలేక చస్తుంటే. నా చూపుల వల్ల నాకింకా జ్ఞాపకం రాలేదని తెలిసికొని, ఆయన అన్నాడు. "ఒకసారి మీరు నా చెంపపైన కొట్టారు.జ్ఞాపకం ఉందాండి?''

ఎంతమందిని ఎన్నిసార్లు కొట్టానో ఎవరికి జ్ఞాపకం!

"అవునవును కొట్టే ఉంటాను. వెధవది నాకాజబ్బు ఉండేది. నీవు డిప్యూటీ కలెక్టరువు అవుతావని ఊహించలేక పోయినానయ్యా!" అని నొచ్చుకొన్నాను.

ఈ మాట మీద ఆ యువకుడు "అసికాదండీ మేస్టారూ మీరు అల్లాగ కొట్టి నాలుగు ముక్కలు చెప్పబట్టే నేను ఇంతవాణ్ణి అయినాను.''

"మంచి మాట అన్నావు నాయినా, అల్లా అయితే ఇక ముందు కూడా కొడుతూ ఉంటానులే'' అన్నాను.

అయితే ఇంతకూ నేను ఎవ్వరైంది మీకు జ్ఞాపకం వచ్చినట్లేనా? అని అడిగాడు మళ్ళీ.

"జ్ఞాపకం రాకేం వచ్చింది.'' అని అన్నా. నా చూపులు ఇంకా సందేహాస్పదంగా ఉండటం చూచి ఆ చిన్నవాడు అన్నాడు. "ఇంత ఎందుకండీ మాస్టారూ నేను సుబ్బారావు తమ్ముణ్ణి" అన్నాడు.

అసలు వీడెవరో తెలియక చస్తుంటే ఇంకో సుబ్బారావును తీసుకొచ్చి వాడి తమ్ముణ్ణి అంటాడు, ఇదేం కర్మము. ఆ సుబ్బారావు ఎవరో, అయినా అంత స్పష్టంగా సుబ్బారావు తమ్ముణ్ణి అని చెపుతూంటే ఇంకా జ్ఞాపకం రానట్లు నేను చూస్తే, అతని మనస్సు ఎంతో కష్టపడక మానదు. అందుకని ఇక అప్పటికి సంగతంతా జ్ఞాపకం వచ్చినట్లు నటిస్తూ అట్లా చెప్పు, సుబ్బారావు తమ్ముడివిటయ్యా. ఆమాట మొదటే చెబితే ఇంత అవస్థ లేకపోవునుగా. ఓహోహో, అయితే నీవు సుబ్బారావు తమ్ముడివన్నమాట. సరె. సరె ఇంకెందుకూ. అంతా జ్ఞాపకం వచ్చింది. అయితే సుబ్బారావు కులాసాగా ఉన్నాడా? అన్నాను.

ఈ చివర వాక్యం విని ఆ అబ్బాయి తెల్లబోయి, 'మాస్టారూ మీకు జ్ఞాపకశక్తి బొత్తిగా తగ్గిపోయినట్లుందే'?

'ఏం?'

"మీరు భీమవరంలో ఉండగానే మా అన్నయ్య చనిపోయినాడు గదండీ. ఆరోజున స్కూలుకు సెలవ ఇచ్చారు. సానుభూతి సభ జరిగింది. మీరు కూడా మాట్లాడారు" అని గబగబ చెపుతూంటే నేను నిర్ఘాంతపోయినాను. నేను ఏమి మాట్లాడినా నా దౌర్బల్యం ఇంకా బయటపడేలాగుంది.

చివరకు నాకు మరపు రోగం ఈ మధ్య ఎక్కువైంది అని అంగీకరించి అతనికి క్షమాపణ చెప్పుకొని నా దారిని నేను పోయినాను.

* * * *

ఒకాయన ఏదో ఊరుకు ప్రయాణం పెట్టుకొన్నాడు. రైలు స్టేషనుకు వెళ్ళి తాను వెళ్ళవలసిన ఊరుకే టిక్కెట్టు కొన్నాడు. అప్పటిదాకా తాను వెళ్ళదల్చుకొన్న ఊరు పేరు జ్ఞాపకం ఉంచుకొనడం గొప్ప విషయమే అనుకోండి. ఎందుకంటే కొందరు స్టేషనుదాకా వెళ్ళి తాను ఏఊరు

వెళ్ళవచ్చుకొన్నదీ మరచిపోయి జ్ఞాపకం తెచ్చుకోడానికి నానా తంటాలూ పడుతూ ఉంటారు.

ఎవరి సంగతో ఎందుకు, మా మొక్కపాటి ఒకసారి ఇల్లాగ ఏదో ఊరుకు పోవాలని బయలుదేరి స్టేషనుదాకా పోయే సరికి ఆ ఊరు పేరు కాస్త మరచిపోయినాడు.

ఏంజేయాలి?

ఎంత ఆలోచించినా ఆ ఊరుపేరు నోట్లో ఆడుతున్నట్టు ఉంటుందే గాని, ఎంతసేపటికి జ్ఞాపకం రాదు. చివరకు ఏంజేశాడంటే బుకింగ్ ఆఫీస్ దగ్గరకు వెళ్ళి, చూద్దాము ఏం జరుగుతుందోనని, "ఓ టిక్కెట్టు ఇవ్వండి అర్జంటుగా" అన్నాడు.

"ఏఊరుకు మీకు టిక్కట్టు కావలసిందీ?"

ఈ మాట విని మన మొక్కపాటి తెల్లపోయి అవునవు నండోయ్-ఏ ఊరు వెళ్ళాలిసింది నేను చెప్పాలగదూ. అవు నవును.. ఏ ఊరు నేను వెడతామనుకొన్నదీ జ్ఞాపకము రావడం లేదే..పోనీ. చూడండి. నేను వెళ్ళదల్చుకొన్నది ఈఊరుకూ మద్రాసుకూ మధ్య నున్న ఊరే-అసలు ఇక్కడ నుంచి మద్రాసు దాకా ఉన్న స్టేషనుల పేర్లు చెప్పండి. జ్ఞాపకం వస్తుంది అన్నాడు. బుకింగ్ క్లర్కు నవ్వి తలుపు మూసి పొమ్మన్నాడు.

అల్లాగ కాక, ఈ పెద్దమనిషికి జ్ఞాపకమూ ఉంది. టిక్కెట్టు కొన్నాడు. కొంత దూరం ప్రయాణం చేశాడు. చాలా స్టేషనులు దాటి పోయినాయి. అప్పుడు అనుకొన్నాడు, "నేను ఏఊరు వెళ్ళాలని బయలుదేరానా" అని. ఎంత సేపటికి ఆ ఊరు పేరు తోచందే.

ఛా ఛా. ఎంత దరిద్రపు అవస్థ వచ్చింది. స్టేషనులు వస్తున్నవి. పోతున్నవి. ఆయన ఆలోచనకు తాను ఎక్కడికి వెళ్ళుతున్నదీ అందలేదు. ఎక్కడ దిగాలిసిందీ తెలియ కుండా ఊరికే రైలులో అల్లాగ ఎంతసేపని ప్రయాణం చేస్తాడు,

ఇదేమి బాగుండలేదు. ఇల్లాగ వెళ్ళి లాభం లేదు.ఇంటికి వెళ్ళిపోదాము అని విసుక్కొని ఒక స్టేషనులో దిగి డౌన్ ట్రెయిన్ కోసం వెయిటింగ్ రూములో కూర్చున్నాడు. ఆ ట్రెయిన్ఆలస్యంగావస్తుందని తెలిసింది.

ఛీ ఛీ. ఈ బళ్ళు ఎప్పుడూ ఆలస్యంగానే వస్తూ ఉంటవి. సరియైన టైముకు రావడం ఎప్పుడో నెలకొకసారి.ఆ ఆల స్యం అయినా ఏ పదినిమిషాలో ఇరవై నిమిషాలో కాదు. ఈ రోజులలో బండ్లు గంటల కొద్దీ ఆలస్యంగా వస్తవి.

ఓ కథ చెపుతాను. ఒకాయన రైలు స్టేషనుకు వెళ్ళి తనకు కావలసిన బండి ఎప్పుడొస్తుందని స్టేషను మాస్టరును అడిగాడు. ఆయన, బండి ఇవ్వాళ లేటు అన్నాడు.

'ఎంత లేటుగా వస్తుంది?'

'బ్రహ్మదేముడికి తెలియాలి'

'అదేమిటండీ అల్లా అంటారూ'

రైలుబండిగదా, ఎంత ఆలస్యంగా వస్తుంది చెప్పలేక పోవడమేమిటి.'

''చెప్పలేమండీ.''-అని స్టేషను మాస్టరు విసుక్కొని ఆయనను పంపివేశాడు. ఆయనకు చాలా కోపం వచ్చింది. స్టేషను మాస్టరు తనతో వినయంగా మాట్లాడలేదని ఈ విషయమై పై అధికారులకు రిపోర్టు చేద్దామని కూడా అనుకొన్నాడు. కొంతసేపు చూద్దాం ఒక గంటలోనైనా రాకపోతుందా అని కూర్చున్నాడు.

పది నిమిషాలలో తాను పోవలసిన దిక్కుకు పోయే బండి వచ్చింది. ఈయన ఆశ్చర్యపోయినాడు. పది నిమిషా లలో బండి వస్తే, ఆ సంగతి స్టేషను మాస్టరుకు తెలియ కుండా ఉంటుందా. ఆయనరు కోపం వచ్చింది. స్టేషను మాస్టరును నాలుగూ పెడదామని కోపంతో పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ ఆయన గదిలోకి వెళ్ళి "ఏమయ్యా పెద్దమనిషి, పది నిమిషాలలో వచ్చిందిగదా బండి. యీ సంగతి నీకు తెలియకుండా ఉంటుందా. ప్రయాణీకులకు ఇల్లాంటి మర్యాదేనా నీవు చూపించేది. కాసేపట్లో వస్తుందని చెపితే నీనోటి ముత్యాలు ఏమైనా రాలిపోతయ్యా. పైగా ఆబండి ఎప్పుడొస్తుందో బ్రహ్మదేవుడి కేతెలియాలన్నావు-'' అని గట్టిగా అనే సరికి ఆ స్టేషను మాస్టరు అన్నాడు,

''మీరు కలకత్తా మెయిలు ఎప్పుడు వస్తుందని కాదు అడుగుతా?"

"అవును.''

''అయితే నేను సరిగానే జవాబు చెప్పాను. ఇప్పుడూ ఆమాటే అంటాను, ఇప్పుడు పదింటికి రావలిసిన కలకత్తా మెయిలు ఎప్పుడొస్తుందో బ్రహ్మదేవుడికే తెలియాలె అని మళ్ళీ అంటాను కావలిస్తే" అన్నాడు.

అదేమిటండీ. బండి వచ్చి ప్లాటుఫారం మీద ఉంటేనే.

ఆ మాట మీద స్టేషను మాస్టరు నవ్వి ''అదిటండీ మీ సందేహం. అయితే చెపుతాను వినండి. ఇప్పుడొచ్చింది నిన్న ఈ వేళకు రావలసిన మెయిలు. మొన్నటి బండి ఇంకా రానేలేదు. అటువంటి అప్పుడు నేను ఏలాగ చెప్పే దండీ ఇవ్వాళటి బండి ఎప్పుడు వస్తుందో. సాయంత్రానికి రావచ్చు. రేపు రావచ్చు."

''అసలు రాకపోవచ్చు'' అన్నాడు. ఈయనకు ఒళ్ళు మండి 'ఆ, అదికూడా సంభవమే' అన్నాడు స్టేషనుమాస్టర్లు.

ఎందుకు చెప్పానంటే ఇదంతా, ఈయన అంటే తాను ఎక్కడికి పోతున్నది జ్ఞాపకంరాని ప్రయాణీకుడు, ఆ దిగిన స్టేషనులో కూర్చుని, తనను ఇంటికి తీసుకుపోయే డౌన్ ట్రెయిను ఎప్పుడొస్తుందో, అసలు రానేరాదేమోనని ఆందోళన పడసాగాడు.

అతనికి ఏమిచేయడానికి తోచక ఊళ్ళోకి వెళ్ళి ఎక్కడైనా భోజనం చేసి దాని తరువాత కార్యక్రమం తాపీగా ఆలోచించుకోవచ్చు అనుకొన్నాడు.

సరే. ఊళ్ళోకి వెళ్ళాడు. భోజనం చేశాడు. వీధిలో అల్లాగ తిరుగుతూ ఉంటే ఒక స్నేహితుడు కనపడి పలకరించాడు. ఈయన తన సంగతంతానూ, తనకు వచ్చిన సంకటాన్ని గురించీ అంతా చెప్పాడు ఆయనతో.

అంతా విని ఆయన అన్నాడు. ''ఓరి పిచ్చి సన్యాసి పందమైళ్ళు వచ్చి మళ్ళీ వెనక్కి వెడతానంటావేమిటయ్యా. నీవు ఎక్కడికి వెళ్ళాల్సిందీ తెలియటమే కదా నీకు కావలసింది. దానికో ఉపాయం చెబుతా విను. నీవు బయలుదేరేటప్పుడు, నీవు నీ భార్యతో చెప్పలేదా ఫలాని ఊరు వెళ్ళి వస్తానని?''

''చెప్పాను. చెప్పకుండా ఉంటానా- చెప్పే ఉంటాను.''

''బతికిపోయినావు పో. ఒక టెలిగ్రాం ఇయ్యి ఆమెకు, నేను ఎక్కడికి వెడుతానని నీతో చెప్పానో వైరు ద్వారా తెలియజేయమని, ఆమె వైరు ఇస్తుంది. దాంతో తేలిపోతుంది.''

''అమ్మయ్య'' అనుకొని ఆయన అల్లాగే భార్యకు తంతి ఇచ్చాడు. ఓ గంటలో తిరిగి జవాబు వచ్చింది. ''మీరు ఎక్కడికి వెళ్ళుతున్నదీ నాకు చెప్పలేదు. కాని టిక్కెట్టు కొన్నట్లు అబ్బాయి చెప్పాడు. ఆ టిక్కెట్టు చూస్తిరా, మీరు ఏఊరు వెడుతున్న తెలుస్తుంది'' అనిఉంది ఆ టెలిగ్రాంలో.

తరువాత టిక్కెట్టు చూచి ఆ సంగతి తెలుసుకొన్నాడు, కాని మరుపు వల్ల పడవలసిన బాధలన్నీ పడనే పడ్డాడు. అదీ నేను చెప్పదల్చుకొన్న సంగతి.

* * * *

మనము పిల్లలను ఏ ఊరైనా పంపించేటప్పుడు వాళ్ళను రైలు ఎక్కించి జాగ్రత్తగా ఉండమని లక్షసార్లు చెప్పి, తీసుకెడుతూ ఉన్న వస్తువులలో ఏదిగాని మరిచిపోవద్దని చాలా సార్లు హెచ్చరించి తీరా రైలు కదలిన తరువాత కుర్రవాడికి టిక్కెట్టు ఇవ్వడం మరచిపోయినట్లు తెలుసుకొంటూ ఉంటాము.

* * * *

గోల్డు స్మిత్ ఒక కథ వ్రాశాడు. అందులో ఒక పెద్ద మనిషి పొరుగూరులో వున్న తన మామగారింటికి వెడతాడు. ఆయిల్లు ఎక్కడున్నదీ ఆయనకు జ్ఞాపకం ఉండదు. ఒక యింట్లోకి పోయి అది కాఫీ హోటలు అనుకొని, తనకూ తనతో వచ్చిన స్నేహితులకూ ఫలహారాలు తెప్పించుకొని తిని నానా అల్లరీ చేస్తాడు. తీరా చూస్తే అదే తన మామగారి ఇల్లు.

* * * *

ఒకాయన ఆఫీసులో పనిచేసి విసిగి ఇంటికి వస్తాడు. ఏదో కారణం వల్ల భార్యమీద కోపం వచ్చింది. మాట మీద మాట పెరిగి పోతుంది. చివరకు ఆవిడను తిట్టడం సాగిస్తాడు. ఆవిడ యేమీ మాట్లాడదు మొదట్లో, కాని ఆయన ఊరికేసాధిస్తూఉంటే, తనూ ఏదో మాటకుమాటఅంటిస్తుంది. పోట్లాటే పెరిగిపోతుంది. కొంత సేపు అయినతరువాత తనకు అసలు ఎందుకు కోపం వచ్చిందో ఎందుకు తిట్టటం సాగించినాడో జ్ఞాపకం లేక, పోట్లాట మధ్యలో ''ఏమే అది సరే గాని, మరచి పోయినాను ఎందుకూ ఇవ్వాళ నిన్ను తిడుతున్నది?'' అని అడిగాడు.

ఆ విషయం ఆవిడకూ జ్ఞాపకం లేదు. ''ఎందుకేమిటి, మీరు ఊరికేనే తిడతారు. మీ స్వభావమే అటువంటిది'' అన్నది,

మళ్ళీ తిట్టడానికి ఆయనకు ఆధారం దొరికింది. నేను ఊరికే తిడతానా. నా స్వభావం అటువంటిదా? నా స్వభావంలోనే తప్పు పట్టావూ? అంటూ ఆ పాయింటుమీద పోట్లాట సాగించాడు.

ఒక పని చేస్తూ, ఆపని ఎందుకు చేస్తున్నదీ మరచి పోయి, టక్కున మధ్యన ఆగిపోయి ఈ పని మనము ఎందుకు చేస్తున్నాము అని ప్రశ్నించుకోవడం కొందరికి విపరీతంగా కనపడుతుందేమో కాని అది సాధారణంగా జరిగే పనే.

* * * *

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమై నాలుగు నెలలు గడచిన తరువాత మిత్ర మండలివారు అందరూ సమావేశమై, మనము అసలు యుద్ధం ఎందుకు చేస్తున్నాం. అని ప్రశ్నించుకొన్నారు. ఏమి సాధించాలని మనము యుద్ధము చేస్తున్నామూ అని నాలుగు నెలలకొకసారి ప్రశ్నించుకొంటూ వారు యుద్ధం నడిపిన విషయం అందరికీ తెలిసిందే.

* * * *

ఇంటి నుంచి బయటకు పోయేటప్పుడు తలుపు తాళం వేసి, నాలుగు సార్లు లాగి చూచి, తృప్తిపడి, వీధిలోకి

వెళ్ళిన తరువాత తలుపు తాళం వేశానా, అని అనుమానం మళ్ళీ రావడం ఎన్నిసార్లో జరిగింది.

కావలసిన పుస్తకాలు తీసుకొని ఆఫీసుకని బయలుదేరి కొంత దూరం పోయిన తరువాత చటుక్కున ఏదో ఆలోచన వచ్చి పుస్తకాలు తెచ్చుకోవడం మరచిపోయినాను అని అనుకొని, మళ్ళీ ఇంటికి రావడం ఎన్నిసార్లు జరగలేదు?

అట్లా ఇంటికొచ్చి. ఇంటావిడ ఏదో అడిగితే సమాధానం చెప్పి అసలు మళ్ళీ ఎందుకొచ్చానా అని అనుకొన్న సమయాలూ ఉన్నవి.

* * * *

ఈ మరపు అనే వికారం మనకే కాదు చాలా గొప్ప వాళ్ళూ, మేధావులూ అనుకొన్న వాళ్ళకే ఉంది. థామస్ ఎడిసన్ గొప్ప విజ్ఞాన వేత్త. సైన్సులో ఎన్నాళ్ళనుంచో వేళ్ళు పాతుకుపోయి ఉన్న సిద్ధాంతాలను తలక్రిందు చేసిన మేధావి.

ఆయన గవర్నమెంటు పన్ను చెల్లించడానికి ఏదో ఆఫీసుకు వెళ్లాడు. అక్కడ ఒక పెద్ద క్యూ ఉన్నది. ఆ క్యూలో ఆయన నిలువ బడ్డాడు. ఎంతసేపో అయితేనేగాని తన వంతు రాదని ఆయన గ్రహించాడు. ఈ లోపునా ఏదో ఆలోచనలో పడ్డాడు. చివరకు ఆయన వంతు వచ్చింది. ఆ ఆఫీసరు యీయనను మీ పేరు ఏమిటని ప్రశ్నించాడు. ఎడిసన్ తెల్లపోయి మాట్లాడ లేదు. మీ పేరేమిటండీ? అని మళ్లీ అడిగాడు ఆఫీసరు. ఈ మహానుభావుడు పెదవి విప్పి మాట్లాడందే. ఆయన పేరు ఆయనకే జ్ఞాపకం లేదు. ఆయన ప్రక్కనే నిలబడియున్న మరో పెద్ద మనిషి, మీ పేరు థామస్ ఎడిసన్ ఇప్పుడు చెప్పండి అని అన్న దాకా ఆయనకు తన పేరు జ్ఞాపకం రాలేదుట!

మరో రోజు.

తెల్లవారింది. ఎడిసన్ నిద్రలేచాడు. కాల కృత్యాలు తీర్చుకొన్నాడు. తెల్లవారు ఝామువరకు లేబరేటరీలో ఏదో పని చేశాడేమో ఆకలి వేస్తున్నది, నిద్ర కూడా వస్తున్నది. నౌకరు ఇంకా టిఫిన్, కాఫీ తేలేదు. టిఫిన్ వచ్చే లోపున ఒక కునుకు తీద్దామని పడుకొన్నాడు.

ఆయన నౌకరుకు ఓ గమ్మత్తు చేద్దామని బుద్ధిపుట్టింది. తెచ్చిన టిఫిన్ తానుతిని. కాఫీతాగి కడక్కుండా ఉన్న ప్లేట్లూ, తాగిన కాఫీ కప్పు ఆయన బల్లమీద పెట్టి వెళ్లిపోయినాడు.

తరువాత కొంత సేపటికి ఎడిసన్ నిద్రలేచి, కళ్లు నులుపుకుంటూ ఖాళీ ప్లేట్లూ కప్పుజూచి నిద్రపోక పూర్వమే తిని ఉంటానని అనుకొని త్రేపి హాయిగా చుట్ట వెలిగించి, తన పనులు చూచుకోవడం మొదలు పెట్టాడుట.

జరిగిన విషయం ఆయనకు తెలియజెప్పిన తరువాత గాని ఆయనకు ఆకలి విషయం జ్ఞాపకానికి రాలేదట.

మన దేశంలో విజ్ఞాన శాస్త్రవేత్త అయిన జగదీశ చంద్ర బోసును గూర్చి కూడా ఇటువంటి కథలే చెపుతారు.

సర్ వాల్టర్ స్కాట్‌ను గురించిన కథ ఒకటి ఉన్నది.

లార్డు బైరన్‌ను సన్మానించడానికి ఒక పెద్ద సభ ఏర్పాటు చేశారు. పెద్దలంతా ఆ సభకు వచ్చారు.

సర్ వాల్టర్ స్కాట్‌ను బైరన్ మహాశయుని కవితా మాధుర్యాన్ని గురించి మాట్లాడమన్నారు. స్కాట్ ఏవో పద్యాలు కొన్నిచదివి వానిలోని భావాన్ని, మాధుర్యాన్ని గూర్చి అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. ఇంతలో సభలో అందరూ పెద్దగా నవ్వడము మొదలు పెట్టారు. కారణం ఎవరికీ కొంత సేపటివరకూ అంతు పట్టలేదు. అప్పుడు స్కాట్‌కు సమీపంలో కూర్చున్న ఒక ఆయన స్కాట్‌తో "మహాశయా మీరు చదువుతున్న పద్యాలు బైరన్‌వి కావు. మీరు వ్రాసినవే చదువుతున్నారు." అని చెప్పినాడు. అంతవరకు స్కాట్ తాను చదువుతున్నవి బైరన్ పద్యాలే అనుకొన్నాడట.

అంత గొప్ప వాళ్ళకే యీ మరపు ఉంటున్నదే, ఇక మనబోటి సామాన్యులకు ఉండటంలో వైపరీత్యం ఏముంది.?

* * * *

మా యింట్లో ఒక రోజున జరిగిన గొడవనుగూర్చి చెప్పి. యీ ప్రసంగం ముగిస్తాను.

మరునాడు ఎవరో బంధువులు వస్తారని ఉత్తరం వచ్చింది. బజారుకు పోయి కూరలూ అవీ తెమ్మని మా ఆవిడ చెబుతున్నది.

"ఏమండోయి, నేను చెప్పిందంతా విన్నారా? ఆ వస్తువులన్నీ తీసుకరండి. జ్ఞాపకం ఉంటయ్యా?"

నాకు జ్ఞాపకం ఉండదన్న మాట నిజమే. కాని ఆ విషయం ఆమెగారి ఎదుట ఒప్పుకోవడము నాకు చిన్నతనం అనిపించింది. అందుకని అన్నాను— "ఆహా, ఎందుకు అట్లా అడుగుతావు. నాకు జ్ఞాపకం ఉండవనేగా నీవనుకోటం?"

'అవును'

అంత గట్టిగా అవును అనేసరికి నాకు ఒళ్లు మండిపోయింది. "ఆఁ అవును. నీకు అంతా తెలిసినట్లు? నాకు ఎందుకు జ్ఞాపకం ఉండవూ, అందులో అన్నిసార్లు పాఠం చెప్పినట్లు చెప్పిన తరువాత."

ఆవిడ నవ్వి—"మీకా జ్ఞాపకం ఉండేది. అయ్యో, అయ్యో, అంతమాత్రం కూడానా, అది సరేగాని ఎందుకైనా మంచిది కాగితం మీద వ్రాసుకోండి."

"వ్రాసుకోవాలేం? నేను వ్రాసుకోను. ఒకవేళ వ్రాసుకొంటానే అనుకో, వ్రాసుకొని ఆ కాగితం జేబులో పెట్టుకొని, బజారుకు వెళ్లిన తరువాత ఆ సంగతే మరచిపోకూడదు? కాబట్టి ఇక ఊరుకో. తప్పకుండా నీవు చెప్పినవన్నీ తెస్తాను" అన్నాను.

"వ్రాసుకోమని బలవంతపెడితే ఏమి లాభము. ఆ కాగితం సంగతే మరచిపోతే ఏంజేయగలము" అని అనుకొని ఆవిడ నన్ను ఆ విషయమై బలవంతం చెయ్యలేదు. "తప్పక వస్తువులన్నీ తీసుకురండి. లేకపోతే అభాసు అవుతుంది" అని మాత్రం మరొకసారి చెప్పి ఊరుకొన్నది.

నేను బట్టలు వేసుకొని బయలుదేరి "ఇదుగో వెడుతున్నాను, తలుపేసుకో" అని కేకేసి వీధిలో కాలుపెట్టాను. రెండు మూడు అడుగులు వేసి వెనక్కి తిరిగి జూశాను. ఆవిడ గుమ్మంలోనే నుంచుని ఉన్నది చేతిలోఉన్న సంచిని ఊపుతూ.

నేను సంచి తేవటము మరచిపోయినాను. ఆ సంచి చూస్తే ఆ సంగతి జ్ఞాపకం వచ్చింది. గిరుక్కున వెనక్కి తిరిగి గబగబ నడిచి వెళ్లి చేతిలో సంచి లాక్కొని, "నేను సంచి తీసుకోవడం మరచి పోయినాననుకొన్నావు గదూ. మరచిపోలేదు. కూరలూ అవీ కూలీచేత పట్టించుకొని వద్దాము అనుకొని బయలుదేరాను. మళ్లీ ఆలోచించి పోనీ ఎందుకైనా ఉంటుందని సంచి తీసికొనే వెడదామని వెనక్కు వచ్చాను. అంతేగాని మరచిపోవడం కాదు" అన్నాను.

'మీరు మరచిపోయినారని నేను అన్నానా?' అంటూ ఆవిడ నవ్వి సంచి నాచేతికిచ్చింది. నిజానికి నేను మరచిపోయినాను. ఆ సంగతి చెప్పడము ఇష్టం లేక యీ నాటకం ఆడాను.

ఆవిడ నవ్వుతూ అక్కడే నుంచుంది. నేను గబగబ ముందుకు నడిచాను. వీధి మలుపు తిరిగేలోపున మా చిన్నవాడు పరుగెత్తుకుంటూ వచ్చి, అమ్మ రమ్మంటున్నది? అన్నాడు.

చికాకు వేసింది. అయినా వెళ్లాను. ఆవిడ నవ్వుతూ "ఏమండీ నేను చెప్పినవన్నీ కొనుక్కు రావడానికే వెడుతున్నారా?" అన్నది.

నాకు చాలా కోపం వచ్చింది

"కొనుక్కురావడానికి కాక ఆడుకొంటానికి వెడుతున్నాననుకొన్నావా?" అన్నాను చిరాకుగా.

"అది కాదండి, కొనుక్కురావడానికైతే పర్సు తీసుకోకుండా పోతున్నారేం,?"

ఛా. ఛా. నిజమే పర్సు మరచిపోయాను. అయితే నా దౌర్బల్యాన్ని నేను అంగీకరిస్తే చులకనై పోను? అందుకని అన్నాను. 'ఇంతేగద. నేను బుద్ధిపూర్వకంగానే పర్సు మరచిపోయాను.'

'బుద్ధిపూర్వకంగా మరచిపోవడం ఏమిటి?'

'ఏమిటా? పర్సు వద్దు అనుకొన్నాను.'

'డబ్బు లేకపోతే ఆ వస్తువులన్నీ ఎల్లాగ కొనగలుగుతారు?'

'ఎల్లాగంటే, అప్పు తెద్దామనుకొన్నాను.'

'కూరగాయలు కూడా అప్పుమీద ఇస్తారుటండీ ఎక్కడైనా? అయితే సరే వెళ్లండి.'

వచ్చాగా, ఆ పర్సు ఇల్లా ఇయ్యి అన్నాను. నిజానికి అప్పు ఎవరిస్తారు.

ఆవిడ నవ్వుతూ పర్సు నా చేతిలో పెట్టింది.

నేను మళ్లీ బయలుదేరాను. మళ్లీ ఏమైనా మరచిపోయి నానా అని ఆలోచించి, ఏమీ మరచిపోలేదని నిశ్చయించుకొని బజారుకై వెళ్లాను.

పదకొండు గంటలకు ఇంటికొచ్చాను. ఆవిడ తలుపు తీసి—"ఇదేమిటండీ వట్టిచేతులతో వచ్చారు. సంచీ ఏదీ, సరుకులేవీ?" అన్నది.

నేను మాట్లాడలేదు.

"ఏమిటి చెప్పండి. ఆ పర్సు ఎక్కడైనా పెట్టి మరచిపోయినారా? అసలు బజారుకు ఎందుకు వెళ్లింది జ్ఞాపకం లేదా? ఏమైంది చెప్పండి."

నేను కోపంతో అన్నాను. "చాల్లే పైగా నేను ఏదో మర్చిపోయినట్లు తేల్చి మాట్లాడుతావు. నీవు ఆ పర్సులో డబ్బు వేయడం మరచిపోయి వట్టి పర్సు ఇచ్చావు. ఏమి పెట్టి కొనుక్కురావాలె నేను. నీవు చేసే పనులన్నీ ఇల్లాగే ఉంటవి. పైగా నన్నేదో అంటావు?" అని విసుక్కున్నాను.

"నేను పర్సులో డబ్బు ఉందనుకొన్నానండీ."

"చూడక్కర్లేదూ? ఉంది అని అనుకొన్నావూ? అట్లా అనుకోవద్దనీ, నీకు ఎన్నిసార్లు చెప్పాను?"

"పోనీ మీరు చూడకపోయినారా?"

"నేను పర్సులో డబ్బు ఉందనుకొన్నాను."

"అల్లా అనుకోకూడదని మీరే చెపుతుంటిరిగా."

"చాల్లే నిర్వాకం — పో" అని కోప్పడి ఆమెను పంపేశాను.

ఇల్లాగ ఉంటవి మరపురోగం ఉన్నవాళ్ళ వ్యవహారాలు.

(అయిపోయింది)

—:*:—

మన దేశంలో పెక్కు లలిత కళలు ముఖ్యంగా సంగీత నృత్యాలు మన సంస్కృతి, ఆధ్యాత్మిక భావ సంపదకు విడివడరాని భాగంగా చూడబడుతూ వస్తున్నాయి. ఈ కారణం వల్లనే కాలక్రమేణా యీ కళలకు మతంతో సంబంధం కలిగింది. కళాభిమానులు నృత్య సంగీతాలకు దేవతలతో అవినాభావ మేర్పరిచారు. నటరాజస్వామి, శ్రీ కృష్ణుడు ప్రభృతులకు ఏదో ఒక సంగీత వాద్యంతో అవినాభావ సంబంధం ఉంది. సరస్వతి విషయంలో, వీణాపాణి కాని ఆ దేవిని ఊహించటం కష్టం. దీనినిబట్టి, భారతీయ సమాజంలో సంగీతం మున్నగు కళలకు ఎట్టి ఉన్నత స్థాన మీయబడిందో విదితమవుతుంది.


—రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్.

నాగార్జున సాగర్

ఎడమ కాలువకు సొరంగ మార్గం

రాష్ట్ర గవర్నరు శ్రీ భీమసేన్ సచార్ 9-9-59న నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ సొరంగమార్గాన్ని ప్రారంభించటంతో తెలంగాణా ప్రాంతపు పొడి ప్రదేశాల నీటి పారుదలకు కృష్ణానది నీటిని మళ్లించటానికి చేసే కృషిలో మరొక ముఖ్య ఘట్టం ఆరంభమయింది. ఈ సొరంగానికి 80 లక్షల ఘనపుటడుగుల రాతిని త్రవ్వి, 16 లక్షల ఘనపుటడుగుల కాంక్రీటు పూత పూయాలి. ఇటువంటి సొరంగ మార్గం ఇదివరకెన్నడూ త్రవ్వబడలేదు. దీని పనికి ఇంచుమించు 750 టన్నుల ఉక్కు, 15,500 టన్నుల సిమ్మెంటు కావాలి.

ప్రణాళిక అంతా పూర్తి అయేవరకు వేచివుండకుండా ముందుగానే ఫలితాన్ని పొందటానికై నాగార్జున సాగర్ ప్రాజెక్టు రెండు అంచెలలో నిర్మించబడుతున్నది. మొదటి అంచె అంచనా ఖర్చు రూ. 91 కోట్లు. మొదటి అంచెలో నాగార్జునసాగర్ జలాశయం స.స.మ. + 525 వరకు నీటిని నిలవచేయడానికి వీలుగా నిర్మించబడుతుంది. (పూర్తి అయిన పిమ్మట స.స.మ. + 590 వరకు నిలవ చేస్తుంది.) కుడివైపున 135 మైళ్ల పొడుగు కాలువ, ఎడమవైపున 108 మైళ్ల పొడుగు కాలువ త్రవ్వబడతాయి. ఎడమకాలువ మునేరు వరకు నిర్మించబడుతుంది. దీనికి రూ. 23.96



9-9-59న రాష్ట్ర గవర్నరు శ్రీ భీమసేన్ సచార్ నాగార్జునసాగర్ ఎడమ కాలువ సొరంగ మార్గాన్ని ప్రారంభించారు.

కోట్లు ఖర్చు కాగలవు. ఈ కాలువలో 11,000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. అది రెండవ పంటతో సహా 7,90,000 ఎకరాల ఆయకట్టుకి ఉపకరిస్తుంది.

ఈ ప్రాజెక్టు మొదటి అంచెను 1964లో పూర్తిచేయాలని సంకల్పించబడింది. కాలువల క్రింద నీటి పారుదల 1964–65 లో ఆరంభమవుతుంది. దాని పూర్తి అభివృద్ధి 1967-68 నాటికి సాధించబడుతుందని భావించబడుతున్నది.


ఎడమ కాలువ

ఎడమ కాలువ ప్రధాన నదీ కంఠంనుంచి ఇంచుమించు 8 మైళ్ళ దూరంలోగల జలాశయం ముందు భాగంలోగల ప్రధాన తూము నుంచి బైలుదేరుతుంది. మైదానాలకు చేరే ముందు యీ కాలువ విషమమైన కొండ ప్రాంతాలు, స.స.మ. + 626 వరకుగల ఎత్తైన కొండగుట్టల మీదు గాను ప్రవహిస్తుంది. కాబట్టి దీనికి మిక్కిలి అనుకూలమైన దారిని నిర్ణయించటానికి క్షుణ్ణమైన పరిశోధన జరుపబడింది. కాలువ 7వ. మైలు అల్వాల్ వరకు దిగువ మూడు మార్గాలు పరిశీలించబడినవి.

1. సరాసరి సుంకేశల లోయనుంచి అల్వాల్ వరకు సొరంగం.
2. సుంకేశల లోయనుంచి రంగొండ్లవరకు సొరంగం, అక్కడినుంచి ఆల్వాల్‌కి కొంటూరు కాలువ.
3. ఆనకట్టనుంచి వెలికాల్, ఎల్లాపురం, రంగొండ్ల మీదుగా ఆల్వాల్‌కి కొంటూరు కాలువ.

విస్తారమైన పరిశోధనలు జరిపి జాగ్రత్తగా ఆలోచించిన మీదట మొదటి ప్రతిపాదన అనగా సరాసరి త్రవ్వకమే మిక్కిలి సురక్షితమైనది, చవుక ఐనది అని కనుగొనబడింది. కాబట్టి యీ త్రవ్వకం చేపట్టబడింది.

చుట్టుపట్ల ప్రదేశం గ్రానైటుతో కూడివుంది. కాని కొండలు దృఢము, కఠినము అయిన శిలాస్ఫటికాలచే కప్ప



సొరంగం దృశ్యం

బడి వున్నాయి. సొరంగం గ్రానైటు రాయిని చీల్చుకుని వెడుతుంది.

మొదట 15,300 అ. పొడుగున 24.29 అ × 20 అ. (హార్స్ షూ సెక్షన్) కొలతలుగల జంట సొరంగాలు సంకల్పించబడ్డాయి. కాని అటుపిమ్మట పొదుపు దృష్ట్యా యీ ప్రతిపాదన ఒక్క సొరంగానికి మార్చబడింది. ఇది 32 అ. వ్యాసంతో గుర్రపు నాడా ఆకారంలో ఉంటుంది. సొరంగం పొడుగు 9,600 అ.కి తగ్గించబడింది. ఓపెన్ కట్ లోతు 60 అ. కి నుంచి 85 అ. హెచ్చించబడింది. సొరంగం ఇన్వెర్టులు అమర్చబడిన విధానాన్నిబట్టి 4,000 క్యూసెక్కులను మించిన ప్రవాహాలన్నీ సొరంగంలో నిండుగా ప్రవహిస్తాయి. ఆ తరువాత సొరంగానికి, ఓపెన్ కట్‌లకు వచ్చిన హెందరు రేట్లవల్ల, 100 అ. లోతువరకు ఓపెన్ కట్ లాభసాటిగా ఉండగలదని కనుగొనబడింది. కాబట్టి సొరంగం పొడుగు మళ్లీ 7,500 అ.కి తగ్గించబడింది. అనేక కారణాలవల్ల సొరంగం ఇన్వెర్టుల ఎత్తు హెచ్చించబడింది. నిర్గమన ద్వారం వద్ద ఇన్వెర్టు ఫ్లూమ్

బెడ్ మట్టంతో సమానంగా వుంచబడింది. ప్రవేశ మార్గం వద్ద అది ఎలా అమర్చబడినదంటే 11,000 క్యూసెక్కుల నీటితో సొరంగం సరిగ్గా నిండుగా ప్రవహిస్తుంది. అందువల్ల సొరంగం చివరిభాగంలో కంటే దాని మొదటిభాగంలో నీరు ఎక్కువ లోతుగా ప్రవహిస్తుంది. కాబట్టి సొరంగంలో నీరు పొంగిపొర్లి దానిపై పూత పాడైపోయే ప్రమాదం ఉండదు. నమూనా ప్రయోగాల నిమిత్తం యీ వివరాలు హైద్రాబాద్‌లోని ఇంజనీరింగ్ పరిశోధనా లేబొరేటరీలకు పంపబడ్డాయి. డిజైను అంశాలు ఫలించగలవని అక్కడ జరిగిన పరిశోధనలవల్ల తేలింది.

రెండు అంచెలు

సొరంగానికి రూ. 226.82 లక్షలు ఖర్చు కాగలవు. దానిని నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయాలని సంకల్పం. నిర్మాణం ముఖ్యాంశాలు యివి:

సొరంగానికిరువైపులా, సొరంగ ముఖాలకు మార్గమేర్పరచటానికై కాలువ భాగంలో 1:15 దిగుడు పాతంతో రెండు 'రాంప్'లు ఇదివరకే ఏర్పరచబడ్డాయి. సొరంగాన్ని ఇంచుమించు 35 అడుగుల వ్యాసంతో త్రవ్వాలి. కనుక యీ పనిని రెండు అంచెలలో చేపట్టాలని సంకల్పించబడింది. మొదట, సొరంగ మార్గంపై 20 అడుగుల పొడుగు పొడుగునా తుదివరకు త్రవ్వబడుతుంది. దీనికి హెడ్డింగు అని పేరు. ఆ తరువాత, మిగిలిన అడుగు భాగం పని చేయబడుతుంది. మట్టి ఎత్తడానికి, అవతలకు తీసుకు పోటానికి అందుకనువైన యంత్ర పరికరాలు ఉపయోగించబడతాయి.

రాళ్లు, ప్రమాణీకృతమైన డ్రిల్లింగు పద్ధతుల ననుసరించి, విద్యుచ్ఛక్తి సాధనాల సహాయంతో పగలగొట్టబడతాయి.

సొరంగానికి కనీసం 12 అంగుళాల మందాన సిమెంటు కాంక్రీటు పూత పూయబడుతుంది. పొరలు పలుచగా వున్న స్థలాల్లో రీయిన్‌ఫోర్స్డు సిమెంటు కాంక్రీటు పూత పూయ బడుతుంది. లేదా ఉక్కు ఎత్తులు పెట్ట బడతాయి.

భారత దేశంలో కొన్ని సొరంగాల విషయంలో సొరంగ మార్గం (పూర్తి అయిన ప్రదేశం)లో ప్రతి ఘనపుటడుగుకి అయిన యూనిట్ రేట్ల వివరాలు దిగువ యివ్వబడినవి.

వ. నెం.	వివరాలు	మొత్తం ఖర్చు రూ.	పొడవు అడుగులు	పూర్తైన ప్రదేశం చ. అ.	ఘనపుటడుగు సొరంగమార్గం యూనిట్ ఖర్చు రూ.
1.	వైతరణ సొరంగం, బొంబాయి	137 లక్షలు	20,440	82.94	8.00
2.	హెడ్‌రేస్ సొరంగం, కోయినా, బొంబాయి	257 లక్షలు	12,300	430.00	4.85
3.	తుంగభద్ర ఎడమ సొరంగం	52.5 లక్షలు	3,543	369.86	4.00
4.	తుంగభద్ర కుడి సొరంగం	14.8 లక్షలు	1,105	246.00	5.40
5.	నా. సాగర్ ఎడమ కాలువ సొరంగం	226.82 లక్షలు	7,500	849.20	3.56

ఎడమ కాలువ సొరంగం యూనిట్ రేటు 3.56. ఇది దేశంలో సొరంగం పనుల రేట్లలో మిక్కిలి తక్కువ రేటు.

వరంగల్లు

వరంగల్లు జిల్లా దక్కన్‌లో ఒక భాగం. దక్కన్ తొలి పరిపాలకులు ఆంధ్రులు. తరువాతి వారు వాతాపి-బీజపూరు జిల్లా నవీన బాదరూయ్-చాళుక్యులు. చాళుక్య రాజులలో రెండవ పులకేశి మిక్కిలి ప్రసిద్ధుడు. ఇతడు మహాబలుడై దక్షిణ భారత దేశాన్నంతనూ పరిపాలించాడు. ఇతడు విదేశాలలో గూడా బాగా ప్రసిద్ధికెక్కాడు. అజంతాలో ఒకటవ నెంబరు గుహలోని ఫ్రెస్కో చిత్రం యీ విషయాన్ని విదితం చేస్తుంది. అందులో పెర్షియన్ రాజ ప్రతినిధులు అతని ఆస్థానంలో హాజరయిన దృశ్యం చిత్రించబడింది.

చాళుక్యులు, రాష్ట్రకూటుల అధికారం పతనం చెందిన పిమ్మట వరంగల్లు రాజులు స్వతంత్రులయ్యారు. వారిలో ముఖ్యులయిన వారిలో ప్రోలే రాజా మొదటివాడు. తరువాతి రాజు గణపతి దేవుడు. ఇతడు తూర్పు, ఉత్తరాల విస్తార ప్రదేశాలను జయించాడు. అతడు యాదవ రాజకుమారి రుద్రమదేవిని వివాహమాడాడు. కళలను, శిల్పకళను విరివిగా పోషించాడు. వరంగల్లు కోట లోపల కీర్తి తోరణాల—నాలుగు గేట్లు — మధ్యగల దేవాలయాల శిధిలాలను చూస్తే అతని కళాపోషకత్వ మెట్టిదో విదితమవుతుంది. అతని తరువాత రుద్రమదేవి రాజ్యానికి వచ్చింది. రెండవ ప్రతాపరుద్రుడు యీ వంశంలో ఆఖరి రాజు. యితని పరిపాలనా కాలంలోనే వరంగల్లు రాజ్యాన్ని మహమ్మద్‌బీన్ తుగ్లక్ జయించాడు. ప్రతాపరుద్రుడు ఢిల్లీరాజు సామంతుడుగా వరంగల్లును అట్టే పెట్టుకున్నాడు.


కాకతీయ వంశానికి చెందిన వరంగల్లు, హనుమకొండ రాజులకు ''కాకతీయులు'' అనే పేరు ''దుర్గ'' స్థానిక నామం, ''కాకతి'' నుంచి వచ్చింది. ఈ కాకతీయులు గొప్ప నిర్మాతలు, వీరి పరిపాలనా కాలంలోనే నిర్మాణంలో చాళుక్య శైలి పూర్తిగా వికసించి పతాకస్థాయి నందుకొన్నది. ఈ కాలం కట్టడాలలో సత్త్వ సంపన్నత గోచరిస్తుంది. అనురూప సౌష్ఠవాల పట్ల చూపిన శ్రద్ధ కనబడుతుంది. క్లిష్టమైన రేఖాగణిత పద్ధతులు, నమూనాలు యెన్నో కనబడతాయి.

పేరు

జిల్లా ముఖ్య పట్నం వరంగల్లులో శిథిలాలు, పురాతన విశేషాలు చాలా వున్నాయి. వరంగల్లు పట్టణం వరంగల్లు రాజుల రాజధాని. 8వ శతాబ్దంలో తుళువ ఆంధ్ర యాదవ రాజుల రాజధాని ''పర్కాల్'' యిదీ ఒకటే. ఆ పైన వరంగల్లు లేక ''ఒరంకాల్'' టోలిమీ భూగోళశాస్త్రంలోని ''కొరుంకాల్'' అయి వుండగా దీనికిగల ''అక్షకేనగర్'' అన్న మరొకపేరు రఘునాథ భాస్కరుడు ''అరవాచంకోశ్'' లో పేర్కొన్న ''ఏకశిలా నగరం లేక యేకశిలా పట్నం'' అయి వుండాలి. వరంగల్లు కోట మధ్య ఒకే ఒక రాయి వుండడం వల్ల బహుశా దానికి ఓరుకల్ లేక ఒరంగల్లు అనే పేరు వచ్చి వుంటుంది.

ప్రస్తుత వరంగల్లు జిల్లాలో వరంగల్లు, మహబూబాబాద్ రెవిన్యూ డివిజన్లు రెండున్నూ, వరంగల్లు, పర్కాల్, జనగాం, మహబూబాబాద్, ములుగ్, నరసంపేట (పాఖాల్) తాలూకాలు ఆరువున్నాయి. మొదటి మూడు తాలూకాలు వరంగల్లు డివిజన్‌లోను, ఆఖరి మూడు తాలూకాలు మహబూబాబాద్ డివిజన్‌లోనూ వున్నాయి. ఈ జిల్లా విస్తీర్ణం 5,326.04 చ.మై. జనాభా 13.29 లక్షలు.

ఈ జిల్లాలో సాగు లాయకయిన మొత్తం భూమి 17,70,031 యెకరాలు. ఇందులో 2,75,372 యెకరాలు


WARANGAL
DISTRICT
KHAMMAM DIST
KARIMNAGAR DIST
NALGONDA DIST
GODAWARI
NUGUR
VENKATA PURAM
RIVER
SALBAKA
NAGARAM
MANGAPET
MULUG
RAMAPPA
PAKHAL
ATMAKUR
HASAN PARTI
WARANGAL
HANAMKONDA
KAZIPET RS JUNCTION
PAKHAL LAKE
PAKHAL
MUDDUR
CHIRIAL
BUCHANNAPET
JANGAON
NAVABPET
ZAFERGARH
AKRE RIVER
KESAMUDRAM
MAHABUBABAD
PALAM
KURVI
DORNAKAL
REFERENCE
STATE BOUNDARY
DISTRICT BOUNDARY
ROADS
BROAD GAUGE
RIVERS
LAKES

మాగాణి భూమి, 14,94,659 యెకరాలు మెట్ట భూమి.

ఈ జిల్లా ముఖ్య పంటలు, వాటి అణా వారీ పంట వివరాలు యివి:—

పంటలు	అణా వారీ
1 వరి	— 8
2. జొన్న	— 6
3 బజ్ర	— 4
4. మొక్కజొన్న	— 5
5. పెసలు	— 4
6. కందులు	— 5
7 నువ్వులు	— 6
8. ఆముదాలు	— 5
9 వేరుసెనగ	— 6
10. ఇతర పప్పులు	— 4

ఈ జిల్లాలో మొత్తం 4,709 చెరువులు, కుంటలు వున్నాయి 2,39,213 యెకరాలకు నీటిపారుదల లభిస్తుంది బియ్యం మామూలుగా యెకరానికి 1000 పౌనులు పండుతాయి.

వరంగల్లు, వరంగల్లు తాలూకా ఘాన్పూరులోను, జనగాం తాలూకా జనగాంలోను, మహబూబాబాద్ తాలూకా మహబూబాబాద్‌లోను నాలుగు మార్కెటింగ్ కమిటీలున్నాయి ఇవి యీ జిల్లాలోని వ్యవసాయ సరుకుల క్రయ విక్రయాలను నియమబద్ధం చేస్తాయి

ఈ మార్కెటింగ్ కమిటీలకు తోడు 1958 లో కేంద్ర గిడంగుల సంస్థచే వరంగల్లులో ఒక కేంద్ర గిడ్డంగి నెలకొల్పబడింది. ఇది రైతుల స్థితిగతులను చక్కచేయుటలో తోడ్పడుతుంది, ఇటి గిడంగి ఆంధ్ర ప్రదేశ్‌లో మరెక్కడా లేదు

రాకపోకల సౌకర్యాలు

ఈ జిల్లా మధ్యరైల్వే ప్రధాన మార్గంలో వుంది. వలలా అల్లుకొన్న ఇక్కడి రైల్వే మార్గాలన్నీ మధ్యరైల్వే ఆధ్వర్యంలో వున్నాయి. పెంబర్తి స్టేషన్ నుంచి డోర్నకల్ స్టేషన్ వరకూ గల మధ్యరైల్వే హైదరాబాద్—విజయవాడ మార్గం యీ జిల్లాలో నుంచీ పోతుంది. అలాగే పెంబర్తి, యెల్లాపురం స్టేషన్‌ల మధ్య హైదరాబాద్—ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ మార్గం కూడా వరంగల్లు జిల్లాలో వుంది. జనగాం, వరంగల్లు, నరసంపేట, మహబూబాబాద్ తాలూకాలు యీ రైలు మార్గాలచే కలుపబడినవి. పార్కాల్, ములుగ్ తాలూకాలకు మాత్రం రైలు మార్గాలు లేవు

రోడ్లు

రెండు తాలూకాలకు మాత్రం రైలుమార్గాలు లేకపోయినా అవి జిల్లా ముఖ్య పట్టణంతో రోడ్ల ద్వారా కలుపబడినవి. చక్కని వలలా అల్లుకొన్న రోడ్లు తాలూకా ముఖ్య పట్టణాలను జిల్లా ముఖ్య పట్టణంతో కలుపుతాయి ఆ మార్గాలలో రాష్ట్రి రవాణా బస్సులు నడుస్తాయి జిల్లా ముఖ్య పట్టణం, ములుగ్, నరసంపేట, పార్కాల తాలూకాల ముఖ్య పట్నాలమధ్య రోజూ అయిదు బస్సులు నడుస్తాయి. ఆ పైన హైదరాబాద్ నుంచి వరంగల్లు, వరంగల్లు నుంచి ఖమ్మంమెట్టు, కరీంనగరాలకు నరాసరి బస్సు మార్గాలున్నాయి.

జిల్లాలో చరిత్రాత్మకమయిన ప్రదేశాలకు కూడా రోడ్లు వున్నాయి.

విద్యా సౌకర్యాలు

జిల్లా ముఖ్య పట్టణంలో ఒక మొదటి తరగతి కళాశాల వుంది. అక్కడ ఆర్ట్సు, సైన్సు డిగ్రీ కోర్సులకి వసతి వుంది ఈ కళాశాలకు ఆడిటోరియం ఒకటి శీఘ్ర గతిని నిర్మించ బడుతున్నది.

రెండు సంవత్సరాల నుంచి జిల్లా ముఖ్య పట్టణంలో బి. ఇడి. శిక్షణాకళాశాల కూడా పని చేస్తున్నది. దానికి శాశ్వత భవనం నిర్మించబడుతున్నది.

ఇవి కాక, యీ సంవత్సరం వరంగల్లులో 100 స్థానాలు గల వైద్య కళాశాల తెరువబడింది.

సాంకేతిక విద్యకు కూడా సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా ముఖ్య పట్టణంలో గల పాలీటెక్నిక్ ఒకటి డిప్లమో కోర్సులను చెబుతున్నది. వరంగల్లులో ఒక ఇంజనీరింగ్ కళాశాల కూడా ప్రారంభించబడింది.

విద్యాశాఖ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఇటీవలనే జిల్లా ముఖ్య పట్టణంలో నెలకొల్పబడింది. డిప్యూటీ డైరెక్టర్ వున్నత పాఠశాలలపై అధ్వర్యం వహిస్తారు.

జిల్లా ముఖ్య పట్టణంలో జిల్లా విద్యాధికారి కార్యాలయం కూడా వుంది అయన ప్రాథమిక, మాధ్యమిక, మాధ్యమిక-ఉన్నత పాఠశాలలపై అధ్వర్యం వహిస్తారు.

ఈ జిల్లాలో 4,763 మంది విద్యార్థులతో 12 వున్నత పాఠశాలలు, 8,053 మంది విద్యార్థులతో 31 సెకండరీ పాఠశాలలు, 54,426 మంది విద్యార్థులతో 886 ప్రాథమిక పాఠశాలలు, 1,965 మంది విద్యార్థులతో 53 ఎయిడెడ్ పాఠశాలలు వున్నాయి.

వైద్య సహాయం

సివిల్ డిస్పెన్సరీల వంటి 8 క్లినిక్‌లు వున్నాయి. వీటిలో ఆరు తాలూకా ముఖ్య పట్టణాలు ఆరింటిలోను, తక్కిన రెండూ వరంగల్లు తాలూకా వర్ధన్నపేటలో ఒకటీ, జనగాం తాలూకా చెరియాలలో మరొకటీ వున్నాయి.

మధ్వాడ, వరంగల్లులో ఒక వైద్య, ప్రసూతి వార్డు వుంది. మహబూబాబాద్ ములుగ్ తాలూకాల ముఖ్య పట్టణాలలో చెరి ఒకటి వున్నాయి ఇవి కాక జిల్లా ముఖ్య పట్టణంలో ఒక ప్రభుత్వ ఆస్పత్రి అనగా మహాత్మా గాంధీ మెమోరియల్ ఆస్పత్రి వుంది

ప్రసూతి, శిశు ఆరోగ్య యూనిట్టు కూడా ఒకటి వుంది అవి నాటుదాయాలకు ప్రసూతి, శిశు ఆరోగ్యాలలో శిక్షణ నిస్తుంది.

పూర్వ హైదరాబాద్ రాష్ట్రంలో వైద్య, ప్రజారోగ్య శాఖలు జిల్లా స్థాయిలో ఒకే అధికారి క్రింద వుండేవి. సివిల్ సర్జన్‌కే జిల్లా ఆరోగ్యాధికారి అనే పేరు కూడా వుండేది పునర్వ్యవస్థీకరణ పిమ్మట రెండు శాఖలూ కూడా రెండుగా విభజించబడ్డాయి సహాయ ఆరోగ్యాధికారి పేరు జిల్లా ఆరోగ్యాధికారిగా మార్చబడింది ఈ జిల్లాలో ఆరోగ్య విభాగం 12-8-57 నుంచి స్వతంత్రంగా పని ఆరంభించింది

ఒక్కొక్క తాలూకా ముఖ్య పట్టణానికి ఒక్కొక్కరు చొప్పున ఆరుగురు, జనగాం తాలూకా చెరియాలలో ఒకరు మొత్తం ఏడుగురు హెల్త్ ఇనస్పెక్టర్‌లున్నారు. ప్రతి తాలూకా ముఖ్య పట్టణంలోను ఒక్కొక్క వాక్సినేటరు వున్నాడు ఈ జిల్లాలో వేర్వేరు గ్రామాలలో 15 మంది గ్రామీణ దాయాలు వున్నారు ఇవి కాక ప్రతి తాలూకాలోను మధ్య గల పెద్ద గ్రామాలకి గ్రామీణ మందుల పెట్టెలు సరఫరా చేయబడతాయి

వీటికి తోడు యీ జిల్లాలో మలేరియా నివారణ కేంద్రం కూడా ఒకటి వుంది దానికి హనుమకొండ, చెల్పూర్‌లలో రెండు వుపకేంద్రాలు వున్నాయి.

పరిశ్రమలు

ఈ జిల్లాలొ చెప్పుకోతగిన పెద్ద పరిశ్రమ వస్త్రపరిశ్రమ. అజంజాహిమిల్లులు వ్యవస్థీకృతమయిన ప్రాతిపదిక ఫ్యాక్టరీపరెె బట్టలను తయారుచేస్తాయి.

చిన్నరకం పరిశ్రమలలో ఫార్మింగు పరిశ్రమ, బీడీల తయారీ చెప్పుకోతగినవి. మహబూబాబాద్‌లో ఒక అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ వుంది. ఇవన్నీ ప్రైవేటు విభాగంచే నడుప బడుతున్నాయి

వ్యవస్థీకృతమయిన పై పరిశ్రమలకుతోడు యీ జిల్లాలో దిగువ దేశీయ కుటీర పరిశ్రమలు వున్నాయి.

1. తివాసీల నేత, 2 టస్సర్ నేత, 3. ఇత్తడిసామాను, తివాసీలు యెక్కువగా వరంగల్లులో నేయబడగా, టస్సర్ పరిశ్రమ వరంగల్లు తాలూకా హసన్‌పర్తి గ్రామంలో సాగుతున్నది. జనగాం తాలూకా పెంబర్తి యిత్తడి సామానుకి ప్రసిద్ధి

సహకారోద్యమం

ఈ జిల్లా జనాభాలో 31.5 శాతం స్వంతదారు రైతులు, 10.8 శాతం కౌలుదారు రైతులు, 15.9 శాతం వ్యవసాయ కూలీలు 0.9శాతం వ్యవసాయ యిజారా (పట్టా) దారులు, 22 శాతం రైతులు కాని వారు, 4 శాతం వ్యాపారులు, 1.3 శాతం రవాణాలోను, 10.3 శాతం చిల్లర వృత్తులలోను వున్న వారు దీనిని బట్టి యీ జిల్లాలో అధిక సంఖ్యాకులు తమ జీవనోపాదికి వ్యవసాయం, తత్సంబంధమయిన వృత్తులపై ఆధారపడతారని విశదమవుతుంది. ఈ జిల్లా రైతులలో అధిక సంఖ్యాకులు మధ్యరకం రైతులు, సన్నకారు రైతులు అయివున్నారు.

ఈ విధంగా యీ జిల్లాలో సహకార వుద్యమం ప్రధానంగా వ్యావసాయిక మయినప్పటికీ అది పట్టణవాసులకు, ప్రభుత్వోద్యోగులకు, దేశీయ వనరులద్వారా జీవనోపాధిని సంపాదించే చేతిపనివారు. కార్మికులకుకూడా వుపకరిస్తుంది

ఈ జిల్లాలో 767 సహకార సంస్థలు వున్నాయి. వాటి మొత్తం సభ్యుల సంఖ్య 82,525.

సంస్థల వివరాలు

1.	సహకార కేంద్ర బ్యాంకి .. .	1
2.	వ్యవసాయ పరపతి సంఘాలు	294
3.	ధాన్యం బ్యాంకులు	360
4	గ్రామీణ బ్యాంకులు	7
5	టి ఎ సి ఎ. లు	6
6.	బహుళార్థ సాధక సహకార సంఘాలు .	6
7.	గ్రామాభ్యుదయ సంఘాలు	14
8.	జాలరుల సంఘాలు	3
9.	ఫల పెంపకం సంఘం	1
10.	ప్రాథమిక భూమి తనఖా సంఘాలు ..	2
11.	అర్బన్ బ్యాంకిలు	5
12.	డిపార్టుమెంటల్ సొసైటీలు .. .	16
13.	జూబ్లి సొసైటీ	1
14.	నేత పనివారి సంఘాలు .. .	28
15	పారిశ్రామిక సంఘాలు .. .	18
16	కమ్మరుల సంఘాలు	2
17.	గృహవసతి సంఘాలు	3

సమాజాభివృద్ధి

ఈ జిల్లా మునిసిపల్ ప్రాంతం మినహా 18 కేంద్రాలుగా విభజించబడింది. ప్రస్తుతం వివిధ దశలలో 8 కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. వీటిలో 4 మొదటి అంచె కేంద్రాలు, ఒకటి రెండవ అంచె కేంద్రం. గిరిజన ప్రాంతాలకు ఒక బహుళార్థ సాధక ప్రాజెక్టు, రెండు పూర్వ విస్తరణ కేంద్రాలు-వీటిలో ఒకటి ఇటీవలనే ఆరంభించబడింది. తరగతి వారీగా ఆ కేంద్రాల వివరాలు:

1 రెండవ అంచె కేంద్రం

1 ములుగ్, యిది అనంతర తీవ్ర అభివృద్ధి దశలో వుంది.

2 మొదటి అంచె కేంద్రాలు

1 మహబూబాబాద్, తరువాత ఇది సమితి బ్లాకు చేయబడింది.

2. పాల్కాల్, 3 సంగం, 4. కొడకొండ్ల

3 బహుళార్థ సాధక ప్రాజెక్టు

1 గిరిజన ప్రాంతాలతో కూడిన నరసంపేట, ములుగ్ తాలూకా.

4 పూర్వ విస్తరణ కేంద్రాలు

1 వర్ధన్నపేట

2. జనగాం. (2-10-58 నుంచి మంజూరు చేయబడి ఇటీవలే పని ప్రారంభించాయి.)

వీటిలో మొదటి యేడు కేంద్రాల క్రింద 1,557.55 చదరపు మైళ్ళ విస్తీర్ణం గల ప్రదేశము 585 గ్రామాలు, 4 91,710 జనాభా అనగా జిల్లా విస్తీర్ణంలో 29.2 శాతం విస్తీర్ణం గ్రామాలలో 53.3 శాతం గ్రామాలు, జనాభాలో 36.9 శాతం జనాభా వున్నాయి

తరువాత మహబూబాబాద్ కేంద్రం పంచాయతీ సమితిగా యేర్పరచబడింది. 1-7-58 నుంచి అడ్‌హాక్ పంచాయతీ సమితి యేర్పాటు చేయబడింది. ఈ సమితి కేంద్రంలో మహబూబాబాద్ తాలూకాలో 163 చ మై. విస్తీర్ణం, 1,10,302 జనాభాగల 57 గ్రామాలు వున్నాయి. సమితి ప్రాంతంలో రెండు పట్టణ కమిటీలు, 5 గ్రామపంచాయతీలు వున్నాయి. పట్టణ కమిటీ గ్రామ పంచాయతీ అధ్యక్షులు పంచాయతీ సమితి సభ్యులుగా నామినేట్ చేయబడ్డారు. మిగిలిన-50 గ్రామాలలోను పంచాయతీలు లేనందున, ఈ గ్రామాల ప్రతినిధులు జిల్లా కలక్టరుచే పంచాయతీ సమితికి నామినేట్ చేయబడ్డారు. నిబంధనావళి క్రింద అవసరమయిన ప్రకారం ప్రత్యేక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించుటకై అయిదుగురిని ఎక్స్ అఫీషియో నామినేటెడ్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ విధంగా సమితి మొత్తం సభ్యుల సంఖ్య 62.

తొలి పంచవర్ష ప్రణాళిక

వ్యవసాయ రంగంలో తొలి ప్రణాళికా కాలంలో సాధించిన ఫలితాలు మొత్తం మీద సంతృప్తికరంగా వున్నాయి అధికోత్పత్తి విషయంలో యేర్పరచిన లక్ష్యాలను అధిగమించడం జరిగింది. దిగువ హెచ్చుదలలు సాధించబడ్డాయి.

1. పంట ప్రాంతంలో హెచ్చుదల .. 2,71,052 ఎకరాలు

2 ఆహార ధాన్యాలలో హెచ్చుదల .. 38,045 టన్నులు

3. వరి ఉత్పత్తిలో హెచ్చుదల 9,688 టన్నులు. వ్యవసాయ శాఖ కృషి చక్కగా ఫలించింది. రైతులు 87 964

టన్నుల రసాయన ఎరువులను, 2,470 టన్నుల ఉత్తమ విత్తనాలను వాడారు.

తొలి పంచవర్ష ప్రణాళికలో నీటి పారుదల క్రింద భారీ లేక మధ్యరకం ప్రాజెక్టులు చేర్చబడకపోయినప్పటికీ. రూ. 18.47 లక్షలతో 21,209 ఎకరాల ఆయకట్టు గల 311 గండిపడిన వనరులను మరమ్మతు చేయాలని లక్ష్య మేర్పరచబడినది. మరమ్మతుల కార్యక్రమం తొలి ప్రణాళిక మూడవ సంవత్సరంలో ఆరంభమైనందున రూ. 8 57 లక్షలతో 12,199 ఎకరాల ఆయకట్టుగల 199 వనరులు మాత్రమే మరమ్మతుచేయబడినవి మిగిలిన పనులు ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలానికి తీసుకోబడ్డాయి.

మునిసిపాలిటీలు, స్థానిక ప్రభుత్వం నిర్వహించే రోడ్లు కాక ప్రత్యేకం పబ్లిక్ వర్క్సు శాఖ రోడ్లు మొత్తం 427 మైళ్ళ నిడివిగలవి ఉన్నాయి. ఈ జిల్లాలో ప్రతి 12.62 చ. మైళ్ళకి ఒక మైలు రోడ్డు ఉంది.

తొలి ప్రణాళికా కాలంలో రూ. 1,97,140 అంచనాపై హనుమకొండ-ఖమ్మం రోడ్డులో ఒకటిన్నర మైలు దూరానికి సిమెంటు కాంక్రీటు చేయబడింది

21 మైళ్ళ నిడివిగల మహబూబాబాద్-ఎల్లందు రోడ్డు ఫెయిర్ వెదర్ రోడ్డుగా నిర్మించబడింది. ఇది ఖమ్మం జిల్లాలోని ఎల్లందును వరంగల్లు జిల్లాలోని మహబూబాబాద్‌తో కలిపే మిక్కిలి ముఖ్యమైన మార్గం.

వరంగల్లులోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రి రూ 5,72,977 అంచనా ఖర్చుతో 1951 లో ఆరంభింపబడి 1955 లో పూర్తి చేయబడింది. ఈ విధంగా ప్రజల చిరకాల అవసరం తీరింది.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక

ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో మొత్తం రూ. 24,64,400 ఖర్చుతో 1,26,600 టన్నుల ఆహార ధాన్యాలను అదనంగా ఉత్పత్తి చేయాలని లక్ష్య మేర్పరచబడింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులను జిల్లా అంతా అమలు జరపడానికి కృషి చేయబడుతున్నా ముఖ్యంగా అభివృద్ధి కేంద్రం ప్రాంతాలలోనే పని జరుపబడుతున్నది.

ప్రతివిస్తరణ కేంద్రంలోను విత్తనాల ఉత్పత్తి,పంపిణీ పధకం క్రింద 15 ఎకరాల మాగాణీ, 10 ఎకరాల మెట్టభూములు గల ఖండాలలో, వ్యవసాయ శాఖ నిధులతో విత్తనాల క్షేత్రాలుకూడా ఏర్పాటు చేయబడుతున్నాయి. వ్యవసాయశాఖ పండించిన ఉత్తమ విత్తనాలు, న్యూక్లియస్ విత్తనాలు రైతులకు అందుబాటు చేయుటకై ప్రతి అభివృద్ధి కేంద్రం ప్రాంతంలోను విత్తనాల స్టోర్‌లు కూడా నిర్మించబడుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వ సిఫార్సులపై అధికాహారోత్పత్తి వుద్యమంలో భాగంగా రాబీ ఆహారోత్పత్తి ఎక్కువగా చేయబడుతున్నది. ఇందు నిమిత్తం జిల్లా అంతటా అభివృద్ధి కేంద్రం ప్రాంతాలలో 500 గ్రామాలు ఎన్నబడ్డాయి

ఈ కాలంలో నీటి పారుదల పనుల క్రింద పాఖాల తాలూకాలలో మధ్యరకం ప్రాజెక్టు, సాలివాగు ప్రాజెక్టు నిర్మాణం చేర్చబడింది. ఈ ప్రాజెక్టుకి రూ. 16.24 లక్షలు ఖర్చు కాగలవనీ, దాని క్రింద 2,000 ఎకరాలు సాగు కాగలవనీ అంచనా.

ద్వితీయ ప్రణాళికా కాలంలో, తొలిప్రణాళికా కాలంలో మిగిలిపోయిన పనులు కాక కొత్తగా గండిపడిన 120 చెర్వులను మరమ్మతు చేయాలని లక్ష్యం నిర్ణయించబడింది. వీటి ఆయకట్టు 9000 ఎకరాలు, అంచనా ఖర్చు రూ. 12,74 లక్షలు.

ఈ కాలంలో దిగువ రోడ్డు పనులు చేపట్టబడినవి

పధకం పేరు.	నిడివి	ఖర్చు
మహబూబాబాద్—ఎల్లందు రోడ్డు (1వ. సెక్షన్)	10 మైళ్ళు	రూ. 3.44 లక్షలు
వలిగొండ-తొర్రూరు రోడ్డు (కొంతభాగం)	9 ,,	,, 0.23 ,,
బూర్గంపాడు-నగరంరోడ్డు కొండయగూడెం మీదుగా (కొంత భాగం)	4 ,,	,, 0.10 ,,

హనుమకొండలో బహుళార్థసాధక వున్నత పాఠశాల అవసరాలు హెచ్చినందున వాటికి తగినట్లు రూ. 1,21,963 ఖర్చుపై అదనపు వసతి సమకూర్చబడింది.

వరంగల్లు కళాశాలకు ఆడిటోరియం లేనందున దానికి అందునిమిత్తం రూ. 2,01,600 మంజూరు చేయబడ్డాయి. ఆడిటోరియం నిర్మాణం పూర్తి కావస్తున్నది. ఖర్చులో కొంత భాగం ప్రజల విరాళాలద్వారా సేకరించబడింది.

పోలీసు సిబ్బందికి-అనగా ఇద్దరు సబ్-ఇనస్పెక్టర్లు, ఒక సర్కిల్ ఇనస్పెక్టరు, 8 మంది హెడ్‌కానిస్టేబుల్సు, 30 మంది పోలీసు కానిస్టేబుల్సుకు గృహవసతి సమకూర్చే పని మొదటి ఘట్టం రూ. 3,00,000 ఖర్చులో పూర్తి చేయబడింది. రెండవ ఘట్టంలో 4 హెడ్‌కానిస్టేబుల్సు గృహాలు, 34 పోలీసు కానిస్టేబుల్సు గృహాలు రూ. 2,10,000 అంచనా ఖర్చుతో నిర్మించాలని తలపెట్టబడింది.

ఇవి కాక దిగువ నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

1. మహబూబాబాద్‌లో బహుళార్థ సాధక ఉన్నత పాఠశాల, అదనపు తరగతి గదులు-అంచనాఖర్చు రూ. 8600.

2. హనమకొండలో క్షయ కేటాయింపు వార్డు- ఖర్చు రూ. 75,000.

3. బాల్పాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎం. ఓస్, గృహాలు-ఖర్చు రూ. 30,000.

4. హనుమకొండ, ములుగ్, మహబూబాబాద్, మద్దూరులలో బాలికలకు అదనపు తరగతి గదులు-అంచనా ఖర్చు రూ. 40,000.

5. ములుగ్, మహబూబాబాద్‌లలో విత్తనాల స్టోర్ల నిర్మాణం-అంచనా ఖర్చు రూ. 18,700.

6. 1. చేవెల్‌లో మోడల్ సిల్కు రీలింగుహౌస్, 2. మహబూబాబాద్‌లో నమూనా వడ్రంగం షెడ్డు, 3. వెంకటాపురంలో టస్సర్ విత్తనాల కేంద్రం - ఒక్కొక్కదాని అంచనా ఖర్చు రూ. 20,000.

విద్యారంగంలో దిగువ పథకాలు అమలు జరుగుతున్నాయి.

1. క్రొత్త ఏకోపాధ్యాయ పాఠశాలల ప్రారంభం.

2. స్వచ్ఛంద ఎయిడెడ్ పాఠశాలల్ని ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు.

3. ప్రాథమిక పాఠశాలలను జూనియర్ బేసిక్ పాఠశాలలుగా మార్పు.

4. మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో వృత్తి విద్యల ప్రవేశం.

5. గ్రంథాలయాల విస్తరణ.

వైద్య శాఖ దిగువ పథకాలను తలపెట్టింది.

1. తాలూకా ఆస్పత్రుల అభివృద్ధి.
2. క్షయ డొమిసిలరీ ఉద్యమం విస్తరణ.
3. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాపన.
4. వరంగల్లులో ప్రాంతీయ లేబొరేటరీ స్థాపన.

పరిశ్రమలు, వాణిజ్య శాఖ దిగువ చిన్నతరహా పరిశ్రమలను చేపట్టింది.

1. వరంగల్లులో నమూనా వడ్రంగం కేంద్రం.
2. మహబూబాబాద్‌లో ,, ,,
3. వరంగల్లులో నమూనా కమ్మరి ,,
4. కడప సీజనింగుప్లాంటు-రంపం మిల్లు.
5. వరంగల్లులో నమూనా తోలు పరిశ్రమ.
6. స్ప్లింట్సు అండ్ వెనీర్సు ఫ్యాక్టరీ.
7. సహకార పని కేంద్రాలు 10.
8. వరంగల్లులో పారిశ్రామిక కేంద్రం.
9. అమ్మకం ఎంపోరియం.
10. ప్రభుత్వ సహాయక పారిశ్రామిక ఋణాలు.

మొదటి మూడు కేంద్రాలలో ఒక్కొక్కదానిలో 8 మందికి నెలకి రూ. 20-30 స్టయిపెండు ఇచ్చి శిక్షణ గరపబడుతున్నది. ఆ పైన యీ జిల్లా వివిధ గ్రామాలలో స్థానిక గ్రామస్థుల సహకారంతో స్థానికాభివృద్ధి పథకాల క్రింద పెక్కు పాఠశాలాభవనాలు, మంచినీటి బావులు నిర్మించబడ్డాయి. గ్రామీణ విద్యుదీకరణ పథకం గ్రామ సమాజానికి దీపాలనే కాక ముందడుగు వేసే రైతులకు శక్తిని (విద్యుత్)కూడా ఇస్తున్నది.

దర్శనీయమైన స్థలాలు

వరంగల్లులో వరంగల్లు కోట, హనుమకొండలో వెయ్యిస్తంభాల దేవాలయం, ములుగ్ తాలూకాలో రామప్ప దేవాలయం చూడదగినది. దివ్యమైన యీ కట్టడాల శిల్ప చాతుర్యం ఎందరో విదేశీయుల నాకర్షిస్తుంది.

అద్భుతమైన యీ శిల్ప కళా ఖండాలకు తోడు ఇక్కడ ప్రకృతి సిద్ధమైన దిగువ సరస్సులు ఉన్నాయి. అవి పురాతనమైనవి. చరిత్రాత్మకమైనవి.

1. నరసంపేట తాలూకాలో పాఖాలసరస్సు.
2. ములుగ్ తాలూకాలో రామప్ప,
3. లక్నవరం,
4. గన్పూర్ సరస్సులు.

5 పార్కాల్ తాలూకాలో భీమ్‌ఘన్పూర్ సరస్సు. ఇవన్నీ కూడా కాకతీయుల కాలం నాటివే. వాటినిర్మాణం కాకతీయుల ఇంజనీరింగ్ కౌశలాన్నీ, ఆ రోజులలోనే వైజ్ఞానికశాస్త్రం పొందిన అభివృద్ధినీ వేనోళ్ళ చాటుతుంది. విశేషమేమంటే, యీ సరస్సులన్నీకూడా రిజర్వు అడవుల ప్రాంతంలో నిర్మించబడ్డాయి. పాఖాల్, రామప్ప, లక్నవరం, ఘన్పూరు సరస్సులు మరమ్మతు చేయబడి పబ్లిక్ వర్క్స్ శాఖచే నిర్వహింప బడుతున్నవి. కాని భీమ్ ఘన్పూర్ సరస్సు విషయంలో-అది బాగా రిజర్వు అడవి లోపల వుండి అక్కడికి వెళ్ళడం కష్టం కావడం వల్ల కాబోలు ఏమీ చర్య తీసుకొన బడలేదు.

ఈ జిల్లాలలో 13 మంది శాసన సభ్యులున్నారు. వారు 11 నియోజక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వివరాలు ఇవి:—

శాసన సభ్యుని పేరు.	నియోజక వర్గంపేరు.
1 శ్రీ మిర్జా షుకూర్ బెయిగ్	వరంగల్లు
2 శ్రీ తిరుపడంగారు హయగ్రీవాచారి	ధర్మసాగర్
3. శ్రీ బేతి కేశవరెడ్డి	ఘన్పూర్
4. శ్రీ ఎర్రబల్లి వెంకట్రామ నర్సయ్య	వర్ధన్నపేట
5. ,, గోపాలరెడ్డి	జనగాం (సాధారణ)
6. ,, గోకా రామలింగం	,, (రిజర్వుడు)
7. ,, నకుమారి వెంకటకృష్ణ ప్రసాదరావు	చెన్నూరు
8. ,, ఎన్. రామచంద్రారెడ్డి	డోర్నకల్లు
9. ,, ముదిగొండ సిద్ధవీర రాజలింగం	చిల్లంచెర్ల
10. శ్రీమతి కాతుమాను కనకరత్నమ్మ	నర్సంపేట
11. శ్రీ కటంగూరి కేశవరెడ్డి	పార్కాల్ (సాధారణ)
12. శ్రీ మందా, పాయిలు,	పార్కాల్ (రిజర్వుడు)
13. శ్రీ సూరినేని రాజేశ్వరరావు	ములుగ్

ఈ జిల్లాలో యిద్దరు పార్లమెంటు సభ్యులు ఉన్నారు. శ్రీ సాదిక్ ఆలీఖాన్, శ్రీ ఎటికల మధుసూధరావు. వీరు వరుసగా వరంగల్లు, మహబూబాబాద్ నియోజక వర్గాలకు— పార్లమెంటు — ప్రాతినిధ్యం వహిస్తారు. శ్రీ సాదిక్ ఆలీఖాన్ హైదరాబాద్‌కి చెందినవారు కాగా శ్రీ మధుసూధనరావు యీ జిల్లా వారు.

శ్రీయుతులు కొండపర్తి మనోహరరావు, కాళోజీ నారాయణరావు, రఘోత్తంరెడ్డి, ఎయిపూర్ లక్ష్మారెడ్డిగారలు యీ జిల్లాకి చెందిన శాసన మండలి సభ్యులు. మొదటి ఇద్దరూ ఉపాధ్యాయుల నియోజక వర్గాల నుంచీ, చివరి ఇద్దరూ స్థానిక సంస్థల నియోజక వర్గాల నుంచీ ఎన్నికైనారు.

గ్రామాలు నశిస్తే భారతదేశమూ నశిస్తుంది. గ్రామాలను స్వప్రయోజనాలకై వినియోగించుకొనటం మాని వాటి పునరుజ్జీవనం సాధ్యం. కాబట్టి మన కృషిని గ్రామాల స్వయం సమృద్ధిపై కేంద్రీకరించాలి.

— మహాత్మా గాంధీ.

పారిశ్రామిక కేంద్రాల ప్రగతి

చిన్నపరిశ్రమల సహాయానికి ముఖ్య చర్యగా దేశం మొత్తంలో రూ. 18 కోట్ల అంచనా ఖర్చుపై నెలకొల్ప దలుచుకొన్న 100 పారిశ్రామిక కేంద్రాలలోను 6 ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పాటు కావటానికి నిర్ణయించబడింది. వీటిలో కొన్ని అప్పుడే ఏర్పాటయినవి. వాటిలో పెక్కు యూనిట్లు పని చేస్తున్నవి మిగిలిన కేంద్రాల విషయంలో నిర్మాణం పని కొనసాగుతున్నది.

సనత్‌నగరం

సనత్‌నగరం పారిశ్రామిక కేంద్రం హైద్రాబాద్‌కిఇందు మించు 7 మైళ్ళ దూరంలో ఉంది. దీని అంచనా ఖర్చు రూ 30 13 లక్షలు. ఇది ఇదివరకే సుస్థాపితమైన ఆల్విన్సు, ఆస్బెస్టాస్‌సిమెంటు వగైరా కర్మాగారాల నడుమ 50 ఎకరాల స్థలంలో ఏర్పాటయింది. ఈ కేంద్రంలో 3 తరగతుల ఫ్యాక్టరీ భవనాలు 30 ఉన్నాయి ఏ తరగతి యూనిట్లు రెండు ఉన్నాయి. ఈ రకంలో పని షెడ్డు ప్రమాణం 80 అ × 80 అ. ఈ షెడ్డు విస్తీర్ణం 6,889 చ. అ కార్యాలయ వైశాల్యం 2,288 చ అ; బి తరగతి యూనిట్లు 16 ఉన్నాయి. ఇక్కడ పని షెడ్డు ప్రమాణం 80 అ. × 40 అ. దీని వైశాల్యం 3,537 చ. అ కార్యాలయ వైశాల్యం 1,219 చ. అ ; సి. తరగతి యూనిట్లు 12 ఉన్నాయి. పనిషెడ్డు ప్రమాణం 40 అ × 53 అ. దాని విస్తీర్ణం 2,376 చ అ. కార్యాలయ విస్తీర్ణం 788 చ. అ.

మొదటి అంచెలో 17 ఫ్యాక్టరీ భవనాల నిర్మాణం 1958 అక్టోబరు నాటికి పూర్తయింది. అవి మొదటి రెండు సంవత్సరాలకు చ. అ 8 న పై సబ్సిడైజుడు అద్దెపై 15 వేర్వేరు పారిశ్రామిక యూనిట్లకు ఇవ్వబడినవి ఈ సబ్సిడైజుడు అద్దె ఎ తరగతికి రూ. 735, బి. తరగతికి రూ. 361, సి. తరగతికి రూ. 254 అవుతుంది.

ఈ కేంద్రంలో హైదరాబాద్ స్టేట్‌బ్యాంక్ శాఖ ఒకటి ఉంది. దీని సమీపంలో గల తపాలా కార్యాలయం పరిపాలనా నిర్వహణ భవనంలోనికి తరలించ బడింది.

రెండవ అంచెలో 13 భవనాల నిర్మాణంకూడా పూర్తయింది. అవి 11 పరిశ్రమలకు ఇవ్వబడినవి.

పరిశ్రమల శాఖ యీ కేంద్రంలో విడివిడి భవనాలలో రేడియో విడి భాగాలు, స్మాల్‌గేజ్ ఇన్సులేటెడ్ రాగి తీగలు, ఫ్రాక్షనల్ హార్సు పవర్ మోటార్ల పరిశ్రమలను నెలకొల్పుతున్నది.

ఈ కేంద్రంలో అద్దెకున్న వారు సనత్‌నగర్ పారిశ్రామిక కేంద్రం సహకార సంఘం పేరట సహకారసంఘంగా ఏర్పడ్డారు. ఈసంఘం ఆథరైజుడు పెట్టుబడి రూ.3లక్షలు. ఈ సంఘం ముడిసరుకును నిలవచేసి అద్దెకున్న వారికి సరఫరా చేస్తుంది, తయారైన వస్తువుల విక్రయానికి ఏర్పాటు చేస్తుంది.


సనత్‌నగర్ రైలు స్టేషను యీ కేంద్రానికి కేవలం 3 ఫర్లాంగుల దూరంలో ఉంది కాబట్టి దీనికి ఒక రైల్వే సైడింగునుకూడా ఏర్పాటు చేయవలసి ఉంది. ఈ కేంద్రం సరిహద్దులలో బొంబాయి – హైద్రాబాద్ రైలు మార్గం ఒకటి.

ప్రభుత్వ కార్మిక గృహ వసతి కాలనీ యీ కేంద్రానికి ఎదురుగానే ఉంది. ఇక్కడ తగినన్ని ఇళ్లు యీ కేంద్రం కార్మికులకు కేటాయించబడినవి

కనీసం మరొక 35 ఎకరాల భూమిని సంపాదించి మరొక 12 లేక 15 ఫ్యాక్టరీ భవనాలను నిర్మించి యీ కేంద్రాన్ని పెంచాలని సంకల్పించబడింది.

విజయవాడ

విజయవాడ ముఖ్యమైన రైలు కూడలి. ఇదివరకే అక్కడ చాలా ఫ్యాక్టరీలు ఉన్నాయి. కాలువ ప్రయాణానికి సౌకర్యాలున్నాయి. కాబట్టి పారిశ్రామిక కేంద్రం స్థాపనకు



విద్యా శాఖా మంత్రి శ్రీ ఎస్. బి. పి. పట్టాభి రామారావు 14-9-59 న హైదరాబాద్‌లో సనత్‌నగర్ పారిశ్రామిక కేంద్రంలో స్వదేశీ పైప్ ఫౌండ్రీ శాఖను ప్రారంభించారు.

అది ఎన్నబడింది. (అంచనా ఖర్చు రూ. 20 లక్షలు) ఈ స్థలం మచిలీపట్నం రహదారిపై ఉంది. ఇక్కడ ఎ. బి. సి. డి తరగతులలో 18 ఫ్యాక్టరీ భవనాలు నిర్మించబడినవి. ఎ తరగతివి 2, బి 4, సి 4, డి 8 ఉన్నాయి. వీటిపని షెడ్డుల ప్రమాణాలు వరుసగా 80 అ. × 80 అ., 30 అ. × 40 అ., 40 అ. × 53 అ., 25 అ. × 50 అ. అయివున్నాయి. ఈ నాలుగు తరగతుల విషయంలోను పని షెడ్డు విస్తీర్ణం, కార్యాలయ విస్తీర్ణాలు ఇవి:— 6,889 2,288, 3,537, 1,219, 2,376, 788, 1,442, 532 (చ.అ.)

మొదటి అంచెలో 9 ఫ్యాక్టరీ భవనాలు నిర్మించబడి అద్దెకివ్వబడినవి. మిగిలిన 9 కూడా ఇప్పుడు పూర్తి అయి అద్దెకివ్వబడినవి. సబ్సిడైజుడు అద్దె రేటు సనత్ నగర్ రేటుతో సమానమైనదే. ఈ కేంద్రంలో 8 పారిశ్రామిక యూనిట్లు ఉన్నాయి.

పరిశ్రమల శాఖ యీ కేంద్రంలో దిగువ యూనిట్లను ఏర్పాటు చేసింది. 1. పోత పనివారి శిక్షణా కేంద్రం. ఇక్కడ ఇదివరకే యీ వృత్తిలో ఉన్న వారికి ఆధునిక పోత, అచ్చు పనులలో 11 నెలలపాటు శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ కేంద్రంలో కావలసిన వారికి సరుకులుకూడా చేసిపెట్టబడతాయి. 2. తోలు వస్తువుల శిక్షణ—ఉత్పత్తి కేంద్రం. ఇక్కడ ఇదివరకే ఆ వృత్తిలో ఉన్న వారికి వస్తూత్పత్తి ఆధునిక పద్ధతులు, యంత్రాల వాడకం, ప్రజాదరణ పొందిన రకం వస్తువుల తయారీలలో శిక్షణ ఇవ్వబడుతుంది. 3. సైకిలు విడి భాగాల ఉత్పత్తి యూనిట్లు. ఇక్కడ సైకిలు విడిభాగాలు, మడ్గార్డ్‌లు వగైరా సరుకులు తయారు చేయబడతాయి. 4. చిన్న, కుటీర పరిశ్రమల పరిశోధనా సంస్థ. ఇది ఆధునిక పరికరాలు, ఉత్పత్తి విధానాలు, ప్రత్యేకరకం పరికరాల డిజైను వగైరా సమస్యలను పరిష్కరిస్తుంది.

విశాఖపట్నం

విశాఖపట్నంలో నౌకాశ్రయం, నౌకా నిర్మాణ కేంద్రం, నూనె శుద్ధి కర్మాగారం ఉన్నందున భారీ పారిశ్రామిక

కేంద్రం స్థాపనకు (అంచనా రూ. 30.65 లక్షలు) అది ఆదర్శప్రాయమైన ప్రదేశం. అక్కడ 33 ఫ్యాక్టరీ భవనాలుండగలవు. 3 ఎ తరగతి, 6 బి తరగతి, 10 సి తరగతి, 14 డి తరగతివి ఉంటాయి. మొదటి అంచెలో 20 ఫ్యాక్టరీ భవనాలు నిర్మింపబడి అద్దెకివ్వబడినవి

ఈ కేంద్రంలో ఒక బ్రాంచి పోస్టాఫీసు తెరుబడింది, హైద్రాబాద్లు బ్యాంకు బ్రాంచి కూడా ఒకటి తెరువబడవలసి వుంది

పరిశ్రమల శాఖ నగరంలో గల తన వడ్రంగం ఉత్పత్తి యూనిట్టును యీ కేంద్రానికి తరలించింది. ఈ యూనిట్టు మంచి గిరాకీ గల ఉన్నత శ్రేణి కొయ్య సామానును తయారుచేస్తుంది. పనిముట్లు, రంగులు వగైరా తయారీలో అద్దెకున్న పారిశ్రామికులకు తోడ్పడటానికై వర్కు-షాపు-పనిముట్ల స్థావరం కూడా ఏర్పాటు చేయబడుతున్నది. ఎలక్ట్రో ప్లేటింగ్ మున్నగు వాటికికూడా అక్కడ సౌకర్యాలు ఉంటాయి. రైల్వే సైడింగ్ ఏర్పాటుకు కూడా కృషి జరుగుతున్నది.

సామర్లకోట

సామర్లకోట మద్రాసు-కలకత్తా రైలు మార్గంమీద ఉంది. ఒక జాతీయ రహదారి, తూర్పు, పశ్చిమ గోదావరులు, కృష్ణా జిల్లాల కాలువ సిస్టంచే కలుపబడివుంది. ఇది పైలట్ ప్రాజెక్టు ప్రాంతం. ఇక్కడి పారిశ్రామిక కేంద్రంలో (అంచనా రూ. 7 లక్షలు) ఇ, ఎఫ్, జి తరగతులలో మొత్తం 24 ఫ్యాక్టరీ భవనాలకు వసతి ఉంది. 4 ఇ తరగతి, 6 ఎఫ్ తరగతి, 14 జి తరగతివి. ఇ తరగతిలో పనిషెడ్డు ప్రమాణం 30 అ. × 55 అ. విస్తీర్ణం 1,914. కార్యాలయ విస్తీర్ణం 586. ఎఫ్ తగరతిలో పనిషెడ్డు ప్రమాణం 40 అ. × 25 అ. విస్తీర్ణం 1,182, కార్యాలయ విస్తీర్ణం 352. జి. తరగతిలో పనిషెడ్డు ప్రమాణం 20 అ. × 30 అ. విస్తీర్ణం 738, కార్యాలయ విస్తీర్ణం 202.

14 భవనాలు పూర్తి చేయబడి అద్దెకివ్వబడినవి మిగిలిన 10 నిర్మాణంలో ఉన్నాయి.

పరిశ్రమలశాఖ ఇక్కడ సాధారణ ప్రయోజన సర్వీసింగ్ వర్కుషాపును నెలకొల్పుతున్నది. ఖరీదైన యంత్రాలవల్ల జరగవలసిన పనులను చేయటం వగైరాలద్వారా అద్దెకున్న వారికి తోడ్పడటానికి ఇది ఉద్దేశించబడింది.

వరంగల్లు

వరంగల్లు కేంద్రానికి రూ. 10 లక్షలు ఖర్చుకాగలవని అంచనా. ఇక్కడ 16 ఫ్యాక్టరీ భవనాలకి (2 సి తరగతి, 4 డి తరగతి, 4 ఇ తరగతి, 6 ఎఫ్ తరగతి) వసతి ఉంది. 16 భవనాల నిర్మాణం పూర్తి కావస్తున్నది. పరిశ్రమలశాఖ ఒక సాధారణ భాగాల వర్కు-షాపు సర్వీసింగ్ కేంద్రాన్ని నెలకొల్పుతున్నది. ఈ కేంద్రం ప్రక్కన అప్పుడే శాఖాపరమైన యూనిట్లు మూడు-వడ్రంగం శిక్షణా కేంద్రం, కమ్మరం శిక్షణా కేంద్రం, కలప సీజనింగు ప్లాంటు-నెలకొల్పబడినవి.

నంద్యాల

నంద్యాలలో ముఖ్యమైన అభివృద్ధి కేంద్ర ప్రాంతం ముఖ్య కార్యస్థానం ఉంది. ఇక్కడ రూ. 3 లక్షలతో పారిశ్రామిక కేంద్రం నెలకొల్పబడుతున్నది. ఎఫ్ తరగతి యూనిట్లు 4, జి తరగతి యూనిట్లు 6 నిర్మించబడుతున్నాయి. నిర్మాణం 1959 నవంబరులో పూర్తి కాగలదు ఈ కేంద్రం కర్నూలు, కడపల మధ్య రహదారిపై నంద్యాల రైలు స్టేషనుకు సరిగ్గా వెనుక ఏర్పాటు చేయబడింది. పరిశ్రమల శాఖ ఇక్కడ సాధారణ ప్రయోజన ఇంజనీరింగు వర్కు-షాపును, సర్వీసింగ్ కేంద్రాన్ని నెలకొల్పుతున్నది

———:*:———

★

మలిగిన చీకటి

— మాదిరాజు రంగారావు

అందమైన పూర్ణ చంద్రుని ముఖంపై
కాలం విసరిన కత్తిదెబ్బ
తీక్షణమైన సూర్యుని మనస్సులో
కంటికి కన్పించని గాయం
స్వచ్ఛమైన శరదాకాశంలో
కదలాడే నీలిమబ్బుతునకలా
సామాన్యుని జీవితంలో తీరని
సాధారణ కోరికవలె నైల్యరేఖ
నీలి కళ్లు తెరచిన చీకటి గుహలో
జ్యోతీ రూపాల్లా వెలిసేశిల్ప విన్యాసంలో
ఆలోచనలనంతంగా సాగే మస్తిష్కంలో
సౌందర్యం సాహిత్యం ఎరిగిన మనస్సులో
పగిలిన కారు మబ్బు గుండెల్లో
జీవిత గ్రంథం పుటలలో దాగిన
అక్షరాలలో తెలిసిన రహస్యంలో
సందేహం తీరిన ఆలోచనలా కాంతి రేఖ
ముఖ్యంగా సిలువ వేయబడిన వేళ
మందారాలు పూచిన క్రీస్తుముఖంలో

—కాంతి రేఖ

నీడలా వెన్నంటి తనలో శాశ్వతంగా
ఐక్యం చేసుకోలేని మృత్యుముఖంలో

—నైల్యరేఖ

బుద్ధుని ముఖంలోని ప్రసన్నకళా శిల్పం
తనలో లీనీకరించుకున్న శాంతి చక్రం
అతని పాదాల క్రింద మెట్లు మెట్లుగా
మలిగి ఒదిగి పోయిన కారుచీకటి

అభివృద్ధి కార్యక్రమ కేంద్రాల విశేషాలు

పార్టీ వివాదాలకు స్వస్తి

ముత్యాలగూడెం, ఖమ్మంజిల్లా తిర్మలాయ పాలెం సమాజాభివృద్ధి కేంద్రంలోని చేగుమ్మ గ్రామం శివారు. ఆగ్రామంలో భూమి తగాదావల్ల పరస్పర వ్యతిరేకులైన ఇద్దరు బంధువులు నాయకులుగా రెండు కక్షలేర్పడ్డాయి. అవి గత 20 సంవత్సరాలుగా కలహించుకొనడంవల్ల గ్రామం విభేదాలతో సతమతమయేది. ఈ గ్రామంలో ఏ కార్యక్రమం అమలుకైనా ఇరుపక్షాలను ఒప్పించటానికి అభివృద్ధి కేంద్రం సిబ్బందికి తలప్రాణం తోకకివచ్చేది. ఒకరిమీద ఒకరు ఫిర్యాదులుచేస్తూ, ఒకరినొకరు ఆడిపోసు కుంటూ చివరకి ఏపార్టీవారూ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టేవారుకారు ఆ గ్రామంలో పాఠశాలలేదు. నాయకు లిద్దరికీ దానిపట్ల ఆసక్తిలేదు గ్రామం గలీజుగా ఉండేది. వీధులు ఇరుకుగా ఉండేవి.

ఈ ఇరుపక్షాలకు మైత్రిని కలిపితే అభివృద్ధి కార్యకలాపాలకు పెక్కు అవకాశాలున్నవని అభివృద్ధి కేంద్రం సిబ్బంది తలపోసింది. తుదకు ముత్యాలగూడెంలో గ్రామ సహాయకుల శిక్షణా శిబిరాన్ని నడపటానికి నిర్ణయించబడింది ఈగ్రామం మధ్యస్థంగా ఉండి, శిబిరానికి అవసరమైన ప్రజావిరాళాలను సమకూర్చటానికి తగిన స్తోమత కలిగివుండటంవల్ల ఇది ఎన్నబడింది. మొదట మొదటి పార్టీ రెండోదానిపైనా, రెండోది మొదటిదానిపైనా బాధ్యతనువేసినా ఆఖరికి శిబిరనిర్వహణకి తోడ్పడటానికిరెండూ అంగీకరించాయి శిబిరానికి స్థలం నిర్ణయించటం, భోజన వసతి ఏర్పాట్లు వగైరా విషయాలలో అడుగడుక్కీ అభ్యంతరాలు వచ్చినా ఉపాయంతో అవి పరిష్కరించబడినవి. అందులో ఏఒక్కపార్టీకాని లేక రెండూకాని సగంలో పని ఒదిలి చక్కాపోతాయేమోనన్న భయం క్రమేణా అంతరించింది. శిబిరం జరిగే రోజులలో ఇద్దరూ సరదాగా మాట్లాడుకుంటూ శిబిరం అవసరాలగురించి ఒక్కయింటికి మరొకరు వెళ్ళడం చూసిన గ్రామస్థులు విస్తుపోయారు.

శిబిరం జరిగిన మూడు రోజులు అభివృద్ధి కేంద్రం సిబ్బంది ఏర్పాటుచేసిన శ్రమదానంలో ఇరుపక్షాలవారు పాల్గొన్నారు. గ్రామం శుభ్రపరచబడింది. గ్రామస్థుల సహకారంతోనే వీధులు వెడల్పుచేయబడినవి. ఆ ఇద్దరు నాయకులు తమ పాత వివాదాలను మరచిపోయి స్వగ్రామం అభివృద్ధికి కలిసిమెలిసి పనిచేస్తున్నారు. అభివృద్ధి కేంద్రం సిబ్బంది వారుభయులు ఒకరియింటికి మరొకరువెళ్లి గ్రామాభివృద్ధి భావి కార్యక్రమాలను గురించి చర్చించే ఏర్పాటు చేసింది. ఇప్పుడాగ్రామంలో పాఠశాల ఏర్పడింది. పాఠశాలాభవనం నిర్మాణానికై రూ 1,500 ప్రజలనుంచి సేకరించబడినవి ఆ గ్రామాన్ని ప వ శా రోడ్డుతో కలుపుతూ 2 మైళ్ళ రోడ్డును నిర్మించటానికి కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు వారికి ఆధునికవ్యవసాయ పద్ధతులు, పశు సంక్షేమం వగైరాలలో ఆసక్తి కలిగింది. ఈ విధంగా యీగ్రామం సర్వతోముఖాభివృద్ధికి చక్కని అవకాశమేర్పడింది.

స్వయం సహాయం

పాలేరు అభివృద్ధి కేంద్రం రామచంద్రపురం గ్రామంలో ప్రభుత్వ సహాయమేమీలేకుండా గ్రామస్థులు స్వయంగా మూడుగదుల పక్కా పాఠశాలాభవనం గోడలు లేపారు.

బోదలబండగ్రామంలో ప్రభుత్వ ధనాన్ని వెచ్చించకుండా పూర్తిగా ప్రజావిరాళంతో 1959 మే 7 నుండి 29 వరకు గ్రామ సహాయకుల శిక్షణా శిబిరం నడుపబడింది. గ్రామప్రణాళికలు, అభివృద్ధి సంఘం సభ్యులు, మొత్తం మీద గ్రామస్తులందరు చూపిన పూనిక, సుహృద్భావం ఇందుకు దోహదం చేశాయి.

జిల్లాల వార్తలు

అనంతపురం

ప్రణాళికా ప్రదర్శనం :— సింగనమల బ్లాకులో నిగుగుడులో కుల్లాయస్వామి ఉత్సవాల సందర్భంలో రెండవ పంచవర్ష ప్రణాళిక క్రింద అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలన్నింటినీ తెలుపు ఒక ప్రదర్శనం ఏర్పాటు చేయబడింది

కురుబవండ్లపల్లిలో వనమహోత్సవ సప్తాహం జరుప బడింది. ఈ గ్రామంతోనే "కుటుంబానికొక ప్రణాళిక" పథకం అమలు పరచబడుతున్నది.

గుంటూరు

బంజరు భూముల సాగుకు ఋణాలు :— మంగళగిరి బ్లాకులో బంజరు భూములను సాగు క్రిందికి తేవడానికై ఋణాల క్రింద రూ. 12,000 ల మొత్తం పంపిణీ చేయ బడింది. మందడంలో మహిళా మండలి, బాలానంద సంఘం ప్రారంభింపబడినవి. రంగుదారాల కుట్టు పరికరాల సరఫరాకు గాను మహిళా మండలి రూ. 20 లను డిపోజిట్టు చేసినది.

విత్తనాల స్టోరు :— ఒంగోలు బ్లాకులో ఒంగోలులో విత్తనాల స్టోరు తెరువబడింది. ముక్తినూతలపాడులో మహిళా మండలి ప్రారంభింపబడింది ఎరజర్లలో గ్రామ సహాయక శిక్షణా శిబిరం నిర్వహింపబడింది.

సంతమాగులూరు మొదటి అంచె బ్లాకులో ఏల్చూరులోని పాఠశాలలో ఆరవ తరగతి తెరువబడింది.

ఖమ్మం

ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీ సయ్యద్ హాషీమ్అలీ సమన్వయ సాధక సంఘం సమావేశంలో జిల్లాలో జరిగిన అభివృద్ధిని సమీక్షిస్తూ, ఖమ్మం జిల్లా చిన్న మొత్తాల పొదుపు పెట్టుబడికి సుమారు రూ. 9 లక్షలను సేకరించడం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ అంతటిలోకీ యీ రంగంలో అగ్రి స్థానం పొందగలిగిందన్నారు.

అంబర్ చరఖా పరిశ్రమాలయం :— వైరాలో 1959 ఆగస్టు 29 వ తేదీన అంబర్ చరఖా పరిశ్రమాలయానికి జిల్లా కలక్టర్ ప్రారంభోత్సవం చేశారు. ఇది లక్ష్మీపురం శ్రీరామలింగేశ్వరస్వామి నూలు వడుకు పనివారలది, సహకార సంఘంచేత స్థాపింపబడింది. ప్రారంభోత్సవ సభలో జిల్లా కాంగ్రెస్ సంఘం అధ్యక్షుడు శ్రీ జలగం వెంగళరావు, శాసన సభ సభ్యుడు శ్రీ జె. కొండలరావు ప్రభృతులు ప్రసంగించారు.

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా భారత ప్రభుత్వ ప్రణాళికా ప్రచార విభాగం చేత ఏర్పాటుచేయబడిన ప్రజల ప్రణాళికా ప్రదర్శనానికి జిల్లా కలక్టర్ ప్రారంభోత్సవం చేశారు

ఖమ్మం ఎస్. ఆర్ అండ్ బి. జి ఎన్. ఆర్. కళాశాలలో కొత్త ఉపన్యాస మందిరాన్ని జిల్లా కలక్టర్ ప్రారంభించారు.

జాతీయ ప్రణాళికా దినం :— సెప్టెంబర్ 11వ తేదీన తల్లాడలో, 12 వ తేదీన రెబ్బవరంలో, 13 వ తేదీన వైరాలో జాతీయ ప్రణాళికా దినం జరుపబడింది

కృష్ణా

పాఠశాలా భవనం :— కంచికచెర్ల బ్లాకు మాగల్లు గ్రామంలో నిర్మింపబడిన ప్రాథమిక పాఠశాలా భవనం 1959 ఆగస్టు 31 వ తేదీన తెరువబడింది.

సహకార సంఘాలు :— తిరువూరులో 14-8-59తేదీన శ్రీ వెంకటేశ్వర భవన నిర్మాణ సహకార సంఘం ప్రారంభింపబడింది



పశ్చిమ గోదావరి జిల్లా గోపన్నపాలెం గ్రామసేవకుల శిక్షణా కేంద్రం శిక్షితులు గ్రామాలకు వెళ్ళినప్పుడు పశువులకు సూదిమందు వేస్తున్న దృశ్యం

1959 ఆగస్టు 18 వ తేదీన ఊటుకూరులో జాలరుల సహకారసంఘానికి ప్రారంభోత్సవం జరుపబడింది.

కమ్యూనిటీహాలు:—— రాష్ట్రీఆర్థిక, ప్రణాళికల శాఖామంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి 1959ఆగస్టు 26వ తేదీన వీరవల్లి గ్రామంలో శ్రీ లారిక మన్యం కమ్యూనిటీ హాలుకు ప్రారంభోత్సవంచేశారు. శాసనః సభ సభ్యుడు శ్రీ పేట బాపయ్య ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించారు. శా.స. సభ్యుడుశ్రీ మేకా కోటి రెడ్డి జాతీయ పతాకం ఎగురవేశారు.

కృష్ణా జిల్లా ప్రణాళికల అధికారి శ్రీ బి. రామలింగస్వామి 1959 ఆగస్టు 17 వ తేదీన జక్కంచెర్ల గ్రామంలో కొత్తగా నిర్మింపబడిన ప్రాథమిక పాఠశాలా భవనానికి ప్రారంభోత్సవం చేశారు. లోక్‌సభ సభ్యుడు శ్రీ ఎం.వి. కృష్ణారావు ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించారు.

కర్నూలు

సహాయక సేనా శిబిరం:-కోడుమూరులో 1959 సెప్టెంబర్ 1 వ తేదీన శా.స. సభ్యుడు శ్రీ కె. విజయభాస్కర రెడ్డి లోక సహాయక సేనా శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు.

మహబూబ్‌నగరం

పశు చికిత్సా కేంద్రం:—— కొల్లాపూర్ మొదటి అంచె బ్లాకు అధ్వర్యాన తూముకుంట గ్రామంలో పశువుల ప్రథమ చికిత్సా కేంద్రం తెరవబడింది. దానిని ఆ గ్రామ అభ్యుదయ రైతు శ్రీ కె. బాలకృష్ణారెడ్డి ప్రారంభించారు.

మహిళామండలి:—— అలంపురం గ్రామలక్ష్మి శ్రీమతి సరోజని అలంపురంలో 18మంది సభ్యులతో స్వచ్ఛందంగా ఒక మహిళా మండలిని స్థాపించింది. ఆ ప్రాంతపు స్త్రీల కొరకు యీ మండలి వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించింది.

నల్గొండ

పాఠశాలాభవనం ప్రారంభం-:డిప్యూటీ డెవలప్‌మెంట్ కమీషనర్ శ్రీ జి.డి. ఖురేషీ ఆలగడప గ్రామంలో 1959 ఆగస్టు 27 వ తేదీన పాఠశాలా భవనానికి ప్రారంభోత్సవం చేశారు. మిర్యాలగూడెం మొదటి అంచె బ్లాకు కార్యక్రమం క్రింద యీ భవనం నిర్మింపబడింది. శ్రీ ఖురేషీ చింతపల్లి బ్లాకులోని కొప్పోలె గ్రామాన్ని కూడా సందర్శించి గ్రామీణ గృహ నిర్మాణ పథకం, సహకార సేద్యం క్రింద జరుగుతున్న పనులను తనిఖీ చేశారు.

చౌటుప్పల్ మొదటి అంచె బ్లాకులోని పెదకాకాని, సిర్పూర్ గ్రామాలలో గ్రామ సహాయక శిక్షణా శిబిరాలు నిర్వహింపబడినవి.

గ్రంథాలయ పునరుద్ధరణ:—— నల్గొండ పూర్వ విస్తరణ బ్లాకులోని పానగలు గ్రామంలో 1959 సెప్టెంబర్ 6 వ తేదీన ఒక పాత గ్రంథాలయం పునరుద్ధరింపబడింది. ఈ సందర్భంలో శ్రీ కె. చిన వెంకటరామారావు ప్రభృతులు ప్రసంగించారు.

మూసీ ప్రాజెక్టు వద్ద గల ఎక్స్‌ట్రా డిపార్టుమెంటల్ సబ్ పోస్టాఫీసు 1959 సెప్టెంబర్ 1 వ తేదీ నుంచి డిపార్టుమెంటల్ పోస్టాఫీసు క్రింద మార్చబడింది. ఈ సబ్ ఆఫీసు క్రింద 12 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నవి.

నెల్లూరు

అభివృద్ధి కార్యకలాపాలు:—— తాళ్ళూరు బ్లాకు అధ్వ

ర్యాన పెపటూళ్ళగల్లు,శంకరపురం,ఇల్లాప్పలెంలలో నిర్మింప బడిన పాఠశాలా భవనాలకు జిల్లా కలక్టర్ జనాబ్ ఎం.ఎం. బేగ్ సాహెబ్ బహదూర్ ప్రారంభోత్సవం చేశారు.తూర్పు గంగవరంలో ప్రసూతి కేంద్రానికీ, తాళ్ళూరు నుంచి తూర్పు గంగవరం వరకు అయిదు మైళ్ళ పొడవున నిర్మింపబడిన మొహిబుల్లా రోడ్డుకి కూడా జిల్లా కలక్టర్ ప్రారంభోత్సవం చేశారు

క్రీడా విన్యాసం:— గూడూరు డివిజను వివిధ ప్రభుత్వ శాఖల ఆటల పోటీలు గూడూరులో 1959 ఆగస్టు 15 వ తేదీన అసిస్టెంటు కలక్టర్ అధ్వర్యాన జరుపబడినవి. ఒలం పిక్ జ్యోతిని వెలిగించిన తరువాత పోటీ దారులు చేసిన గౌరవ వందనాన్ని జిల్లా కలక్టర్ శ్రీ ఎం.ఎం. బేగ్. ఐ.ఎ.ఎస్. స్వీకరించారు. ఆయన క్రీడా ప్రమాణ స్వీకారం కూడా చేయించారు.

శ్రీమతి ఎం ఎం బేగ్ రూ 500 లకు పైగా విలువ చేసే బహుమతులు పంచిపెట్టారు ఇంతే గాక అనేక షీల్డులు, కప్పులు కూడా బహూకరింపబడినవి

నిజామాబాద్

మైసూర్ ఉపమంత్రి ఆగమనం:— మైసూర్ రాష్ట్ర ప్రణాళికల శాఖ ఉప మంత్రి శ్రీ లింగారెడ్డి నిజామా బాద్ జల విద్యుచ్ఛక్తి కేంద్రాన్ని సందర్శించారు బాన్స్ వాడ పంచాయతీ సమితి బ్లాకును కూడా ఆయన చూశారు మహిళా మండలి, సమాచార కేంద్రాన్ని కూడా ఆయన దర్శించారు. తరువాత బ్లాకు విస్తరణాధికార్లతో ముచ్చటిం చారు.

బాన్స్‌వాడ మహిళా మండలి ప్రథమ వార్షికోత్సవం 17-8-1959 తేదీన జరిగింది.

అభినగపట్నంలో ప్రాజెక్టు అమలు కేంద్రాన్ని జిల్లా కలక్టర్ శ్రీ జి నారాయణచెట్టి ప్రారంభించారు

ప్రజల ప్రణాళిక ప్రదర్శనం:— కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ అధ్వర్యాన నిజామాబాద్‌లో జరిగిన ప్రజల ప్రణాళికా ప్రదర్శనానికి జిల్లా కలక్టర్ ప్రారంభోత్స వం చేశారు

శ్రీకాకుళం

పారిశ్రామిక సహకార సంఘాలు:— షేర్ మొహ మ్మద్‌పురం మొదటి అంచె బ్లాకులో ముద్దాడ గ్రామం నూనె గానుగ పనివారల కొరకు స్థాపించబడిన పారిశ్రామిక సహకార సంఘం పని ప్రారంభించింది. ఈ బ్లాకులో ఇది రెండవ సహకార కుటీర పరిశ్రమల సహకార సంఘం.

స్త్రీలకు శిక్షణా కేంద్రం:— స్త్రీలకు దర్జీపని, రంగు దారాల కుట్టుపని నేర్పడానికిగాను షేర్ మొహమ్మద్‌పురంలో ఒక శిక్షణాకేంద్రం తెరవబడింది. జిల్లా ప్రాజెక్టు అమలు సంఘం అధ్యక్షుడు శ్రీ బి. ఎస్. శాస్త్రి యీ కేంద్రాన్ని ప్రారంభించారు.

మకరజాల గ్రామంలో వ్యవసాయ సంబంధమైన విష యాలలో ఐదవ గ్రామ సహాయక శిక్షణా శిబిరం నిర్వ హింపబడింది. మకరజాల పంచాయతీ బోర్డు అధ్యక్షుడు శ్రీ వాయిలపల్లి నారాయణ యీ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు

విశాఖపట్నం

కమ్యూనిటీ హాలుకు ప్రారంభోత్సవం:- రాష్ట్ర స్థానిక పరిపాలన శాఖా మంత్రి శ్రీ డి. సంజీవయ్య పాయకరావు పేటలో కమ్యూనిటీ హాలుకు ప్రారంభోత్సవం చేశారు. నక్కపల్లి బ్లాకు అభివృద్ధి పథకం నుంచి లభించిన సహా యంతోనూ, స్థానిక ప్రజలు ఇచ్చిన విరాళాలతోనూ ఇది నిర్మింపబడింది శా. స. సభ్యుడు శ్రీ రాజా సాగి సూర్య నారాయణరాజు ప్రారంభోత్సవ సభకుఅధ్యక్షతవహించారు.

కోటవురట్ల పంచాయతీ సమితి బ్లాకులోని కొడవటిపూడి గ్రామంలో 30 ఇండ్లతో కొత్తగా నిర్మింపబడిన హరిజన కాలనీకి కూడా మంత్రిగారు ప్రారంభోత్సవం చేశారు.

కొడవటిపూడి పంచాయతీ అధ్యక్షుడు శ్రీ బి. వెంకట రావు మంత్రికి స్వాగతమిచ్చారు.

శ్రీ సంజీవయ్య పాయకరావుపేటలో రహదారి బంగ ళాకు ప్రారంభోత్సవం చేశారు. జిల్లా కలక్టరు శ్రీ ఐ. జె. నాయుడు యీ సభకు అధ్యక్షత వహించారు.

ప్రజల విరాళాలు:- ప్రజాహిత కార్యక్రమాలకై దాతలు భూరి విరాళాలిస్తున్నట్లు పెక్కు వార్తలు వస్తున్నవి.

వడ్డాదిబ్లాకులో పొన్నవోలుకుచెందిన శ్రీ తమిరెడ్డి వరహాలు దొర, దిబ్బపాలెంకు చెందిన శ్రీ గొలగాని

భోగన్న, కొత్తడూరుకిచెందిన శ్రీ చిన్నెము నాయుడు, పాతకొట్నబిల్లికి చెందిన శ్రీ అసరి సన్యాసయ్య, కొత్త కొట్నబిల్లికి చెందిన శ్రీఅసరి కనకారావుగారలు పాఠశాలా భవనాల నిర్మాణానికి భూములు దానం చేశారు.

వరంగల్లు

అబ్బాయపాలెం బ్లాకు:- రాష్ట్ర కార్మిక, స్థానిక పరిపాలన శాఖామంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య 23-8-59 తేదీన వరంగల్లు జిల్లా మహబూబాబాద్ తాలూకాలో అబ్బాయపాలెం బ్లాకుకు ప్రారంభోత్సవం చేశారు. జిల్లా కలక్టర్ శ్రీ మొహిసిన్ బిన్ షబీర్, ఐ. ఎ. ఎస్., సభకు అధ్యక్షతవహించారు. లోకసభ సభ్యుడు శ్రీరాజా రామేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు శ్రీ నూకల నరోత్తమ రెడ్డి, రాష్ట్ర శాసన మండలి సభ్యుడు శ్రీ పి. వెంకటరావు, శా. స. సభ్యుడు శ్రీనూకల రామచంద్రారెడ్డి యీ సందర్భంలో ప్రసంగించారు.

శ్రమదానం:- భారత రెడ్ క్రాస్ సంఘం వరంగల్లు శాఖకై భవన నిర్మాణానికి శ్రమదాన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రారంభించారు.

పశ్చిమ గోదావరి

గ్రామ సహాయకుల శిబిరం పెంటపాడు మొదటి అంచె బ్లాకులో నవాబు పాలెంలో 29-8-59 తేదీ నుండి 31-8-59 వరకు మూడవ గ్రామ సహాయకుల శిక్షణా శిబిరం నిర్వహింపబడింది. జగన్నాధపురం, మాధవరం గ్రూపులకు ప్రాతినిధ్యం వహించు ఐదుగురు సహాయకులు దీనిలో శిక్షణ పొందారు.

ఈ బ్లాకులో మహిళా మండలి సభ్యురాండ్రు తమ గ్రామాలలో పక్కారోడ్డుల నిర్మాణానికిగాను 50 శాతం విరాళంగా రూ. 650 లను విరాళాలుగా సేకరించి ఇచ్చారు. చింతపల్లి యువజన క్లబ్బు సభ్యులు తమ గ్రామంలో కంకర రోడ్డు నిర్మాణానికై రూ 31 లను ప్రోగుచేశారు. కోరుమిల్లి, నూనవిల్లూరు, బి. కొండెపాడు గ్రామములకు చెందిన యువజన క్లబ్బులు రైతు క్లబ్బుల సభ్యులు, శిక్షితులైన గ్రామ సహాయకులు, వరదలవల్ల ఆపరిసర ప్రాంతాలు మునిగిపోకుండా కాపాడడానికి ఎత్తు కాలువ గట్టులను ఎత్తుచేశారు.

ముఖ్యమంత్రి ఆగమనం:- రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి, రెవెన్యూ శాఖా మంత్రి శ్రీ కొండా వెంకట రంగారెడ్డి తమ్మిలేరుకు వచ్చిన గండిని పరిశీలించారు. వరద నిరోధక చర్యలను గురించి వారు ప్రజా ప్రతినిధులతోనూ, అధికార్లతోనూ చర్చలు జరిపారు.

తరువాత ముఖ్య మంత్రి ఏలూరు శ్రీ సి ఆర్. కళాశాల విద్యార్థి సంఘానికి ప్రారంభోత్సవం చేశారు

కమ్యూనిటీ ప్రాజెక్టుల నినాదం "గమ్యం మనిషి". ఈ ప్రాజెక్టు యీ ఆశయాన్ని చేరిన మేరకు విజయమవుతుంది. మనిషి ఉనికికి ప్రేమానందాలు కారణం. అతడు శ్రమ ద్వారా పెరిగి ఆత్మ సాక్షాత్కారం—కాయిక మానసిక, ఆధ్యాత్మిక-ద్వారా పరిపూర్ణుడవుతాడు. ప్రతి ఒక్కరూ యీ అన్ని దశలనూ దాటవలసినదే. దీనికి దగ్గిర తోవ లేదు. "కమ్యూనిటీ ప్రాజెక్టులు" సుదీర్ఘమైన యీ మార్గంలో మొదటి మెట్టుగా ఏర్పరచబడ్డాయి. ఈ మార్గాన్ని ప్రజల ప్రయాణార్థం ప్రజలే నిర్మించాలి.

— శ్రీ ఎస్. కె. డే.

రోడ్డు రవాణా జాతీయకరణ

ఆంధ్రప్రదేశ్‌లో క్రమేపీ రోడ్డు రవాణా సర్వీసులు జాతీయం చేయబడుతూ వున్నవి. ఈ జాతీయకరణ కార్యక్రమం త్వరితగతిని సాగుతూవుంది. అయితే జాతీయం చేయబడ్డ ఈ సర్వీసు, ప్రైవేటు సర్వీసులకంటే ఏ విధంగా మేలుగా వుంది? ఈ కార్యక్రమాన్ని అమలు పరచడంలో అధికార్లను ఏయే ఇబ్బందులు ఎదుర్కొంటూ వున్నవి? ఇవన్నీ నేటి ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు రోడ్డు రవాణా కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ గురుపర్షాద్ ఆలిండియా రేడియో హైదరాబాద్ నిలయంనుంచి 29-8-1959 తేదీన ప్రసారం చేయబడిన చర్చాగోష్ఠిలో సమాధానాలు చెప్పారు. గోష్ఠిలో శ్రీ గురుపర్షాద్‌తో శ్రీ కె. పురుషోత్తమరావు, శ్రీ టి.వి. కృష్ణారావుగారలు పాల్గొన్నారు.

ప్రశ్న:- గురుపర్షాద్‌గారూ, మీరు అసలు విషయాని కొచ్చేముందు హైద్రాబాద్ రాష్ట్రంలో రోడ్డు రవాణాశాఖ పూర్వ చరిత్ర ఏమిటో తెలియజేస్తారా?

సమా:- అలాగే కృష్ణారావుగారూ. మంచి మాటే అడిగారు. 1932 లో రోడ్డురవాణా కార్పొరేషన్ అను పేరుతో యీ సంస్థ మొదట ఆవిర్భవించింది. అప్పుడిది నైజాం స్టేట్ రైల్వేకు ఒక శాఖగా వుండేది. అప్పుడే నైజాం స్టేటు రైల్వేను హైద్రాబాదు ప్రభుత్వం స్వాధీనపరచుకుంది. అయితే ఆర్థిక మాంద్యం కారణంగానూ, ప్రైవేటు బస్సుల పోటీ మూలంగానూ రైల్వే ఆదాయం నానాటికీ తగ్గుతూ వుండడంచేత హైద్రాబాద్ ప్రభుత్వం ఆందోళన చెందసాగింది. రాష్ట్రంలోని రోడ్డు రవాణా సర్వీసులను ప్రైవేటు ఆపరేటర్ల వద్దనుంచి తీసుకొని ఒక సక్రమ ప్రాతిపదికపై వాటిని నడుపవలసిన ఆవశ్యకతను మొదట రైల్వేవారు గుర్తించారు. ఇందుకు కారణం కూడా వుంది. ప్రైవేటు ఆపరేటర్లలో చాలామందికి తగు హంగు, సిబ్బంది, యంత్రసామగ్రి మొదలైనవి లేవు. పైగా వారా సర్వీసులను ఒక క్రమ పద్ధతి ప్రకారం నడపడం లేదు. అందుచేత రైల్వే ఆదాయాన్ని కాపాడి వీలైతే ఇంకా పెంపొందించే ఉద్దేశంతో రోడ్డు రవాణా కార్పొరేషన్ అను సంస్థ నెలకొల్పబడింది. త్వరలోనే ఈ సంస్థ ప్రయాణీకులకు చక్కని సౌకర్యాలు కలిగించే రవాణా సంస్థగానే కాక, నైజాం స్టేట్ రైల్వేకు, హైద్రాబాద్ ప్రభుత్వానికి మంచి లాభకరమైన సంస్థగా రూపొందింది. అంటే, రోడ్డు రవాణా ఆనాడే జాతీయం చేయబడిందన్న మాట-అయితే జాతీయం అన్న పేరు మాత్రం యీ నాటి మాదిరిగా అప్పుడు స్వేచ్ఛగా ప్రయోగించడం జరగలేదు.

ప్రశ్న:- అంటే మీరు చెప్పినదాన్ని బట్టి హైద్రాబాద్‌లో 1932 లోనే రోడ్డు రవాణా సర్వీసు జాతీయం చేయబడిందన్నమాట. ఆ కాలంలో అలాంటి జాతీయకరణ మరే రాష్ట్రంలోనైనా అమలులోకి తేబడిందా?

సమా:- అవునండీ పురుషోత్తమరావుగారూ. 1947లో- అంటే పదిహేనేండ్ల తరువాత జాతీయకరణ అవసరాన్ని ఇతర రాష్ట్రాలు కూడా గుర్తించి ప్రైవేటు ఆపరేటర్లవద్ద నుంచి ప్యాసింజర్ సర్వీసులను స్వాధీనపరచుకోవడం మొదలెట్టాయి. మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి రెండేళ్ళపూర్వం రోడ్డు రవాణాను కూడా తమలో ఒక విభాగంగా పెట్టుకోవడం మంచిదని రైల్వేలు భావించాయి. ఈ విషయంలో నైజాం స్టేట్ రైల్వే అవలంబించిన పద్ధతిని తామూ అనుసరించవలెనని రైల్వేలు తలపెట్టాయి. కాని తరువాత ఇది కేంద్ర ప్రభుత్వ అంశముగా కాక రాష్ట్ర ప్రభుత్వాలే రోడ్డు రవాణా సర్వీసులను చేపట్టవలసిన విధానం అమల్లోకి వచ్చింది.

ప్రశ్న:- మరి ఇలా ప్రైవేటు సంస్థలనుంచి ప్యాసింజర్ సర్వీసులను స్వాధీనపరచుకోవడానికి నైజాం స్టేట్

రైల్వేవారూ, హైద్రాబాదు ప్రభుత్వమూ ఏ సూత్రాలను దృష్టిలో పెట్టుకొన్నారో తెలియజేస్తారా ?

సమా:- అలాగే కృష్ణారావుగారూ. నైజాం స్టేట్ రైల్వే వారు రోడ్డు రవాణా శాఖను ఏర్పాటు చేయడానికి మూడు ప్రధాన సూత్రాలను దృష్టియందుంచుకున్నారు.

ఒకటి— ప్రజలకు సంతృప్తికరమైన రవాణా సర్వీసును ఏర్పాటుచేయడం. (లాభం లేనట్టివైనా ప్రజల కవసరమైన సర్వీసులతో సహా)

రెండు— రోడ్డు సర్వీసుకూ, రైల్వే సర్వీసుకూ మధ్య అవాంఛనీయమైన పోటీని తొలగించడం.

మూడు— ప్రజలకూ, ప్రభుత్వానికీ చెందవలసిన లాభాలు ప్రైవేటు రంగానికి పోకుండా నివారించడం.

ప్రశ్న:- మరి ప్రైవేటు ఆపరేటర్లకు వారి సర్వీసుల్ని స్వాధీన పరచుకున్నందుకుగాను ఏమైనా నష్టపరిహారం ఇచ్చారా ?

సమా:- ప్రైవేటు గుత్తా పద్ధతిని తీసివేస్తున్నప్పుడు ప్రైవేటు ఆపరేటర్ల వద్ద నుంచి ఉపయోగించే మోటారు బండ్లనూ, యంత్ర సామగ్రినీ కొనడం జరిగింది.

ప్రశ్న:- మరి ఆ ఆపరేటర్ల సిబ్బందిని ఏంచేశారు ?

సమా:- వారినందరిని సర్వీసులోకి తీసుకున్నారు!

ప్రశ్న:- ప్రైవేటు ఆపరేటర్లు వసూలుచేస్తూ వచ్చిన రేట్లకంటె రోడ్డు రవాణా శాఖవారు వసూలుచేసే రేట్లు తక్కువగా వుండేవా ?

సమా:- అవునండీ, తక్కువగానే వుండేవి.

ప్రశ్న:- ఇప్పుడు మీరు డీసెల్ బస్సులు నడుపుతున్నారు కదా. ఇవి మీ శాఖలో మొదట ఎప్పుడు ప్రవేశపెట్టారు.

సమా:- భారత దేశంలో మొట్టమొదటి సారిగా మనమే 1935 లో ప్రయాణీకుల బస్సులకు డీసెల్ ఇంజన్లు ప్రవేశపెట్టాము. చిత్రమైన విషయమేమంటే ఆ రోజుల్లో హైస్పీడ్ డీజెల్ ఆయిల్ దిగుమతి అయ్యేదికాదు. లైట్ పర్షియన్ డీసెల్ ఆయిల్ వాచ్చేది. అది మహాచెడ్డగా వుండేది. దానితో డీసెల్ ఇంజన్లను నడపమంటే తలనొప్పిగా వుండేది. అందుచేత రవాణా శాఖకు 1938 లో డిస్టిలేషన్ ప్లాంటు—వడపోత యంత్రం—తయారు చేయబడింది. అంతటితో ఆ ఇబ్బంది కాస్తా తొలగిపోయింది అలా వడపోసిన నూనె యీ నాటి హైస్పీడ్ డీసెల్ ఆయిల్‌తో సమానంగా వుండేది

ప్రశ్న:- మీరు రైల్వేలో ఒక విభాగంగా వుండేవారని అన్నారు. ఇప్పుడు మీదొక కార్పొరేషన్. యీ మార్పు ఎప్పుడొచ్చిందీ ?

సమా:- అవునండీ, 1951 దాకా రైల్వేలో ఒక భాగంగానే వుండేవారం. కాని నైజాం స్టేట్ రైల్వే సెంట్రల్ రైల్వేలో విలీనమైపోవడంతో రోడ్డు రవాణా విభాగం ప్రభుత్వ శాఖగా మారింది. కార్పొరేషన్ 1958 జనవరి 11వ తేదీన ఏర్పాటు చేయబడింది.

ప్రశ్న:- రోడ్డురవాణా శాఖను కార్పొరేషన్‌గా మార్చినప్పుడు దానివల్ల ఏమైనా వెసులుబాటు వున్నట్టు తెలిసిందా?

సమా:- రోడ్డు రవాణా సర్వీసులను చట్టబద్ధమైన కార్పొరేషన్ల క్రిందికి తేవడానికై 1950 లో భారత ప్రభుత్వం రోడ్డు రవాణా కార్పొరేషన్ల చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రజోపయోగకరమైనట్టి రోడ్డు ప్యాసెంజర్ సర్వీసులను ప్రభుత్వశాఖల్లో ఒక భాగంగా వ్యాపార పద్ధతిలో నిర్వహించడం వీలుపడదనీ, పైగా ప్రభుత్వ శాఖలాగా వున్నట్లయితే ఆ సర్వీసుకు వుండవలసిన సామర్థ్యం. వెసులుబాటు వుండవనీ భారత ప్రభుత్వం గ్రహించింది. అందుచేత రోడ్డు రవాణా సంస్థలను నడుపడానికి రాష్ట్ర ప్రభుత్వాలే చట్టబద్ధమైన కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసుకోవడం మంచిదని భారత ప్రభుత్వం అభిప్రాయపడింది.

ప్రశ్న:- రోడ్డు రవాణా నిర్వహణలో మీకు ఇంతవరకు మూడు రకాల మేనేజిమెంటు అనుభవాలు వున్నాయి. మేనేజిమెంటుకు ఏ పద్ధతి ఎక్కువ ప్రయోజనకరమైందో తెలుపుతారా.?

సమా:- ప్రస్తుతపు కార్పొరేషన్ పద్ధతే ఎక్కువ ప్రయోజనకరంగా వుందండీ. ఇలా చట్టబద్ధంగా ఏర్పాటైన కార్పొరేషన్ రవాణా సర్వీసులను సమర్థవంతంగా, వ్యాపార సరళిలో నడుపగలుగుతుంది.

దశలవారీ కార్యక్రమం

ప్రశ్న:- మరి మీ సర్వీసులను ఆంధ్ర ప్రాంతానికి ఎప్పుడు విస్తరింపజేయాలనుకున్నారు?

సమా:— 1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డప్పుడు అంతకు క్రితం రోడ్డు రవాణా శాఖ నడుపుతూవున్న సర్వీసులలో మూడవ వంతు బొంబాయి, మైసూరు రాష్ట్రాలకు పోయాయి అయితే ప్రధాన కార్యాలయం మాత్రం హైదరాబాద్‌లోనే వుంది అలా మూడవ వంతు సర్వీసులు ఇతర రాష్ట్రాలకు పోయిన ఫలితంగా మేనేజిమెంటు విభజింపబడ లేదు హైదరాబాద్‌లో వున్న పెద్ద సెంట్రల్ వర్క్ షాపుకూడా ఎలాంటి విభజనకూడా లేక యధాతధంగా వుండిపోయింది మరి దీన్నంతా ఉపయోగించుకోవాలి గదా అందువేత రోడ్డు రవాణా సర్వీసులను విస్తరించవలెనని తలపెట్టబడింది ప్యాసెంజర్ సర్వీసుల జాతీయకరణను పక్కనవున్న పూర్వపు ఆంధ్రప్రాంతానికి, అనగా కృష్ణా జిల్లాకు విస్తరింపజేయవలసిందిగా నేనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాను. పూర్వపు ఆంధ్ర ప్రాంతంలో ప్రభుత్వ రోడ్డు రవాణా సర్వీసు లేదు. ఆంధ్ర తెలంగాణాల విలీనం తరువాత హైదరాబాద్‌లో చక్కగా వ్యవస్థీకృతమైన రోడ్డు రవాణా శాఖ వుంది. అప్పుడున్నటువంటి సర్వీసుల నిర్వహణకయ్యే ఖర్చులను తగ్గించవలసిన అగత్యం కూడా ఏర్పడింది. పైగా భారత దేశంలోని ఇతర రాష్ట్రాలు రోడ్డు రవాణా జాతీయకరణ కార్యక్రమంలో ముందంజవేస్తూ వున్నాయి. ఈ కారణాలన్నింటి చేత ప్రభుత్వం జాతీయకరణను పూర్వపు ఆంధ్ర ప్రాంతానికి క్రమేణా దశలవారీ కార్యక్రమం ప్రకారం విస్తరింపజేయ నిశ్చయించింది ఇది చాలా సాహసోపేతమైన గొప్ప నిర్ణయం.

ప్రశ్న:— మరి ప్రైవేటు ఆపరేటర్లు కోర్టుకు వెళ్ళడం వల్ల మీకేవో చిక్కులు కలిగినట్టుందే

సమా:— అవును. 1939 సం. పు మోటారు బండ్ల చట్టాన్ని 1956లో సవరించడమైంది. రాష్ట్రాలలో జాతీయం చేయబడినప్యాసెంజర్ సర్వీసులను ప్రవేశ పెట్టే ఉద్దేశంతో పార్లమెంటు వారు ఒక అధ్యాయాన్ని పెట్టారు. ఆ చట్టంలో రోడ్డు రవాణాను సమర్ధ వంతమైన, లాభ సాటియైన సమన్వయ విధానం ప్రకారం నిర్వహించేందుకై రోడ్డు రవాణా సంస్థ జాతీయకరణ పధకాన్ని ప్రకటించే వీలేర్పాటు చేయబడింది. జనరల్ మేనేజర్ ఆ పధకాన్ని ప్రకటించాడు. ఏవైనా అభ్యంతరాలొస్తే వాటిని విచారణ చేసే అధికారం చట్టం ప్రకారం ప్రభుత్వానికి వుంది. అలాగే ప్రభుత్వం అభ్యంతరాలను విచారణ చేసి పధకాన్ని ఆమోదించింది. 1958 ఏప్రిల్ 1వ తేదీన విజయవాడ—బందరు, విజయవాడ—గుంటూరు మార్గాలపై నూ సర్వీసులు ప్రవేశ పెట్టాము ప్రభుత్వ నిర్ణయం వల్ల అసంతృప్తి చెందిన ప్రైవేటు ఆపరేటర్లు హైకోర్టుకూ, ఆ పిమ్మట సుప్రీం కోర్టుకూ వెళ్లి రాజ్యాంగ శాసనంలోని 19 31 సూత్రాల ప్రకారం దేశ పౌరులుగా తమకుగల ప్రాథమిక వ్యాపార స్వాతంత్ర్యాన్ని అరికట్టడం జరిగిందనీ, ప్రభుత్వం సర్వీసులను స్వాధీనపరచుకున్నప్పుడు తమ ఆస్తులను కొనడం జరగలేదనీ చెప్పి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంపై దావా వేశారు. తుదకు సుప్రీం కోర్టువారు ప్రభుత్వ పక్షాన్నే దావా పరిష్కారం చేసి చట్టం చెల్లదగిందేనని తీర్పు చెప్పారు.

ప్రశ్న:-మరి ప్రైవేటు ఆపరేటర్ల మోటారు బండ్లను మీరు కొనవలసిందికదా? కొనడమే న్యాయంకదూ?

సమా:-అవును, వాటిని కొనకుండా వుండడం న్యాయం కాని మాట నిజమే అన్నట్టుగాతోస్తుంది. కాని పార్లమెంటు ఆమోదించిన శాసనంలో పర్మిటులో మిగిలిపోయిన కాల పరిమితికి పరిహారం చెల్లింపు ప్రస్తావనే వుందికాని వాటి మోటారు బండ్లను కొనాలనిలేదు.

ప్రశ్న:— వ్యాపారం పోయిన ఆపరేటర్లకు మీరేం నష్ట పరిహారం చెల్లిస్తారు?

సమా:-పర్మిటులో మిగిలిపోయిన కాలపరిమితికి బండికి నెల 1 కి రూ 200 ల చొప్పున చెల్లిస్తాము. ఒకవేళ పర్మిటుగడువు అయిపోయినప్పుడు సర్వీసు స్వాధీన పరచుకున్నట్లయితే రూ 400 లు చెల్లించడమవుతుంది.

ప్రశ్న:-వారి బస్సులను తీసుకోవడానికి మీకున్న ఇబ్బందేమిటి?

సమా:-చూడండీ, ఒక్కొక్క బస్సు ఒకో కంపెనీలో తయారై వుంటుంది. ఒకటి ఎప్పుడో ఒక సంవత్సరంలో, ఇంకొకటి ఇంకొక సంవత్సరంలో తయారైనవివుంటాయి. ఇలా అనేక రకాలుగా ప్రైవేటు బస్సులుంటాయి. వాటి బాడీలు కూడా వేర్వేరుగా వుంటాయి. వాటిల్లో సీట్లుకూడా ఒక సంఖ్యలో ఒక రకంగా వుండవు. ఇన్ని రకాల బస్సు

లను తీసుకొని మేమేం వెయ్యం? అసలు జాతీయ కరణ లోని ముఖ్యోద్దేశమేమిటంటే ప్రయాణీకులు సుఖంగా కూర్చోడానికి మంచి సీట్లతో చక్కని బస్సులను పెట్టి సౌకర్యవంతంగా రవాణా సర్వీసును నడపడం. రకరకాల పాత బస్సులన్నిటినీ తీసేసుకున్నందువల్ల పై ఉద్దేశం నెరవేరదు.

ప్రశ్న:- మరి ఆ ప్రైవేటు ఆపరేటర్లకు వేరే ఏమైనా బస్సు రూట్లు ఇచ్చారా?

సమా:- ఇస్తాము. జాతీయకరణ విస్తరింపబడనటు వంటిఇతర జిల్లాలలో కొత్త రూట్లను నడిపేటప్పుడు కొత్త దరఖాస్తుదారులకు బదులుగా వ్యాపారం పోయిన ఆపరే టర్లకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాము.

ప్రశ్న:- అదేమిటి? మీరు ఆంధ్రప్రదేశ్ అంతటాబస్సు సర్వీసులను జాతీయం చేస్తారని నేననుకుంటున్నాను.

సమా:- చేసే మాట నిజమే. కాని దానికి కొంత కాలం పడుతుంది. ఆ వేసేదికూడా దశలవారీ కార్యక్రమం ప్రకారం వెయ్యాలి.

ప్రశ్న:- ఏమిటా కార్యక్రమం?

సమా:- ప్రస్తుతం మా ఉద్దేశం ప్రకారం మూడవ పంచవర్ష ప్రణాళిక ముగిసేనాటికి 11 జిల్లాలన్నింటిలో యీ జాతీయకరణకార్యక్రమాన్ని పూర్తిచేయాలనుకుంటున్నాము. వచ్చే ఆరేండ్లలోపల ఒక జిల్లాతరువాతఒకజిల్లాకు యీకార్యక్రమాన్ని విస్తరింపజేస్తూ పోతాము. ఇలా మేము కొంత గడువు ఇచ్చినందువల్ల ప్రైవేటు ఆపరేటర్లు వారి వ్యాపారాన్ని సర్దుబాటు చేసుకోవడానికీ, కొత్త బస్సులను, ఇతర సామగ్రిని కొనడంలో వస్తాయించి వ్యవహరించడానికీ వీలు కలుగుతుంది.

ప్రశ్న:— అన్ని సర్వీసులనూ సాధ్యమైనంత తక్కువ కాలంలో తీసేసుకోవడానికి మీకు గల ఇబ్బంది ఏమిటి?

సమా:- అది చాలా కష్టమైనపని. ఎందుకో చెబుతాను వినండి. ప్రతి ఆపరేటరుకూ ఒకటో రెండో బస్సులు మాత్రమే వుంటే, అది పెద్ద సమస్య కాదు. కాని ఒక చోటి నుంచి ఒకే మేనేజిమెంటు క్రింద ఎన్నో బస్సులను నడపాల్సి వచ్చే సరికి అది చాలా పెద్ద పని అవుతుంది. అలా నడపాలంటే పెద్ద గ్యారేజీలు, వర్కుషాపులూ నిర్మించి బస్సుల నిర్వహణ సౌకర్యాలు కల్గించాలి. బస్సులను నిలపెట్టడానికి తగు స్థలం కావాలి. ఆఫీసులు పెట్టాలి. కొత్త బస్సులు కొనాలి. అందుకు డబ్బు కావాలి. బస్సు బాడీలను నిర్మించాలంటే చాలా కాలం పడుతుంది పైగా ఈ పని అంతా పరుగులు తీసికాక, ఒక క్రమ పద్ధతి ప్రకారం చేయవలసి వుంటుంది మరో విశేషం కూడా వుంది. ప్రైవేట్ సర్వీసులో అయితే ఒక కండక్టరు, ఒక డ్రైవరు బస్సును నడుపుకోగలరు కాని ప్రభుత్వమో లేక పెద్ద వ్యాపార సంస్థో సర్వీసును నడపాల్సివచ్చే సరికి అన్ని చోట్ల సుశిక్షితులైన సిబ్బంది కావాలి యంత్రాలను పర్యవేక్షించే సిబ్బందికీ, బండ్ల రాకపోకల పర్యవేక్షక సిబ్బందికీ, ఈ రెండు రకాల సిబ్బందికీ, అవసరమైన ఆఫీసర్లకూ శిక్షణ ఇవ్వవలసి వుంటుంది బండ్లను రిపేరు చేస్తూ వాటిని సక్రమ స్థితిలో వుంచడానికి నిపుణులైన పనివారు కావాలి. వారికి శిక్షణ ఇవ్వాలి ఈ కారణాలన్నింటివేత రోడ్డు రవాణాను ఒక్క రోజులో జాతీయం చేయడం పడదు

ప్రశ్న:- పూర్తిగా జాతీయం చేయడానికి ఎంత ఖర్చు అవుతుందంటారు

సమా:- మొత్తం పథకం అమలు జరపడానికి పది కోట్లు లేదా పన్నెండు కోట్లు ఖర్చుకాగలవని మా అంచనా.

ప్రశ్న:- హైదరాబాద్ రాష్ట్రంలో ప్రైవేటు ఆపరేటర్ల సిబ్బందిని రోడ్డు రవాణా శాఖలో తీసుకున్నట్లు ఇందాక చెప్పారు ఇప్పుడేంచేస్తున్నారు? ఇప్పుడు కూడా ప్రైవేటు ఆపరేటర్ల సిబ్బందిని మీరు తీసుకుంటున్నారా?

సమా:- తప్పకుండా ప్రైవేటు ఆపరేటర్ల దగ్గర విడువకుండా పని చేస్తూ వొచ్చిన డ్రైవర్లను, కండక్టర్లను, టిక్కెట్లు చెకింగ్ చేసే వారినీ, గుమాస్తాలు మొదలైన వారినీ రోడ్డు రవాణా కార్పొరేషన్ సర్వీసులోకి తీసుకుంటున్నాము.

ప్రశ్న:- అయినంటే వారంతా సర్వీసును సక్రమంగా నిర్వహించాలంటే శిక్షణ అవసరమన్నారే మరి ఆసిబ్బందితో ఎలా పని నడుపుతారు?

సమా:- చాలా ముఖ్యమైన ప్రశ్న అడిగారు. ఈ సందర్భంలో మేము కొంత రాజీ పడవలసి వచ్చే మాట నిజమే. ఇది ఒక వైపు నిరుద్యోగానికీ, రెండవ వైపు సమర్థతకూ సంబంధించిన విషయం. కాబట్టి రెంటినీ ఎలాగో సర్దు

జటు చేయాలి, జాతీయకరణ వల్ల కొందరిని నిరుద్యోగులుగా చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదు అందుచేత ప్రైవేటు సర్వీసు సిబ్బందిని తీసుకోవడానికే మేము నిశ్చయించాము. కట్టి వారితోనే చేతనైనంతవరకు పని నడుపుకుంటాము, ఇంకా ఎక్కువ మంది పనివారలకు శిక్షణ ఇవ్వాలని మా సంకల్పం. ఎలాగైనా సరే, సర్వీసు సామర్థ్యాన్ని నిలబెట్టడం మా ప్రధానాశయం.

ప్రశ్న:- అంటే దీనివల్ల ప్రైవేటు ఆపరేటర్లు నడిపిన సర్వీసుల కంటే మీ సర్వీసు అంత మరీ బాగా వుండకపోవచ్చని అనుకోవాలా?

సమా:- అలా అనుకోనక్కరలేదు ఏవిధంగా చూచినా మా సర్వీసులు బాగా సమర్థవంతంగా సమన్వయ పద్ధతిలో వుంటాయి బహుశా ఈ పోటీకి ప్రజలు ఏది బాగా వుందో గ్రహించే వుంటారనుకుంటాను రెండో విషయమేమిటంటే మేము నడిపే రకం బస్సులు. వాటిల్లో వుండే సుఖం, సౌకర్యం ప్రైవేటు బస్సులలో వుండదు ఈ విషయంలో అంతా ఏకీభవిస్తారు అసలు రివాణా సర్వీసు ఒకదాని కొకటి సమన్వయంతో పనిచేయవలసిన అవసరం ఎంతైనా వుంటుంది అటువంటప్పుడు ఒకరు ఒక బస్సు. ఇంకొకరు రెండో మూడో బస్సులను నడిపినందువల్ల సమన్వయం, సర్దుబాటు కుదరవు ఒకదానికొకదానికి పొంతన, పొందిక వుండాలి. ఇలా జాతీయం చేయడం వల్ల ప్రయాణీకులకు చక్కని సదుపాయాలు కలుగడమే గాక, సర్వీసులో పని చేసే సిబ్బందికి కూడా వారి ఉద్యోగం విషయంలో తగు రక్షణలేర్పడుతాయి. ఇవి రెండూ ముఖ్య విశేషాలే

ప్రశ్న:- దీన్ని ఇంకా కొంచెం విడమర్చి చెబుతారా?

సమా:- అలాగే, నే చెప్పొచ్చిందేమిటంటే ప్రైవేటు ఆపరేటర్ల క్రింద పనిచేసే సిబ్బందికి ఉద్యోగ రక్షణ వుండదు. కాని జాతీయం చేయబడిన సర్వీసులో ఆ రక్షణ వుంటుంది. వారిని బాగా చూస్తాము. ఈ విషయంలో సందేహమక్కర్లేదు. మీరు జిల్లాలలో బస్సుల్లో ఎన్నడైనా ప్రయాణం చేశారా? చేస్తే ప్రైవేటు ఆపరేటర్లు ఎవరైనా ప్రయాణీకులకు ఏవైనా సౌకర్యాలు కలుగజేశారా చెప్పండి. కాని మేము రూట్లను స్వాధీన పరచుకోగానే బస్సులు బైలు దేరే పెద్ద స్థలాలలోనే గాక మార్గమధ్యంలో కూడా బస్సు స్టేషన్లు నిర్మిస్తాము తెలంగాణా ప్రాంతంలో ప్రతి జిల్లా కేంద్రంలో బస్సు స్టేషనులున్న సంగతి మీకు తెలుసో లేదో అంతేగాక తాలూకా కేంద్రాలలో చిన్న చిన్న బస్సు స్టేషనులున్నాయి. బస్సులకోసం వేచి నిలబడే గ్రామస్తుల కోసం మార్గ మధ్యంలో ప్రతి 8 లేక 10 మైళ్ళకు నీడ పట్టులు నిర్మించాము. ఈ సౌకర్యాలను జాతీయ కరణ విస్తరింపబడే ప్రాంతాలన్నిటికీ కలుగజేస్తాము.

ప్రశ్న:- నెలా రెండు నెల్ల క్రితం బస్సు ఛార్జీలు మారినట్లు విన్నాము. మీరు ఏరేట్లు ఛార్జి చేస్తున్నారో చెబుతారా?

సమా:- అలాగే, 1959 మే నెలలో ప్రభుత్వం పూర్వపు ఆంధ్ర ప్రాంతంలో ప్యాసెంజర్ సీట్లపై విధింపబడే సర్‌ఛార్జీని హెచ్చించింది అందువల్ల అక్కడ ఛార్జీ 4 నయాపైసల (7 న్నర పైసలు) నుంచి 5 నయాపైసలకు (9-6 పైసలు) పెరిగింది. ఈ మార్పు ఆ ప్రాంతంలో కార్పొరేషన్ సర్వీసులకేగాక ఇతర ఆపరేటర్లందరికీ వర్తిస్తుంది. మైలు 1కి సీటు 1కి ఈ ఒక నయాపైసా పెరుగుదల సీట్లపై సర్ ఛార్జీ పేరుతో నేరుగా ప్రభుత్వ ఖజానాకే పోతుంది. అభివృద్ధి కార్యకలాపాల అమలుకు ప్రభుత్వానికి డబ్బు కావాలి. అందుచేత ఇదొక రకమైన పన్ను విధింపు. కాబట్టి కార్పొరేషన్‌కైనా, లేక ప్రైవేటు ఆపరేటర్లకైనా ప్రయాణీకులదగ్గర నుంచి ముట్టేది 4 నయాపైసాలు మాత్రమే. మిగిలిన ఒక పైసా నేరుగా ప్రభుత్వానికి చెల్లుతుంది.

ప్రశ్న:- అంటే మీరు బస్సులకు పన్ను లేవీ చెల్లించరా?

సమా:- ఆపరేటర్లు మైలు 1కి సీటు 1కి 4 నయాపైసాల చొప్పున తమ కొచ్చే ఆదాయంలోనుంచి ప్రభుత్వానికి సీటు ఒకటికి ఏడాదికి రూ. 120 చొప్పున, ఏడాదికి ఒక బస్సుకు దాదాపు 6,000 లు చెల్లిస్తారు.

ప్రశ్న:- తెలంగాణాలో కూడా 5 నయాపైసాల చార్జీయేనా? ఇంకా ఎక్కువేనని మేమనుకుంటున్నాము.

సమా:- నిజమే. తెలంగాణాలో ఛార్జీ మైలు 1కి 10.28 పైసలు కాని ప్రభుత్వ సూచన ననుసరించి 1959 జూన్ 11వ తేదీ నుంచి తెలంగాణాలో కూడా ఛార్జీ 5 నయాపైసలు చేయబడింది ఈ విధంగా ఆంధ్ర ప్రదేశ్ మొత్తంలో ప్రయాణీకుల కందరికీ ఒకే రేటు పెట్టబడింది

ప్రశ్న:- మరి ఈ విధంగా తెలంగాణాలో ఛార్జీని తగ్గించినందువల్ల ఎంత నష్టం వస్తుంది?

సమా:- ఏడాదికి రు. 12 లక్షలు నష్టపోతామని మా అంచనా.

ప్రశ్న:- ఆంధ్రలోవలెనే తెలంగాణాలోని బండ్లపై కూడా మీరు అలాంటి పన్నులు చెల్లిస్తారా ?

సమా:- తెలంగాణాలో కూడా మోటారు బండ్లపై పన్నులు క్రమేణా హెచ్చుతున్నాయి. మునిసిపాలిటీల పన్నులు కూడా ఎప్పటికప్పుడు పెరుగుతూనే వున్నాయి. త్వరలోనే తెలంగాణాలో కూడా ఆంధ్రతో సమానంగా మేము పన్నులు చెల్లింపవలసి వస్తుంది.

ప్రశ్న:- అంటే ఆంధ్ర ప్రాంతంలోని మునిసిపాలిటీలు వేరే పన్ను విధించవనా మీరు చెప్పేది ?

సమా:- అవును. ప్రభుత్వం వారు వారికి మోటారు బండ్లపై వచ్చే మొత్తం పన్ను సొమ్ములోనుంచి మునిసిపాలిటీలకు కొంత వాటా యిస్తారు. ఇలాంటి పద్ధతే తెలంగాణాలో కూడా కొన్నేండ్లలోపల ప్రవేశపెట్టబడుతుంది.

ప్రశ్న:- బస్సు ఛార్జీలను ఇంకా తగ్గించే వీలేమైనా వుందాండీ.

సమా:- వీలు లేదండీ. రోజురోజుకూ నూనె, టైర్లు, ఇతర యంత్రసామగ్రి ధరలు పెరిగి పోతున్నాయి. కార్మికులు కూడా పోనుపోను హెచ్చు సౌకర్యాలు కోరుతున్నారు. అందుచేత తెలంగాణాలో ఛార్జీలను తగ్గించడం సాధ్యపడదు. మైలు 1కి 5 నయాపైసాల రేటు స్థిరపడిపోయినట్టే. భారత దేశంలో ఇతర ప్రాంతాలలో జాతీయం చేయబడిన బస్సు సర్వీసులన్నీ ఈ రేటునే అవలంబిస్తున్నాయి.

(ఆకాశవాణి హైదరాబాదు సౌజన్యంతో)

"భారత దేశంలో ప్రణాళికలు" ఒక్క ఉన్నత జీవన ప్రమాణాల సాధనకే కాదు ప్రజానీకం అవసరాలకు, బుద్ధి చాతుర్యానికి తగిన రకం ప్రజాస్వామ్య సాధనకుకూడా ఉద్దేశించబడినవి. స్వాతంత్ర్యం, సాంఘిక న్యాయాల ప్రాతిపదికపై సంఘాన్ని నిర్మించటమే ఆశయం. ఆ సంఘంలో వ్యక్తి స్వాతంత్ర్యానికి, సాంఘిక జీవితానికి సాధ్యమైనంత విస్తృతావకాశాలు ఉంటాయి.

— శ్రీ జి. ఎల్. నందా.

*   *   *   *   *   *


మనకు కావలసినది సమైక్య భారత దేశం, ఒక్క రాజకీయ సమైక్యత చాలదు, భావ సమైక్యత కూడా కావాలి. బహుముఖాల యీ సమైక్యత సాధనే ప్రణాళికల సారాంశం.

— జవాహర్‌లాల్ నెహూ్రు


భారీపరిశ్రమల స్థాపనకు చక్కని అవకాశాలు

యూనియన్ ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి 1959 సెప్టెంబర్ 19 వ తేదిన హైదరాబాద్‌లో ఒక సభలో ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎరువుల ఫ్యాక్టరి నిర్మాణ కార్యక్రమాన్ని ఆరంభించవచ్చునని భారత ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వ చేతి పరిశ్రమల కుటీర పరిశ్రమల విక్రయశాలకు ప్రారంభోత్సవం చేస్తూ ఈ విషయం తెలిపారు ఈ విక్రయశాలకు ఇటీవలనే కొత్త తరహాగా మార్పు చేర్పులు చేయబడ్డాయి ప్రారంభోత్సవ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అధ్యక్షత వహించారు

శ్రీ శాస్త్రి తమ ప్రసంగంలో ఆహారధాన్యాల ఉత్పత్తి విషయంలో మిగులు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు ఉత్పత్తిని ఇంకా హెచ్చించడానికి ఎరువుల ఫ్యాక్టరీ అవసరమున్న మాటను అంతగా నొక్కిచెప్పవలసినపని లేదని అన్నారు ఎరువుల పరిశ్రమ రంగంలో మొట్టమొదటిసారిగా ఒక



హైదరాబాదులో చేతి పరిశ్రమలు, కుటీర పరిశ్రమల కేంద్రాన్ని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి సెప్టెంబర్ 19 వ తేదీన తెరిచారు.



కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ లాల్ బహాదూర్ శాస్త్రి 20-9-59 న కర్నూలు జిల్లా పాణ్యంలో కొత్త సిమెంటు ఫ్యాక్టరీని తెరిచారు.

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీని నెలకొల్పుతున్నందుకు శ్రీ శాస్త్రి తమ సంతోషం వెలిబుచ్చారు.

ఫ్యాక్టరీ నిర్మాణానికవసరమైన విదేశమారక ద్రవ్యం సంగతి ప్రస్తావిస్తూ దానికి కూడా తామొక మార్గాంతరం కనుగొన్నామనీ, ఫ్యాక్టరీకి కావలసిన విదేశమారక ద్రవ్యాన్ని లభింపజేయడం సాధ్యమేననీ శ్రీ శాస్త్రి తెలియజేశారు. ఫ్యాక్టరీ స్థాపన పని త్వరలో ఆరంభమవుతుంది. దీని తాలూకు సివిల్ పనులు రెండవ ప్రణాళిక కాలంలోనే పూర్తి చేయబడుతాయని ఆయన అన్నారు.

"ఇవాళ నేను మీ రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలు జరిపినప్పుడు ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో కాగితాల మిల్లు పెట్టుకోవచ్చా అని నన్ను అడిగారు. ఆంధ్రలో ఇప్పటికే రాజమండ్రిలో ఒకటి, సిర్పూరులో ఒకటి-మొత్తం రెండు పేపరు మిల్లులున్నాయి. రాజమండ్రి పేపరు మిల్లును విస్తరింపజేసే ప్రతిపాదనకూడా వుంది. ఆ విషయమై రాష్ట్రప్రభుత్వానికీ, యూనియన్ ప్రభుత్వానికీ మధ్య చర్చలు సంప్రదింపులూ జరిగి ప్రతిపాదనలకు దాదాపు తుదిరూపమివ్వబడింది. రాజమండ్రి పేపరుమిల్లును విస్తరింపజేయడంలో చిక్కులేవీ రావనే నేననుకుంటున్నాను" అని యూనియన్ మంత్రి తెలియజేశారు.

మధ్యరకం, చిన్నతరహా పరిశ్రమలను మూలకు నెట్టెయ్యకూడదని యూనియన్ మంత్రి అన్నారు. భారత ప్రభుత్వం రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికల్లో భారీ పరిశ్రమలకు హెచ్చు ప్రాధాన్యమిస్తున్నప్పటికీ చిన్నచిన్న పరిశ్రమలను ఎవరూ విస్మరించకూడదని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో భారీపరిశ్రమల స్థాపనకు చాలామంచి అవకాశాలున్నాయని యూనియన్ మంత్రి అభిప్రాయపడ్డారు.

దక్షిణ భారతానికి ధాన్యాగారమై విలసిల్లుతున్నందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శ్రీశాస్త్రి అభినందిస్తూ విదేశాలలో విక్రయానికి చక్కని విలువున్నట్టి వాణిజ్య పంటల ఉత్పత్తిని హెచ్చించవలసిందిగా ఆయన ఉద్బోధించారు.

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి తమ అధ్యక్షోపన్యాసంలో ఎరువుల ఫ్యాక్టరీ విషయమై యూనియన్‌మంత్రి చేసిన ప్రకటనకు ఆంధ్రుల తరపున తాము కృతజ్ఞతలు చెప్పుకుంటున్నామని అన్నారు. మధ్యరకం, చిన్నతరహా పరిశ్రమలు ప్రభుత్వ రక్షణ లేనిదే నిలవజాలవనిఅన్నారు. అందుచేత కొన్ని కొన్ని రంగాలు ఆ పరిశ్రమలకు కేటాయించి వాటికి ప్రభుత్వం తగురక్షణ యివ్వాలి. చేతి పరిశ్రమల స్థితి మరీ కష్టంగా వుంది. ఎందుకంటే ఆ పరిశ్రమలు అంత కష్టపడి చక్కని వస్తువులు తయారు చేస్తే వాటిని సాధారణజనంకొనలేరు విలాస వస్తువులుగనక డబ్బుగలవారుమాత్రమే కొనగలరు.అందుచేత వాటికి విదేశ మార్కెట్లను చూడవలసిన అగత్యం కలుగుతుంది. కాబట్టి చిన్నరకం కుటీర పరిశ్రమల రక్షణకై అవసరమైతే ఒక చట్టాన్ని అమలులోకి తేవాలని ముఖ్యమంత్రిఅన్నారు.

రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీ అనగాని భగవంతరావు తమస్వాగతోపన్యాసంలో మూడవ పంచవర్ష ప్రణాళికలో భారతప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోర్కెలను పరిగణించి సానుభూతితో వ్యవహరించవలెనని అన్నారు. ఈ రాష్ట్రంలో కుటీరపరిశ్రమలలో, చేతిపరిశ్రమలలో కృషి చేస్తూవున్న పారిశ్రామిక సహకార సంస్థలకుఅప్పులులభింప జేయడానికై జపానుదేశ పద్ధతిమాదిరిగా ఒకప్రత్యేకఏజన్సీని నెలకొల్పే విషయాన్ని కేంద్రప్రభుత్వం పరిశీలించవలెనని ఆయన అన్నారు.

చిన్న పరిశ్రమల కార్పొరేషన్ను స్థాపించి, దానికి ప్రతి జిల్లా కేంద్రంలో ఒక బ్రాంచీని నెలకొల్పవలెనన్న సూచనను ప్రభుత్వం పరిశీలిస్తూవుందని మంత్రి తెలియజేశారు.

మరొక సిమెంటు ఫ్యాక్టరీ

యూనియన్ వాణిజ్య పరిశ్రమల మంత్రి 21–9–1959 తేదీన పాణ్యం సిమెంట్సు అండ్ మినరల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వారి పోర్టులాండ్ సిమెంటు ఫ్యాక్టరీ ఉత్పత్తి కార్యక్రమానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ ఫ్యాక్టరీ కర్నూల్ జిల్లాలో బుగ్గానిపల్లివద్ద సిమెంట్‌నగర్‌లోవుంది.

ఆ తరువాత యూనియన్ మంత్రి రాష్ట్రప్రభుత్వంతో చర్చలు జరిపారు ఆ చర్చలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రోటోటైప్ మిషనరీ ఫ్యాక్టరీ స్థాపనవిషయం ఆలోచింపబడింది.

—— :*: ——

ముందున్న పని కష్టమైనది, చిన్న ఆరంభం జరిగింది. చిత్తశుద్ధితో కృషి చేస్తే, యీ నాడు మనం నాటుతున్న చిన్న విత్తనం అంకురించి కాలక్రమేణా మహా వృక్షమై దశదిశల విస్తరించ గలదు. కాబట్టి, యీ కార్యక్రమ (అభివృద్ధి) నిర్వహణతో ప్రత్యక్షమైన సంబంధం ఉన్నా లేకపోయినా అంతా దీనికి తోడ్పడి దీనిని విజయవంతం చేయాలని విజ్ఞప్తి. ఈ మహా యత్నంలో ప్రభుత్వము, ప్రజానీకము పట్టాపట్టాలు వేసుకొని సాగిపోతారని ఆశిస్తూ అలా జరగాలని ప్రార్థిస్తున్నాను.

— రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్.

సాంస్కృతిక సంపద రక్షణ

యుద్ధ సమయంలో సాంస్కృతిక సంపద రక్షణ నిమిత్తం సంతకాలకై ఒక ప్రణాళిక తయారు చేయబడింది. దీనిని భారత ప్రభుత్వ ప్రతినిధులు, తదితర రాజ్యాల ప్రతినిధులు హేగ్‌లో 1954 మే 14 న ప్రారంభించారు. ఆ తరువాత యీ ప్రణాళికను భారత ప్రభుత్వం ఆమోదించింది. అది అమలులోనికి వచ్చింది.

యుద్ధ సమయంలో రాగలవని భావించిన ప్రమాదాల నుంచి తమ తమ భూభాగాలలోగల సాంస్కృతిక సంపద రక్షణకై సంతకం చేసిన రాజ్యాలు, శాంతికాలంలో తమకు తగినవని తోచిన చర్యలను తీసుకుంటాయి. ఒప్పందం చేసుకున్నవారు యుద్ధ సమయంలో అట్టి సంపద విషయంలో ఏ విధమైన శత్రు చర్యలను తీసుకొనరు. అంతేకాక ఏ రూపంలోనూ అది చౌర్యం, దోపిడి, దుర్వినియోగాలకు గురికాకుండా సర్వవిధాలా రక్షిస్తారు.

యుద్ధ సమయంలో, "ప్రత్యేక రక్షణ" క్రిందగల సాంస్కృతిక సంపద ప్రత్యేకమైన చిహ్నం కలిగి అంతర్జాతీయ ఆధిపత్యం క్రింద ఉంటుంది.

భద్రత ప్రయోజనాలతో వైరుధ్యంలేని మేరకు, సాంస్కృతిక సంపద రక్షణలోనున్న సిబ్బంది, అట్టి సంపద ప్రయోజనాలకై, గౌరవింపబడుతుంది. ఒకవేళ వారు ప్రతికక్షి వశమైతే, వారు బాధ్యులైన సాంస్కృతిక సంపదకూడా ప్రతికక్షి వశమైన సందర్భాలలో వారు తమ విధి నిర్వహణను కొనసాగించటానికి అనుమతి ఇవ్వబడుతుంది.

తమ తమ సాంస్కృతిక సంపద రక్షణ ఏర్పాట్ల విషయంలో కాని, ప్రస్తుత ప్రణాళిక లేక దాని అమలు నిబంధనల వర్తింపులో ఉత్పన్నం కాగల ఏ సమస్య విషయంలోనైనా కాని సంతకం చేసిన దేశాలు ఐక్యరాజ్య సమితి విద్యావైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ తోడ్పాటును అడుగవచ్చు. ఆ సంస్థ తన కార్యక్రమం, వనరులు వీలిచ్చిన మేరకు సహాయం చేస్తుంది.

మన ప్రజలలో చైతన్యం కలిగింది. మన అధికారులు సంగ్రామం ముందున్నారు. మన నాయకులు మన ప్రక్క వున్నారు. "రేపు" మనను పిలుస్తున్నది. "నిన్న" ముందుకు తోస్తున్నది. ప్రొఫెసర్ టాయన్బీ అభిప్రాయంలో భారతదేశంలో సమాజాభివృద్ధి నేడు ప్రపంచంలో జరిగే విషయాలలోకెల్లా ప్రాముఖ్యమైనది. ఇంతవరకు వలెనే ఇకముందు కూడా యీ వుద్యమాన్ని ఓరిమితో, పటుదలతో, ఉత్సాహంతో నడపగలిగినట్లయితే అది చరిత్ర గతినే మార్చుతుంది.

— శ్రీ ఎస్. కె. దే.

వరద బీభత్సం


ప్రతి సంవత్సరాలలోవలె మొన్న సెప్టెంబర్‌లో గోదావరి మళ్ళీ ఉధృతంగా పొంగి, తీరానగల రాజమండ్రి మున్నగు ప్రదేశాలను గడగడలాడించింది. గోదావరిగట్లు, పొంగి ప్రవహించే నది యెంత తాకిడిచేసినా నెల్లాళ్ళపాటు చెక్కుచెదరలేదు. కాని ఆఖరికి ధవళేశ్వరం ఆనకట్ట దిగువన గండిపడింది.

సెప్టెంబర్ 17 న యీ నది యెడమగట్టు గౌతమిపాయ పైగల ధవళేశ్వరానికి 20 మైళ్ళ దిగువన తెగిపోయింది. ఆ రాత్రి 9 గంటల ఆ ప్రాంతాల అరవయి అడుగుల పొడుగున గండి పడింది. గండి వెడల్పు అతి త్వరితంగా రెండువందల అడుగులకి పెరిగిపోయింది. దానితో నది యెడమవైపునగల విస్తార ప్రదేశాలు జలమయమయిపోయినవి. తూర్పు గోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకాలో సుసంపన్నమయిన పది గ్రామాలలో విస్తారమయిన సుక్షేత్రాలు జలమయమయినవి. నది పొంగి పొర్లి ప్రవహించినందున ప్రవాహానికి యెగువనగల భద్రాచలం మున్నగు పట్టణాలుకూడ వరదకు గురి అయినవి.


వరదవల్ల ఖమ్మంజిల్లా బూర్గంపాడు తాలూకాలో అరవయి గ్రామాల వరకు బాగా నష్టపోయినవి. ఈ ప్రాంతంలో పదివేల యెకరాలలోని ఆహార పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. ఏభయివేల మంది ప్రజలు నిరాశ్రయులయినారు.



16-9-59న రాజమండ్రిలో ముఖ్య మంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రజలతో మాట్లాడుతున్న దృశ్యం. ప్రజలు యీ మహా విపత్తును ఎంత వీరోచితంగా ఎదుర్కొన్నారో వారి ముఖాలను చూస్తే తెలుస్తుంది.



గోదావరి వరద సమయంలో రాజమండ్రీ రైలు వంతెన దృశ్యం.



భద్రాచలంలో వరద దృశ్యం. చిత్రంలో శ్రీరామాలయాన్ని చూడవచ్చు.


అంతకు ముందు అనగా సెప్టెంబర్ 11 వ తేదీనాటికి దిగువ కోరింగ ద్వీపంపై 'టైడల్ బ్యాంకు'లకు ఆరు ఫర్లాంగుల వెడల్పుగల గండి పడింది.

ఈ రెండు గండిలు కాక అక్కడక్కడ మరికొన్ని పెద్దగండిలు పడ్డాయి. ఇవి తక్షణం మరమ్మతు చేయబడినవి. తూర్పు గోదావరి జిల్లా మధ్య డెల్టాలో చిన్న చిన్న దీవులు యిరవయికి పైగా మునిగిపోయాయి. రాజోలు తాలూకాలో *22* గ్రామాలకు దెబ్బతగిలింది. *400* కుటుంబాలను స్థలాంతరానికి తరలించవలసి వచ్చింది.

పశ్చిమ గోదావరి జిల్లాలో నర్సాపురానికి సమీపంలో వరదగట్టు అక్కడక్కడ రెండుమైళ్ళ పొడుగున తెగిపోయింది. ఈ ప్రాంతంలో 25 గ్రామాలవరకు నష్టపోయాయి. మురుగుకాలువలు తోడై పెక్కు గ్రామాలలో నీరు నిలిచింది. సిద్ధవటం, దిడ్డిపట్లలవద్దకూడా వరదగట్టు తెగిపోయింది. ఈ జిల్లాలో *200* గ్రామాల వరకు దెబ్బతిన్నాయి.

కిన్నెరసానిపైగల కాన్‌వే కొట్టుకుపోయింది.

ఈ వరదలవల్ల తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో



ధవళేశ్వరంలో వరద దృశ్యం.

రూ. 4. 5 కోట్ల నష్టం కలిగినట్లు అంచనా వేయబడింది. పంటల నష్టమే—ముఖ్యంగా వరిపంట-రూ 3.5 కోట్లవరకు వుంటుందని చెప్పబడుతున్నది. తూర్పు గోదావరిజిల్లా 14 తాలూకాలలోను తొమ్మిది తాలూకాలలో నదీతీరాన, డెల్టాలోనుగల 450 గ్రామాలలో మొత్తం25,000గుడిసెలు, యిళ్ళు కొట్టుకుపోయాయి. తూ గోదావరి జిల్లాలో లక్ష యెకరాలలో పంటలు నష్టమయాయి ఇందులో 80,000 యెకరాలు వరిపంట క్రింద వున్నాయి. ఒక్క దీని మూలం గానే రూ. 1.5 కోట్ల వరకు నష్టం ఏర్పడింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 1.25 లక్షల యెకరాలలో గల పంటలు పాడయ్యాయి

గోదావరికి కూళ్ళ సమీపంలో పడిన గండి వల్ల 65,000 యెకరాల పరిపొలాలతో సహా 70 గ్రామాలు మునిగిపోయాయి. ముఖ్యంగా స్వల్పకాలంలో నూర్పుకు రానున్నరసంగి—బసంగి వరిచేలు దెబ్బతిన్నాయి.

రక్షణ కృషి

కూళ్ళ వద్ద గండి పడుతుందని యెవరూ అనుకోలేదు. అధికారుల అప్రమత్తతవల్ల కాని లేకపోతే పెక్కు యితరచోట్ల నది గట్లను దాటి ప్రవహించి వూహాతీతమయిన నష్టాన్ని కలిగించి వుండేది. అన్ని శాఖల అధికారులు కలసి పనిచేశారు గట్ల రక్షణకు వారు సకల చర్యలు తీసుకున్నారు పల్లపు ప్రాంతాలలో నివసించే వేలాది ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు అదృష్టవశాత్తూ ప్రాణ నష్టమేమీ సంభవించలేదు. ప్రతి తాలూకాకు రక్షణ, శరణార్థి శిబిరాలు ఏర్పాటు చేయబడ్డాయి.

అవసరమయిన చోటెల్లా అవసరమయిన మేరకు భూమి శిస్తు రెమిషన్ యివ్వబడింది. ఎరువులు సరఫరా చేయబడినవి. గృహ నిర్మాణం విషయంలో సహాయం చేయబడింది.

రక్షణ కార్యక్రమం, ఆహార పంపిణీలకు తోడ్పడటానికి రాష్ట్రప్రభుత్వం మూడు ఐ.ఎ.ఎఫ్. విమానాలను తీసుకున్నది. గోదావరి జిల్లాల కలక్టర్లకు తగినన్ని బియ్యం సరఫరా చేయబడినవి అవి ఆర్తుల వద్దకు పురికించబడినవి

ఈ వరదల మాట తెలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి తమ అనంతపురం పర్యటనను రద్దుచేసుకుని సెప్టెంబర్ 16 న విమానంనుంచి దెబ్బతిన్న ప్రాంతాలను చూశారు. ఇతర మంత్రులు, అధికార్లతో కలిసి ఆయన రాజమండ్రీలోని ఉద్యోగులతో వరద నివారణకు, రక్షణకు తీసుకోవలసిన చర్యలను గురించి చర్చించారు.

రాజమండ్రీలో ఒక వరద నివారణ మందిరం ఏర్పాటు చేయబడింది. రక్షణ, సురక్షిత ప్రదేశాలకు ప్రజల తరలింపు మున్నగు జరూరు పనులను అది నిర్వహించింది. అది రాత్రింబగళ్లు పనిచేసింది. ఈ అత్యవసర పరిస్థితి నెదుర్కొనటానికి అధికారులు లారీలు, బోట్లు, అందుబాటులోనున్న తదితర రవాణా సాధనాలను తీసుకున్నారు. లంకలలోని ప్రజలు సమర్థంగా దాటింపబడ్డారు.


సెప్టెంబర్ 17 నుంచి వరద తగ్గుముఖం పట్టింది. 1956-57, 1957-58 లలో గట్లను బలపరచటానికి రూ. 50-60 లక్షలు ఖర్చుచేయ బడినవి.

ఈ విషయంలో ప్రభుత్వం కనబరచిన చురుకుతనం పత్రికా ప్రపంచం ప్రశంసలనందుకున్నది వరదలవల్ల కలిగే అపార నష్టాలదృష్ట్యా శాశ్వత వరదగట్టుల నిర్మాణానికి చర్య తీసుకోవాలని అన్ని పత్రికలు వ్రాశాయి. నది పొడుగునా గట్లను యెత్తుచేసి బలపరచటానికి చాలా పని పడుతుందని, శాశ్వత వరదనివారణ చర్యగా యెంత ఖర్చు అయినా దీనిని జరిపించాలని చెప్పబడింది. పోచంపాడు ప్రాజెక్టువల్ల వరదలు కొంతవరకు అదుపులోనికి రాగలవని అభిప్రాయం వెలిబుచ్చబడింది. గోదావరిపై మరొక పెద్ద ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని సూచించబడింది. గోదావరిపై యెక్కువ ప్రాజెక్టులను నిర్మించి దాని జలాలను కృష్ణా నదిలోనికి మళ్ళించటం అవసరమన్న ముఖ్యమంత్రి సూచనను పత్రికలవారు ముక్తకంఠంతో బలపరిచారు,

ఎర్రకాలువ వరద

రెండు దశాబ్దాలలో తొలిదొ౽ త్తగా ఎర్రకాలువకు ఆరు వారాలలో ముమ్మారు వరదవచ్చింది. తెలంగాణా జిల్లాల్లోను, పశ్చిమ గోదావరి జిల్లా వుత్తర భాగంలోను కురిసిన అధిక వర్షాలు యిందుకు కారణం.

ఈ వరదలవల్ల వరి మున్నగు పంటచేలు మునిగిపోయినవి. తాడేపల్లిగూడెం, తణుకు, కొవ్వూరు తాలూకాల గ్రామాలకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న ప్రాంతంలోగల పైరుపంటలు యివి: బుడమ, బసంగి, అక్కుళ్లు, కృష్ణ కాటుకలు(వరి), వర్జీనియా పొగాకు, మిర్చి. నువ్వు. కాయగూరలు, తోటలు, చెఱకు.



జలమయమైన రాజమండ్రీ రైలు స్టేషను, వీధులు.

"ఆంధ్ర ప్రదేశ్" ప్రకటన రేట్లు

"ఆంధ్రప్రదేశ్" పత్రికలో ఈ దిగువ రేట్లప్రకారం ప్రకటనలు స్వీకరించబడగలవు.

వివరాలు	మూడు భాషల పత్రికలకు			ఒక భాష పత్రికకు		
	పూర్తి పేజీ రూ	సగం పేజీ రూ	పావు పేజీ రూ	పూర్తి పేజీ రూ	సగం పేజీ రూ	పావు పేజీ రూ
లోపలి పేజీ	200	125	75	100	55	30
వెనుకవైపు కవరు పేజీ	350	—	—	150	—	—
2, 3 కవరు పేజీలు	250	—	—	125	—	—

ఒక సంవత్సరం కొరకు స్థలమును కంట్రాక్టు తీసుకొన్నవారికి 20 శతి రిబేటు ఇవ్వబడుతుంది


షరతులు

1. సాంకేతిక వివరాలు· $10\frac{3}{4} \times 8\frac{1}{2}$"డెమ్మీ.
2. ముందరి టైటిల్ పేజీపై ప్రకటనలు వేయబడవు.
3. పావు పేజీకంటే తక్కువ ప్రకటనలు స్వీకరించబడవు.
4. ప్రకటించవలసిన విషయము, అది వేయబడవలసిన స్థలము మొదలగు వివరాలూ, దానికయ్యే మొత్తమూ ప్రతినెల 8 వ తేదీలోపుగా ఈ కార్యాలయానికి చేరినట్లయితే, ఆ ప్రకటన మరుసటి నెల పత్రికలో ప్రచురింపబడుతుంది. ప్రకటనకయ్యే మొత్తమును మనియార్డరు ద్వారాగాని, లేక క్రాస్‌చేయబడని డిమాండు డ్రాఫ్ట్‌ద్వారాగాని పంపవలెను. డిమాండుడ్రాఫ్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధముల శాఖ డైరెక్టర్, హైద్రాబాదు-దక్కన్ పేరిట వ్రాయబడవలెను.
5. ప్రకటన నిమిత్తమై పంపబడు బ్లాకుల విషయంలో తగు జాగ్రత్త వహింపబడుతుంది. అయితే మిషను మీద బ్లాకులు గనుక పగిలిపోయినట్లయితే అందుకు ఈ శాఖ బాధ్యతవహించదు.
6. ప్రకటన ఎంతస్థలంలో ఏవైనం ప్రకారం వేయవలసిందీ, ఒక భాష పత్రికలో వేయవలెనా, లేక మూడు భాషల పత్రికలలో వేయవలెనా అనే వివరాలను స్పష్టంగా తెలియపరచాలి. ఉత్తర ప్రత్యుత్తరాలను, పైకమును ఈ దిగువ చిరునామాకు పంపవలెను.

డైరెక్టర్,
సమాచార, పౌరసంబంధముల శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
హైద్రాబాదు దక్కన్—1.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం		1,060,41 చదరపు మైళ్ళు
జనసంఖ్య	..	3 12,60 1з3
పురుషులు	...	1 576;42 912
స్త్రీలు	..	1,55 17,221
సగటు వర్షపాతము:		
ఆంధ్ర ప్రాంతం	...	34 6 అంగుళాలు
తెలంగాణా	...	36.7 ..
అరణ్య ప్రదేశం	...	1 40,26 000 ఎకరాలు
జిల్లాలు	..	20
తాలూకాలు	...	183
రెవిన్యూ సర్కిళ్లు	.	1,000
పట్టణాలు	...	293
గ్రామాలు	. .	26 450
పంటలక్రింది ప్రదేశం	...	2 93 81 000 ఎకరాలు
1955-56 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం	..	66 8 లక్షల ఎకరాలు
కౌళ్ళ సంఖ్య	...	42.42 655
1958-59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు	..	61 56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	...	15 5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	...	2 902 మైళ్ళు
జాతీయ రహదార్లు	...	1,409 ..
రాష్ట్ర రహదార్లు	...	2,072 ..
జిల్లా పెద్ద రోడ్లు	...	2.527 ..
జిల్లా ఇతర రోడ్లు	...	3,458 ..
పాఠశాలలు	...	28,000
కళాశాలలు	...	64
వృత్తి విద్యా కళాశాలలు	..	31
ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక ప్రమాణం	రూ.	175.37 కోట్లు
1959–60 బడ్జెటు:		
ఆదాయం	రూ.	71 29 కోట్లు
వ్యయం	... ,,	71.66 ,,
పెట్టుబడి ఖర్చు	... ..	28 30 ,,



హైదరాబాదులో నయాపూల్‌ను దాటుతున్న రెండంతస్థుల ఆర్.టి.సి. బస్సు .. వెనుక ఉస్మానియా ఆస్పత్రి ఉంది.